# నేటి సాక్షి

తెలుగు దిన పత్రిక | TGTEL/25/A1737 | వాస్తవాలే వార్తలుగా..

16.04.2026 గురువారం Thursday | సంపుటి (volume): 1 సంచిక (Issue): 263 | పేజీలు : 10 Pages : 10 | వెల రూ. 2.00 | Published from : Hyderabad Circulated to : Telangana



రిపోర్టర్లు కావలెను

జర్నలిజంలో ఆసక్తి ఉన్నవారికి నేటి సాక్షి ఆహ్వానం పలుకుతుంది.

తెలుగు రాష్ట్రాలలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిలో రిపోర్టర్లుగా పని చేయుటకు ఆసక్తి, అనుభవం ఉన్నవారు ఈ క్రింది నంబర్లకు కాల్ చేసి సంప్రదించగలరు.

9119949944

7897222788 - 7897222789


# మహిళా బిల్లుకు సై.. డీలిమిటేషన్‌కు నై!



## కేంద్రం కుట్రలను అడ్డుకుంటాం

### ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే

- రిజర్వేషన్ల ముసుగులో రాజకీయ కుతంత్రం..
- ఇండియా కూటమి కీలక భేటీ
- జనాభా లెక్కలు లేకుండా పునర్విభజన ఎలా?
- పార్లమెంటులో ఐక్య పోరాటానికి పిలుపు
- నేటి నుంచి పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు..
- ఉభయ సభల్లోనూ సెగలు రేపనున్న బిల్లుల సవరణ

**పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న మహిళా రిజర్వేషన్లు, నియోజ కవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) బిల్లులపై ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ తన వ్యూహాన్ని ఖరారు చేసింది. మహిళా రిజర్వేషన్ల బిల్లుకు బేషరతుగా మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించిన కాంగ్రెస్, అదే సమయంలో డీలిమిటేషన్ బిల్లును మాత్రం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు స్పష్టం చేసింది.**

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 15:** పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న మహిళా రిజర్వేషన్ల బిల్లు, డీలిమిటేషన్ బిల్లుపై కాంగ్రెస్ సంచలన నిర్ణయం తీసుకుంది. మహిళా రిజర్వేషన్ల బిల్లుకు మద్దతు తెలిపిన కాంగ్రెస్.. డీలిమిటేషన్ బిల్లును మాత్రం వ్యతిరేకిస్తామని ప్రకటించింది. కాగా, దేశవ్యాప్తంగా నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ బిల్లులకు రంగం సిద్ధమైంది. ఈ రెండు బిల్లులను ఏప్రిల్ 16 నుంచి ప్రారంభం కానున్న పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో ప్రవేశపెట్టేందుకు కేంద్రం రెడీ అయింది. ఈ క్రమంలో పార్లమెంట్‌లో అనుసరించాల్సిన వ్యూహాలు, బిల్లులకు మద్దతు ఇవ్వాలా వద్దా అనే అంశంపై చర్చించేందుకు కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి బుధవారంఢిల్లీలోని ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే నివాసంలో భేటీ అయ్యింది. దాదాపు రెండు గంటల పాటు జరిగిన ఈ సమావేశంలో

మిగతా 2 లో

## నేటి నుంచి పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు

- మహిళా బిల్లు, డీలిమిటేషన్‌పై చర్చ
- ప్రభుత్వ తీరుపై విపక్షాల అసహనం

4





## భగభగమంటున్న భానుడు

### 43 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు

- పలు జిల్లాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్
- మరో మూడు రోజులు వడగాల్పుల తీవ్రత
- 44 డిగ్రీలకు చేరనున్న ఎండల వేడి
- అప్రమత్తంగా ఉండాలని అధికారుల హెచ్చరిక

తెలంగాణలో భానుడు భగభగమంటున్నాడు. రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ఎండలు 43 డిగ్రీలు దాటాయి. వాతావరణ కేంద్రం హైదరాబాద్ సహా పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. రానున్న మూడు రోజుల్లో వడగాల్పుల తీవ్రత పెరిగి ఉష్ణోగ్రతలు 44 డిగ్రీలకు చేరే అవకాశం ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. ఈ మేరకు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ సూచించింది.


వివరాలు 2లో

## మీసేవ కేంద్రాలపై ఏసీబీ మెరుపు దాడులు

- అదనపు వసూళ్ల ఫిర్యాదుతో అధికారుల తనిఖీలు
- ఖైరతాబాద్, అంబర్‌పేట, అల్వాల్‌లో సోదాలు



2



## పాటలే తెలుసు స్కామ్‌లు తెలియవు

మీడియా ముందు సింగర్ మంగ్లీ ఆవేదన తప్పు చేస్తే ఏ శిక్షకైనా సిద్ధమని వెల్లడి ఐదుగురు వ్యక్తులపై డీజీపీకి ఫిర్యాదు

.. వివరాలు 2లో



## ప్రాతినిధ్యం తగ్గితే సహించం

- డీలిమిటేషన్‌తో దక్షిణాదికి అన్యాయం జరిగితే ప్రజా ఉద్యమం తప్పదు
- కేంద్ర ప్రభుత్వానికి కేటీఆర్ హెచ్చరిక

.. వివరాలు 3లో

## పర్యాటక అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

పులిగుండాలను ఉత్తమ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతాం

మంత్రి పొంగులేటి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడి

9





## మహిళా సాధికారతకు మోదీ పెద్దపీట

- నారీ శక్తి వందన్ బిల్లుతో చారిత్రాత్మక మార్పులు
- వరంగల్ అభివృద్ధిపై రామచందర్ రావు ప్రశంసలు

.. వివరాలు 3లో

## ఏసీబీ వలలో హుజూరాబాద్ మున్సిపల్ ఏఈ

- రూ. 50 వేల లంచం తీసుకుంటూ దొరికిపోయిన సుధాకర్ రెడ్డి

.. 2లో

## భూసేకరణకు వ్యతిరేకంగా నిరసన

- జాగృతి అధ్యక్షురాలు కవిత అరెస్ట్
- బలవంతపు సేకరణను అడ్డుకుంటామని స్పష్టీకరణ
- వికారాబాద్‌లో రైతులతో కలిసి కవిత బైఠాయింపు
- పారిశ్రామికీకరణ ముసుగులో భూదోపిడీ అని విమర్శ
- ఉదయం నుంచి నిరసనలతో హోరెత్తిన వీధులు

3





## మహిళా రిజర్వేషన్లపై కుట్రలు సాగవు

తెలంగాణ రాష్ట్ర హక్కుల కోసం తన గొంతు వినిపిస్తున్నానని బీజేపీ రాజ్యసభ సభ్యుడు కే. లక్ష్మణ్ తెలిపారు. తెలంగాణ కోసం సీఎం రేవంత్ రెడ్డి ఏం చేశారని ఆయన ప్రశ్నించారు. తుపాకీ పట్టుకొని ఆయన ఎవరి పక్కన నిలుచున్నారో అందరికీ తెలుసని వ్యాఖ్యానించారు.

- రాహుల్ కేరళ పోటీపై సీఎం సమాధానం చెప్పాలి
- రేవంత్ తీరుపై ఎంపీ లక్ష్మణ్ ఆగ్రహం


3

## అమెరికాకు ఇరాన్ భారీ 'బిల్'!



- రూ. 25 లక్షల కోట్ల పరిహారం ఇస్తేనే శాంతి చర్చలు.. తేగేసి చెప్పిన టెహ్రాన్
- యుద్ధ నష్టం పూడ్చాల్సిందేనన్న ఇరాన్..
- హోర్ముజ్ జలసంధిపై పన్ను విధింపు యోచన

.. వివరాలు 4లో



## కాల్పుల విరమణ గడువు పొడిగించే ఛాన్స్ లేదు

- శాశ్వతమైన ఒప్పందం వైపే మొగ్గు చూపుతున్నాం
- ట్రంప్ మరోమారు కీలక వ్యాఖ్యలు

నేటి సాక్షి
TGTEL/25/A1737 | NETI SAKSHI
కరీంనగర్ | గురువారం 16 ఏప్రిల్ 2026



# మీసేవ కేంద్రాలపై ఏసీబీ మెరుపు దాడులు

**అదనపు వసూళ్ల ఫిర్యాదులతో అధికారుల తనిఖీలు**

**ఖైరతాబాద్, అంబర్‌పేట, అల్వాల్‌లో సోదాలు**

**హైదరాబాద్, ఏప్రిల్ 15:** తెలంగాణవ్యాప్తంగా మీసేవ కార్యాలయాల్లో ఏసీబీ సోదాలు నిర్వహిస్తోంది. ఖైరతాబాద్, అంబర్‌పేట, అల్వాల్‌లోని మీసేవ కేంద్రాల్లో ఏసీబీ అధికారులు బుధవారం తనిఖీలు చేపట్టారు. పౌర సేవల పత్రాల జారీలో దళారుల ద్వారా సిబ్బంది భారీగా డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తిన నేపథ్యంలో ఏసీబీ రంగంలోకి దిగింది. సోదాల్లో భాగంగా మీసేవ సిబ్బంది ప్రజల నుంచి నిబంధనలకు విరుద్ధంగా నగదు వసూలు చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ సోదాలకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. మీసేవ కేంద్రాల్లో దోపిడీ ఎక్కువైపోయిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సర్వీస్ ఛార్జీల పేరుతో సిబ్బంది చేస్తున్న దోపిడీకి అడ్డుఅదుపు లేకుండా పోయిందని జనం ఆరోపిస్తున్నారు. కుల, ఆదాయ, నివాస, జనన, మరణ ధృవీకరణ పత్రాల కోసం వెళ్తే సామాన్యులను నిలువునా దోచుకుంటున్నారు. సాంకేతికతతో పౌర సేవలను సులభతరం చేస్తున్నామని చెప్తున్న పాలకులు.. అన్ని సేవలను మీసేవ కేంద్రాలకు అప్పగించి చేతులు దులుపుకుంటున్నారు. దీంతో నిర్వాహకులు అందినకాడికి దండుకుంటున్నారు. కుల, ఆదాయ, నివాస, కుటుంబ సభ్యుల ధృవీకరణ, ఓబీసీ పత్రాల కోసం 45 రూపాయలు చెల్లిస్తే సరిపోతుంది. కానీ ఈ ఫీజు ఎక్కడా అమలు కావడం లేదు. ఒక్కో పత్రానికి 500 నుండి 1000 రూపాయల వరకు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. దరఖాస్తు చేసేటప్పుడే కాకుండా సర్టిఫికేట్లు ప్రింట్ తీసుకునే సమయంలో కూడా అదనంగా నగదు వసూలు చేస్తున్నారు. అఫిడవిట్లు సమర్పించాలనే నిబంధనలను సాకుగా చూపి వందల్లో దండుకుంటున్నారు. మీసేవ కేంద్రాల్లో తప్పనిసరిగా ధరల పట్టిక ఏర్పాటు చేయాల్సి ఉన్నా చాలా చోట్ల అది కనిపించడం లేదు. అదనపు వసూళ్లకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. బాధితులు డయల్ 1100 లేదా 18004251110 నంబర్లకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

# ఏసీబీ వలలో మున్సిపల్ ఏఈ

**రూ. 50 వేల లంచం తీసుకుంటూ దొరికిపోయిన సుధాకర్ రెడ్డి**

**ఎం-బుక్ లో నమోదు కోసం కాంట్రాక్టర్ నుంచి వసూళ్లు**



**కరీంనగర్, ఏప్రిల్ 15:** హుజూరాబాద్ మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ) సుధాకర్ రెడ్డి లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా చిక్కారు. పట్టణంలో నిర్మించిన స్టోర్మ్ వాటర్ డ్రైనేజీ పనుల ఫైనల్ బిల్లులను మెజర్మెంట్ బుక్ (ఎం-బుక్) లో నమోదు చేసేందుకు ఒక కాంట్రాక్టర్ నుంచి రూ. 50 వేలు లంచం డిమాండ్ చేశారు. బుధవారం హుజూరాబాద్ ఆర్టీసీ డిపో చౌరస్తా వద్ద సంతోష్ కుమార్ అనే కాంట్రాక్టర్ నుంచి ఈ నగదు తీసుకుంటుండగా అధికారులు ఆయన్ను పట్టుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. హుజూరాబాద్ మున్సిపల్ కార్యాలయంలో ఏఈగా పనిచేస్తున్న సుధాకర్ రెడ్డి ఫైనల్ బిల్లుల ప్రక్రియ పూర్తి చేయాలంటే డబ్బులు ఇవ్వాలని కాంట్రాక్టర్‌ను వేధించారు. దీంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. పక్కా ప్రణాళికతో దాడులు నిర్వహించిన అధికారులు ఏఈని పట్టుకొని ఆయన వద్ద నుంచి లంచం సొమ్మును స్వాధీనం చేసుకున్నారు. వాటర్ డ్రైనేజీ పనులకు సంబంధించిన బిల్లుల మంజూరు విషయంలో ఈ అవినీతికి పాల్పడినట్లు అధికారులు గుర్తించారు. నిందితుడు సుధాకర్ రెడ్డిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు అధికారులు వెల్లడించారు. తదుపరి విచారణ నిమిత్తం ఆయన్ను కరీంనగర్ ఏసీబీ కోర్టులో ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పనుల బిల్లుల మంజూరు కోసం లంచం ఆశించే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా అధికారులు హెచ్చరించారు. ఈ దాడుల్లో ఏసీబీ డీఎస్పీతో పాటు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# హనుమాన్ మాల ధరించిన విద్యార్థికి అవమానం

**హెడ్మాస్టర్ తీరుపై తల్లిదండ్రుల ఆగ్రహం**



**జయశంకర్ భూపాలపల్లి, ఏప్రిల్ 15:** హనుమాన్ మాలలో వచ్చిన విద్యార్థిని పాఠశాలలోకి అనుమతించకపోవడంపై తల్లిదండ్రులు మండిపడుతున్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ఓ పాఠశాలలో ఈ ఘటన చోటు చేసుకుంది. 7వ తరగతి చదువుతున్న ఓ విద్యార్థి హనుమాన్ దీక్ష తీసుకున్నాడు. దీంతో హనుమాన్ మాల ధరించి పాఠశాలకు వెళ్లాడు. అయితే పాఠశాల హెడ్ మాస్టర్ ఆ విద్యార్థిని గేటు వద్దే అడ్డుకున్నారు. మాల ధరించి తరగతి గదిలోకి రాకూడదని చెప్పారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు అక్కడికి చేరుకున్నారు. హెడ్ మాస్టర్ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ విద్యార్థి తల్లిదండ్రులు, బజరంగదళ్ కార్యకర్తలు.. పాఠశాల ముందు ఆందోళన చేపట్టారు. పాఠశాల ప్రాంగణంలో నినాదాలు చేస్తూ బైఠాయించారు. హిందూ ఆచారాలను అవమానించిన హెడ్ మాస్టర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# మహిళా బిల్లుకు సై.. డీలిమిటేషన్‌కు నై!


మొదటి పేజీ తరువాయి



కూటమి నేతలు వివిధ అంశాలపై చర్చించారు. ఈ భేటీ అనంతరం ఖర్గే మీడియాతో మాట్లాడుతూ.. మహిళా రిజర్వేషన్లకు కాంగ్రెస్ మద్దతు ఇస్తుందని తెలిపారు. మహిళా రిజర్వేషన్లపై అనాడైనా ఇనాడైనా కాంగ్రెస్‌ది ఒకటే స్టాండ్ అని పేర్కొన్నారు. డీలిమిటేషన్ పేరుతో కేంద్ర ప్రభుత్వం చేస్తోన్న ట్రిక్కులకు వ్యతిరేకమని.. మహిళా రిజర్వేషన్లు అంటూ దొంగ దారిలో డీలిమిటేషన్ అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆరోపించారు. డీలిమిటేషన్‌ను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని.. పార్లమెంట్‌లో ఈ బిల్లుకు వ్యతిరేకంగా ఓటేస్తామని కాంగ్రెస్ పార్టీ వైఖరిని తెలియజేశారు. డీలిమిటేషన్‌పై ఇండియా కూటమి పార్టీలు ఏకతాటిపై ఉన్నాయని తెలిపారు. రాజకీయ ప్రయోజనాల కోసమే హడావుడిగా కేంద్ర ప్రభుత్వం ఈ బిల్లులను ప్రవేశ పెడుతోందని ఆరోపించారు. డీలిమిటేషన్‌కు వ్యతిరేకంగా పార్లమెంట్ లో సమిష్టిగా పోరాడుతామని తెలిపారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు ఇండియా కూటమి అనుకూలంగానే ఉందని.. కానీ దానిని తీసుకువచ్చే విధానంపైనే అభ్యంతరాలు ఉన్నాయని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే పేర్కొన్నారు. రిజర్వేషన్ బిల్లుకు డీలిమిటేషన్‌ను ముడిపెట్టి కేంద్రం రాజకీయ కుతంత్రాలు చేస్తోందని ఆరోపించారు. రాజ్యాంగం లోని అధికారాలన్నింటినీ కార్యనిర్వాహక వర్గం తీసుకుంటోందన్నారు. కేవలం ప్రతిపక్ష పార్టీలను అణచివేయడానికే కేంద్ర ప్రభుత్వం ఇలా చేస్తోందన్నారు. నియోజకవర్గాల పునర్విభజన బిల్లుకు వ్యతిరేకంగా తామంతా పార్లమెంట్‌లో ఐక్యంగా పోరాడుతామని ఖర్గే పేర్కొన్నారు. కనీసం జనగణన కూడా పూర్తి చేయకుండా కేంద్రం ఈ నిర్ణయం తీసుకుందని విమర్శించారు. కొత్త జనాభా లెక్కల తర్వాతే డీలిమిటేషన్ చేపట్టాలని డిమాండ్ చేశారు. మహిళా రిజర్వేషన్ల చట్టాన్ని 2029 ఎన్నికల నుంచి అమలు చేసేందుకు 16వ తేదీ నుంచి 3 రోజులపాటు జరిగే పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో సవరణలను చేపట్టనున్నారు. ఇందులో భాగంగా మహిళలకు చట్టసభల్లో 33శాతం రిజర్వేషన్లు అమలు చేయడానికి వీలుగా ఇప్పుడున్న లోక్‌సభ స్థానాల గరిష్ఠ సంఖ్య (550)ని గరిష్ఠంగా 850 వరకూ పెంచాలని కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. ఈ క్రమంలోనే మహిళా రిజర్వేషన్ బిల్లుకు డీలిమిటేషన్‌తో ముడిపెట్టడాన్ని ప్రతిపక్షాలు వ్యతిరేకిస్తున్నాయి.

# భగభగమంటున్న భానుడు

- రాష్ట్రవ్యాప్తంగా 43 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు
- పలు జిల్లాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్
- మరో మూడు రోజులు వడగాల్పుల తీవ్రత
- 44 డిగ్రీలకు చేరనున్న ఎండల వేడి
- అప్రమత్తంగా ఉండాలని అధికారుల హెచ్చరిక



**హైదరాబాద్, ఏప్రిల్ 15:** తెలంగాణ రాష్ట్రంలో భానుడు భగభగమంటున్నాడు. పలు ప్రాంతాల్లో ఎండలు 43 డిగ్రీలు దాటాయి. వాతావరణ కేంద్రం హైదరాబాద్ సహా పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. రానున్న మూడు రోజుల్లో వడగాల్పుల తీవ్రత పెరిగి ఎండలు 44 డిగ్రీలకు చేరే అవకాశం ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. ఆరెంజ్ అలర్ట్ జారీ చేసిన జిల్లాల్లో ఉమ్మడి ఆదిలాబాద్, మహబూబ్ నగర్, నిజామాబాద్, ఖమ్మం, మెదక్, మేడ్చల్ మల్కాజిగిరి ఉన్నాయి.

**పెరగనున్న ఉష్ణోగ్రతల తీవ్రత**

రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో బుధవారం ఉష్ణోగ్రతలు 43 డిగ్రీలు దాటి నమోదయ్యాయి. రాబోయే మూడు రోజుల్లో ఇవి క్రమంగా మరో ఒకటి నుంచి రెండు డిగ్రీలు పెరిగే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం వెల్లడించింది. రాగల మూడు రోజులు పలు జిల్లాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందని హెచ్చరించింది. ఆయా జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 41 నుంచి 44 డిగ్రీల మేర నమోదయ్యే ఛాన్స్ ఉంది. నిజామాబాద్, ఖమ్మం, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వడగాల్పులు వీస్తాయని పేర్కొంది.

**పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్**

గురువారం ఉమ్మడి ఆదిలాబాద్‌తో పాటు నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వడగాల్పులు వీస్తాయని వాతావరణ కేంద్రం తెలిపింది. వడగాల్పులు వీచే జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసింది. మధ్యాహ్నం వేళ భానుడి భగభగలకు జనం బెంబేలెత్తుతున్నారు. ఎండల తీవ్రత దృష్ట్యా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

# పాటలే తెలుసు.. స్కామ్‌లు తెలియవు

**మీడియా ముందు సింగర్ మంగ్లీ ఆవేదన**

**హైదరాబాద్:** తనకు పాటలు పాడటం తప్ప స్కామ్‌లు చేయడం తెలియదని, నిరాధార ఆరోపణలతో ఎంతో నలిగిపోతున్నానని సింగర్ మంగ్లీ ఆవేదన వ్యక్తం చేశారు. స్కామ్‌లతో తనకు సంబంధం లేదని, ఒకవేళ తప్పు చేసినట్లు రుజువైతే ఎలాంటి శిక్షకైనా సిద్ధమని స్పష్టం చేశారు. బుధవారం మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ పేదరికం నుంచి వచ్చిన తనకు డబ్బు విలువ తెలుసని పేర్కొన్నారు. తప్పుడు ప్రచారం వల్ల నెల రోజులుగా రికార్డింగ్‌లు, ప్రోగ్రామ్‌లు వదులుకోవాల్సి వచ్చిందని, ప్రజల్లోకి తప్పుడు సమాచారం వెళ్తోందని వాపోయారు. తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్న మధు నాయక్, హిమకాంత్ రెడ్డి, రామావత్ మధు, సిద్ధు, సుబ్బారావులపై డీజీపీకి ఫిర్యాదు చేసినట్లు మంగ్లీ వెల్లడించారు. తాను ఎప్పుడూ బాధితుల పక్షానే ఉంటానని స్పష్టం చేశారు. ఆమె న్యాయవాది మాట్లాడుతూ స్కామ్ చేసిన వారే బాధితుల రూపంలో మీడియా ముందుకు వస్తున్నారని ఆరోపించారు. 'సుభక్షేత్ర బిజినెస్' అనే పేరుతో కంపెనీ ఏర్పాటు చేసి కుంభకోణానికి పాల్పడింది మధు అని, ప్రస్తుతం బాధితుడిగా మాట్లాడుతున్న హిమకాంత్ రెడ్డి ఆ కంపెనీకి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పనిచేశారని న్యాయవాది వివరించారు. ఈ స్కామ్‌తో మంగ్లీకి ఎటువంటి సంబంధం లేదని, అసలైన నిందితులను వదిలేసి ఆమెను బలిపశువును చేస్తున్నారని మండిపడ్డారు. నిందితుల అసలు రంగు బయటపడాలని డిమాండ్ చేశారు.

# పర్యాటక అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

**పులిగుండాలను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతాం**

**డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి**



**పెనుబల్లి, ఏప్రిల్ 15:** పెనుబల్లి మండలం బ్రాహ్మళ్లకుంట పరిధిలోని పులిగుండాల ఎకో టూరిజం ప్రాజెక్టును బుధవారం రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రారంభించారు. జంగిల్ సఫారీ, బోటింగ్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చి ప్రకృతి ఒడిలో కాసేపు విహరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అపురూపమైన ప్రకృతి సంపదను ప్రపంచానికి పరిచయం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. పులిగుండాలను రాష్ట్రంలోని మొదటి మూడు ఉత్తమ పర్యాటక కేంద్రాలలో ఒకటిగా నిలబెడతామని మంత్రి హామీ ఇచ్చారు. పర్యాటకుల సౌకర్యార్థం ఇక్కడికి వెళ్లే మార్గాన్ని వెంటనే డబుల్ రోడ్డుగా అభివృద్ధి చేసేందుకు అనుమతులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. కనకగిరి హిల్స్ అభివృద్ధికి తక్షణమే కార్యాచరణ ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. స్థానిక ఎమ్మెల్యే విన్నపం మేరకు సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు నుంచి పులిగుండాలకు నీటిని మళ్లించే సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేస్తామని తెలిపారు. నీటి మళ్లింపు ద్వారా వేసవిలోనూ ఈ ప్రాంతం జలకళతో ఉంటుందని, పర్యాటక అభివృద్ధి వల్ల స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని పొంగులేటి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, పీసీసీఎఫ్ సువర్ణ, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పాల్గొన్నారు. వీరితో పాటు సీపీ సునీల్ దత్, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ హాజరయ్యారు.

# మార్కెట్ యార్డ్‌ల అభివృద్ధికి కట్టుదిట్టమైన చర్యలు

**జీరో బిజినెస్ అంశంపై మంత్రి తుమ్మల ఆగ్రహం**

**మార్కెటింగ్, మార్క్‌ఫెడ్ అధికారులతో సమీక్ష**

**హైదరాబాద్, ఏప్రిల్ 15:** తెలంగాణలో వ్యవసాయ మార్కెట్ యార్డ్‌ల అభివృద్ధి, పారదర్శకతపై కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోంది. ఈ మేరకు మార్కెటింగ్, మార్క్‌ఫెడ్ అధికారులతో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించారు. మార్కెట్ యార్డ్‌ల అభివృద్ధి పనుల పురోగతి, రైతులకు అందుతున్న సౌకర్యాలపై ఆయన అధికారులతో చర్చించారు. గత రెండు సంవత్సరాల్లో మొత్తం రూ.568.50 కోట్ల వ్యయంతో 630 అభివృద్ధి పనులు మంజూరు చేసినట్లు మంత్రికి అధికారులు వెల్లడించారు. ఇందులో రూ.128 కోట్లతో 113 పనులు పూర్తయ్యాయని నివేదిక సమర్పించారు. మిగిలిన పనులను నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేయాలని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు. ప్రతి పనికి టైమ్‌లైన్ నిర్ణయించి వేగంగా ముందుకు తీసుకెళ్లాలని మంత్రి తుమ్మల ఆదేశించారు. మార్కెట్ యార్డుల్లో 'జీరో బిజినెస్' అంశంపై మంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యాపారం చేయకుండా లైసెన్సులు కొనసాగిస్తున్న ట్రేడర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని, వారి లైసెన్సులను రద్దు చేయాలని ఆదేశించారు. అలాంటి వారికి సహకరించే అధికారులపై క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు. అభివృద్ధి పనుల పర్యవేక్షణ కోసం ప్రత్యేక డ్యాష్‌బోర్డ్ ఏర్పాటు చేయాలని మంత్రి సూచించారు. రైతులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని, పంట ఉత్పత్తుల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు తుమ్మల. గడ్డిఅన్నారం మార్కెట్‌లో 'స్మార్ట్ మార్కెట్ యార్డ్' అమలు చేయాలని, డిజిటలైజేషన్ ద్వారా జీరో బిజినెస్ సమస్యను తగ్గించాలని నిర్ణయించారు. కోహెడ మార్కెట్ అభివృద్ధి పనులకు త్వరలో టెండర్లు పిలవనున్నట్లు ఆయన తెలిపారు. విద్యుత్ ఖర్చు తగ్గింపుపైనా మంత్రి దృష్టి సారించారు. మార్కెట్ యార్డుల్లో సోలార్ రూఫ్‌టాప్ ప్రాజెక్టులను వేగవంతం చేసి, జులై చివరి నాటికి విద్యుత్ ఉత్పత్తి ప్రారంభించాలని అన్నారు. వ్యవసాయ కొనుగోళ్ల విషయానికి వస్తే.. ఖరీఫ్ సీజన్‌లో పత్తి కొనుగోళ్లు పూర్తయ్యాయని అధికారులు తెలిపారు. ప్రస్తుతం మార్కెట్లకు మిర్చి అధికంగా వస్తోందని పేర్కొన్నారు. మరోవైపు ధాన్యం కొనుగోళ్లకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని మంత్రి తుమ్మల ఆదేశించారు. టార్పాలిన్లు, తేమ కొలమానాలు, డ్రైయర్లు సిద్ధంగా ఉంచాలని సూచించారు. మొక్కజొన్న కొనుగోళ్లలోనూ రైతులకు పూర్తి రక్షణ కల్పిస్తామని మంత్రి భరోసా ఇచ్చారు. అలాగే రైతుల ఖాతాలకు నేరుగా చెల్లింపులు చేస్తామని స్పష్టం చేశారు. మొత్తం మీద మార్కెట్ యార్డ్‌లను ఆధునీకరించి, రైతులకు అనుకూలంగా మార్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి తుమ్మల వెల్లడించారు.



# భూసేకరణకు వ్యతిరేకంగా నిరసన

- జాగృతి అధ్యక్షురాలు కవిత అరెస్ట్
- సేకరణను అడ్డుకుంటామని స్పష్టీకరణ
- పారిశ్రామికీకరణ ముసుగులో భూదోపిడీ
- వికారాబాద్‌లో రైతులతో కలిసి బైఠాయింపు





**వికారాబాద్, ఏప్రిల్ 15:** పరిగి పారిశ్రామిక కారిడార్ కోసం చేపట్టిన భూసేకరణకు వ్యతిరేకంగా వికారాబాద్‌లో నిరసన చేపట్టిన తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవితను పోలీసులు అరెస్ట్ చేశారు. పారిశ్రామిక కారిడార్ పేరిట రైతుల భూములను బలవంతంగా సేకరించడాన్ని నిరసిస్తూ ఆమె బుధవారం ఉదయం నుంచి ఆందోళన చేపట్టారు. ఈ క్రమంలో రైతులతో కలిసి వికారాబాద్ ఆర్డీఓ కార్యాలయం ఎదుట బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పారిశ్రామికీకరణ ముసుగులో ప్రభుత్వం రైతుల పొట్ట కొడుతోందని కవిత ఆరోపించారు. భూసేకరణ నిలిపివేయకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. తక్షణమే భూసేకరణ నోటిఫికేషన్ వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంతకుముందు స్థానిక ఎన్టీఆర్ చౌరస్తాలో రైతులు భారీ ఎత్తున రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. రాస్తారోకో నిర్వహిస్తున్న రైతులను అడ్డుకునే క్రమంలో పోలీసులు, నిరసనకారుల మధ్య తీవ్ర తోపులాట చోటుచేసుకుంది. ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో పోలీసులు కవితతో పాటు పలువురు రైతులను అదుపులోకి తీసుకున్నారు. ఈ నిరసన కార్యక్రమానికి ధర్మ సమాజ్ పార్టీ మద్దతు ప్రకటించింది. రైతుల ప్రయోజనాల కోసం పోరాటం కొనసాగిస్తామని ఆయా పార్టీల నేతలు స్పష్టం చేశారు.

# మహిళా సాధికారతకు మోదీ పెద్దపీట

- నారీ శక్తి వందన్ బిల్లుతో చారిత్రాత్మక మార్పులు
- వరంగల్ అభివృద్ధిపై రామచందర్ రావు ప్రశంసలు



**వరంగల్, ఏప్రిల్ 15:** ప్రధాని మోదీ సుపరిపాలనలో వరంగల్‌లో మునుపెన్నడూ చూడని అపూర్వమైన అభివృద్ధి జరుగుతోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు అన్నారు. అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద వరంగల్ రైల్వే స్టేషన్ ఆధునీకరణ జరుగుతోందని తెలిపారు. పీఎం మిత్ర టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటు కాబోతుందని చెప్పారు. ఈ ప్రాంత ప్రగతికి కేంద్ర ప్రభుత్వం వేస్తున్న అడుగులే అందుకు నిదర్శనమని పేర్కొన్నారు. మహిళా రాజకీయ సాధికారతకు బాటలు వేస్తూ మోదీ సర్కార్ తీసుకొచ్చిన చారిత్రాత్మక నారీ శక్తి వందన్ అధినియం పట్ల వరంగల్ ప్రజలు అమితమైన హర్షం వ్యక్తం చేస్తున్నారని వెల్లడించారు. నరేంద్ర మోదీకి తెలంగాణ ప్రజల తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం వరంగల్‌లోని నారీమణులతో కలిసి చారిత్రాత్మక నారీ శక్తి వందన్ అధినియం విజయోత్సవాలను ఉత్సాహంగా జరుపుకున్నారు. లోక్‌సభ, రాష్ట్ర శాసనసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రధాని మోదీ తీసుకున్న ఈ నిర్ణయం.. నవ భారత రాజకీయ ముఖచిత్రాన్ని శాశ్వతంగా మార్చబోతున్న ఒక సువర్ణాధ్యాయం అని కొనియాడారు. వరంగల్‌లో ఎర్రబెల్లి ప్రదీప్ రావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వీధి వ్యాపారులకు టీ స్టాళ్లు పంపిణీ చేశారు. పట్టణ ఆర్థిక వ్యవస్థలో, ప్రజలకు నిత్యావసరాలను వారి ముంగిటకే చేరువ చేయడంలో వీధి వ్యాపారుల పాత్ర అత్యంత కీలకం అని పేర్కొన్నారు. వీరి కష్టాన్ని గుర్తించిన మోదీ పీఎం స్వనిధి పథకం ద్వారా వారి జీవనోపాధికి ఆర్థిక భరోసా కల్పిస్తున్నారని చెప్పారు. ఈ పథకం కింద వరంగల్ అత్యధిక లబ్ధి పొందడం.. పేదలు, శ్రమజీవులు, చిరు వ్యాపారుల సంక్షేమం పట్ల మోదీ ప్రభుత్వానికి ఉన్న నిబద్ధతకు నిదర్శనం అని అన్నారు. వరంగల్ పర్యటన నిమిత్తం విచ్చేసిన అధ్యక్షుడికి బీజేపీ కార్యకర్తలు ఆత్మీయ స్వాగతం పలికారు. ప్రతి బీజేపీ కార్యకర్త హృదయంలో వరంగల్‌కు ఒక ప్రత్యేక స్థానం ఉందని తెలిపారు. 1984లో దేశవ్యాప్తంగా పార్టీ కేవలం రెండు స్థానాలు గెలుచుకున్నప్పుడు, అందులో ఒక చారిత్రాత్మక విజయం వరంగల్ గడ్డపై జంగారెడ్డి రూపంలో నమోదైందని గుర్తుచేశారు. ఆనాటి ఆ చారిత్రక ఘట్టం నేటికీ తరతరాల కార్యకర్తలకు స్ఫూర్తినిస్తూనే ఉందని పేర్కొన్నారు. తెలంగాణలో కమల వికాసానికి, పార్టీని మరింత విస్తరించాలనే దృఢ సంకల్పాన్ని ఇది మరింత బలపరుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.



# వారసత్వ కట్టడాలను పరిరక్షించాలి

**పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దాలి**

**కుతుబ్‌షాహి టూంబ్స్ తదితర కట్టడాలను పరిశీలించిన జూపల్లి**



**హైదరాబాద్, ఏప్రిల్ 15:** కుతుబ్ షాహీ టూంబ్స్‌లోని ఇంటర్ప్రిటేషన్ సెంటర్‌లో జరుగుతున్న పనులను పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పరిశీలించారు. సెవెన్ టూంబ్స్ కటోరా హౌస్, కేబీ మ్యూజియంను ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ తో కలిసి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. వక్ఫ్ ట్రిబ్యునల్ లో కేసు పెండింగ్ గురించి చర్చించారు. కేసు పూర్వాపరాలను గురించి వివరించారు. ట్రిబ్యునల్ పరిధిలో పెండింగ్ లో ఉన్న పనులను మినహాయించి, మిగిలిన పనులను వారంలోగా ప్రారంభించి, వెంటనే పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కుతుబ్ షాహి టూంబ్స్ నుంచి గోల్కొండ కోట వరకు 1.3 కిలోమీటర్ల రోప్ వే నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలు ఏ స్థాయిలో ఉన్నాయని ఆరా తీశారు. క్లియరెన్స్ స్టేజిలో ఉన్నాయని, ఆయా శాఖల నుంచి అనుమతులు వచ్చిన వెంటనే డీపీఆర్ సిద్ధం చేస్తామని అధికారులు చెప్పారు. అనంతరం కటోరా హౌస్ ను సందర్శించారు. కులీకుతుబ్ షా అర్బన్ డెవలప్మెంట్ ఆటోఆరిటీని సమన్వయం చేసుకుని , డీపీఆర్ ను సిద్ధం చేయాలని పర్యాటక శాఖ అధికారులను ఆదేశించారు. కటోరా హౌస్ ను పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని సూచించారు. కటోరా హౌస్ పరిసర ప్రాంతాల్లో ఉన్న వ్యర్థాలను వెనువెంటనే తొలగించాలని అధికారులు ఆదేశించారు. తర్వాత గోల్కొండ కోట సమీపంలోని బస్ స్టాప్ వద్ద ఉన్న ఖాళీ ప్రదేశంలో లాడ్ బజార్ తరహాలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాన్నారు. ఈ ప్రతిపాదనలను నేషనల్ మోనుమెంట్ మిషన్ అథారిటీకి పంపి అనుమతులు పొందాలని సూచించారు. అక్కడి నుంచి ఖజానా బిల్డింగ్ మ్యూజియంకు చేరుకున్నారు. ఎంతో చారిత్రాత్మక విలువైన కళాఖండాలు ఉన్న ఈ మ్యూజియం ను పర్యాటకంగా అభివృద్ధి చేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ ప్రదేశంలో చేనేత వస్త్రాల ప్రదర్శన ను ఏర్పాటు చేయాలని పురావస్తు , అధికారులను ఆదేశించారు. కేబీ మ్యూజియం వెనక భాగంలో ఉన్న ఆక్రమణలను పోలీస్ శాఖ సహకారంతో వారం రోజుల్లో తొలగించాలని అన్నారు. ÷లంగాణలో అద్భుతమైన చారిత్రక కట్టడాలు, వారసత్వ సంపద, ప్రకృతి రమణీయ ప్రదేశాలు ఉన్నాయని, వాటిని ప్రపంచ పర్యాటకులకు పరిచయం చేసేలా ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. దేశీయ, అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షించేలా వాటిని అభివృద్ధి చేయడంతో పాటు మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీజీటీడీసీ ఎండీ గౌతమి, పురావస్తు శాఖ డైరెక్టర్ అర్జున రావు, ఇతర శాలల అధికారులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ కేసు విచారణలో రోజుకో కొత్త కోణం

**కేదార్‌తో పైలట్ రోహిత్ రెడ్డి సోదరులకు ఆర్థిక బంధం**

**హైదరాబాద్, ఏప్రిల్ 15:** మొయినాబాద్ డ్రగ్స్ కేసు విచారణలో రోజుకో కొత్త విషయం వెలుగులోకి వస్తోంది. తాజాగా, ఈ కేసులో కేదార్ అనే వ్యక్తి పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. గత ఏడాది దుబాయ్‌లో డ్రగ్స్ ఓవర్ డోస్ కారణంగా మరణించిన కేదార్‌తో పైలట్ రోహిత్ రెడ్డి సోదరులకు అత్యంత సన్నిహిత సంబంధాలు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. రరోహిత్ రెడ్డి, ఆయన సోదరుడు రితేష్ రెడ్డి, కేదార్‌కు మధ్య భారీ ఎత్తున ఆర్థిక లావాదేవీలు జరిగినట్లు పోలీసుల విచారణలో తేలింది. ముఖ్యంగా రోహిత్, రితేష్ బ్యాంక్ ఖాతా నుంచి కేదార్‌కు రూ.25 లక్షలు బదిలీ అయినట్లు పోలీసులు పక్కా ఆధారాలు సేకరించారు. ఈ ఆర్థిక లావాదేవీల గురించి రోహిత్ రెడ్డి, రితేష్‌ని ప్రశ్నించగా ఇద్దరూ పొంతన లేని సమాధానాలు చెబుతున్నారని, వారు విచారణకు సహకరించడం లేదని పోలీసులు పిటిషన్‌లో పేర్కొన్నారు. మరిన్ని విషయాలు రాబట్టడానికి కస్టడీని పొడిగించాల్సిన అవసరం ఉందని పోలీసులు తమ నివేదికలో స్పష్టం చేశారు.





# మహిళా రిజర్వేషన్లపై కుట్రలు సాగవు


- రాహుల్ కేరళ పోటీపై సీఎం సమాధానం చెప్పాలి
- రేవంత్ తీరుపై ఎంపీ లక్ష్మణ్ ఆగ్రహం

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 15:** తెలంగాణ రాష్ట్ర హక్కుల కోసం తన గొంతు వినిపిస్తున్నానని బీజేపీ రాజ్యసభ సభ్యుడు కే. లక్ష్మణ్ తెలిపారు. తెలంగాణ కోసం సీఎం రేవంత్ రెడ్డి ఏం చేశారని ఆయన ప్రశ్నించారు. తుపాకీ పట్టుకొని ఆయన ఎవరి పక్కన నిలుచున్నారో అందరికీ తెలుసని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ అగ్రనేత ఎంపీ రాహుల్ గాంధీ కేరళ నుంచి ఎందుకు పోటీ చేశారో రేవంత్ రెడ్డి చెప్పాలని ఆయన నిలదీశారు. యూపీ నుంచి రాజ్యసభకు ఎన్నిక కావడం తెలుగువాడిగా తనకు గౌరవమని లక్ష్మణ్ పేర్కొన్నారు. తనపై సీఎం చేసిన వ్యాఖ్యలపై బుధవారం న్యూఢిల్లీలో లక్ష్మణ్ స్పందించారు. నీతులు చెబుతున్నారంటూ రేవంత్ రెడ్డిపై నిప్పులు చెరిగారు. మహిళల అవకాశాలను దెబ్బతీయడానికి ప్రతిపక్షాలు కుట్ర పన్నుతున్నాయని లక్ష్మణ్ మండిపడ్డారు. మహిళల వాటా తగ్గించడానికి ప్రయత్నిస్తున్నారా? ఎస్సీ, ఎస్టీ వాటా అడ్డుకోవడానికి కుట్రలు చేస్తున్నారా? అంటూ నిలదీశారు. రేవంత్ రెడ్డికి ప్రజాస్వామ్యం అంటే డబ్బేనని ఎద్దేవా చేశారు. ఢిల్లీకి ఆయన డబ్బుల మూటలు మోశారని విమర్శించారు. నగదు కేంద్రంగా రాజకీయాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. డబ్బున్న వాళ్లకే ఓటు విలువ ఎక్కువ అనేలా రేవంత్ చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదమని లక్ష్మణ్ పేర్కొన్నారు. గ్రేటర్ హైదరాబాద్‌ను మూడు ముక్కలు చేశారని లక్ష్మణ్ మండిపడ్డారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో 150 సీట్లను 300 సీట్లు చేశారని తెలిపారు. ఏ శాస్త్రీయ పద్ధతిలో గ్రేటర్ హైదరాబాద్‌ను విభజించారని సీఎంను సూటిగా ప్రశ్నించారు. డీలిమిటేషన్ బిల్లు వల్ల దక్షిణాది రాష్ట్రాలకు నష్టం జరగకుండా ప్రస్తుతం ఉన్న సీట్ల నిష్పత్తికి అనుగుణంగా అవి పెరుగుతాయని చెప్పారు. 543 సీట్లలో మహిళా రిజర్వేషన్లు పెంచమనడం వెనుక ఎస్సీ, ఎస్టీ మహిళలకు నష్టం చేయాలనే కుట్ర దాగి ఉందని అభిప్రాయపడ్డారు. ప్రధాని మోదీకి పెరుగుతున్న ఆదరణ చూసి జీర్ణించుకోలేక పోతున్నారంటూ రేవంత్ రెడ్డిపై ధ్వజమెత్తారు. అందుకే డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ బిల్లుల పట్ల రాజ్యాంగ విరుద్ధంగా ప్రకటనలు చేస్తున్నారని విమర్శించారు. జీఎస్‌డీపీ ప్రకారం డీలిమిటేషన్ చేయాలనేది కాంగ్రెస్ విధానమా? అనేది స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఓటు విలువ ధనిక, పేద అనే వ్యత్యాసం లేకుండా అందరికీ సమానంగా ఉంటుందని అన్నారు. జీడీపీలో మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాలు ముందు వరుసలో ఉన్నాయని గుర్తు చేశారు. తెలంగాణ వ్యతిరేక ప్రతిపాదనలు చేస్తున్నారని, వెంటనే వీటిని వెనక్కి తీసుకోవాలని రేవంత్ రెడ్డికి స్పష్టం చేశారు.


# ప్రాతినిధ్యం తగ్గితే సహించం

**డీలిమిటేషన్‌తో దక్షిణాదికి అన్యాయం జరిగితే ప్రజా ఉద్యమం తప్పదు**

**కేంద్ర ప్రభుత్వానికి కేటీఆర్ తీవ్ర హెచ్చరిక**



**హైదరాబాద్, ఏప్రిల్ 15 :** నియోజకవర్గాల పునర్విభజన అంశంపై కేంద్ర ప్రభుత్వానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరిక జారీ చేశారు. దక్షిణాదికి ప్రాతినిధ్యం తగ్గేలా డిలిమిటేషన్ జరిగితే అది కేవలం ఒక రాజకీయ ప్రక్రియగానో లేక చట్ట సవరణగానో మిగిలిపోదని అన్నారు. మొత్తం దక్షిణ భారతదేశం అంతటా ఒక బలమైన ప్రజా ఉద్యమానికి దారితీస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఈ విషయంలో బీఆర్ఎస్ పార్టీ వైఖరిలో ఎలాంటి మార్పు లేదని తేల్చి చెప్పారు. మూడేళ్ల క్రితం తాము తీసుకున్న దృఢమైన నిర్ణయానికే కట్టుబడి ఉన్నామని పునరుద్ఘాటించారు. తామంతా గర్వించదగ్గ భారతీయులమని, దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న అత్యుత్తమ రాష్ట్రాల ప్రతినిధులమని కేటీఆర్ పేర్కొన్నారు. జనాభా నియంత్రణతో పాటు వివిధ రంగాల్లో అద్భుత ప్రగతి సాధిస్తున్న దక్షిణ రాష్ట్రాలకు, ఈ పునర్విభజన వల్ల రాజకీయంగా అన్యాయం జరగడం సమంజసం కాదని ఆయన అభిప్రాయపడ్డారు. అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాలను ప్రోత్సహించాల్సింది పోయి, వాటి ప్రాతినిధ్యాన్ని తగ్గించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ఆయన విమర్శించారు. దేశంలోని అత్యున్నత ప్రజాస్వామ్య వేదిక అయిన పార్లమెంటులో తమ ప్రజల స్వరాన్ని, ప్రతినిధిత్వాన్ని అణిచివేయాలని చూస్తే తాము నిశ్శబ్దంగా చూస్తూ ఉండబోమని స్పష్టం చేశారు. దక్షిణ భారతీయుల హక్కుల కోసం రాజీలేని పోరాటం చేస్తామని కేటీఆర్ ప్రకటించారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం వాస్తవ పరిస్థితులను అర్థం చేసుకోవాలని అన్నారు. “ఢిల్లీ పాలకులు మా మాట వినాలి, బుద్ధి ప్రభలాలని ఆశిస్తున్నాం“ అంటూ సోషల్ మీడియా ఎక్స్‌లో కేటీఆర్ పోస్ట్ చేశారు.




## సంపాదకీయం

# దేశానికి దిశ చూపేలా బిల్లులపై చర్చించాలి!

చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు, నియోజకవర్గాల పునర్విభజన అంశాలపై పలు విమర్శలు వస్తున్నాయి. పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. రాజకీయ పార్టీలతో పాటు, పౌరసమాజంలోనూ అనుమానాలు ఉన్నాయి. ఈ నెల 16 నుంచి పార్లమెంట్ మూడు రోజుల పాటు ప్రత్యేకంగా సమావేశం కాబోతున్నది. అందువల్ల ఈ విషయంలో అనుమానాలు నివృత్తి చేయాల్సి ఉంది. అనుమానాలు వ్యక్తం చేస్తున్న వారు, ఆందోళనలు చేస్తున్న వారు, విమర్శలు చేస్తున్న వారి అభిప్రాయాలకు విలువనివ్వాలి. పార్లమెంట్ వేదికగా సుదీర్ఘంగా చర్చించాలి. విపక్ష, స్వపక్ష నేతలు కూడా పరస్పర వివాదాల జోలికి పోకుండా ప్రజలకు అర్థమయ్యేలా సమగ్రంగా చర్చించాలి. అఖిలపక్ష సమావేశం కన్నా పార్లమెంటులో చర్చించడమే మేలు. ఎందుకంటే ఈ చర్చకు చట్టబద్దత ఉంటుంది. అలాగే సభ్యుల సూచనలు, సలహాలకు విలువ ఉంటుంది. ఎఐ వినియోగం, సాంకేతికత పెరిగిన ప్రస్తుత కాలంలో ఈ విషయాలపై వాటి సాయం కూడా పొందితే మంచిది. పార్టమెంటులో సుదీర్ఘ ఉపన్యాసాలకు తావులేకుండా, పరస్పర విమర్శలకు చోటు లేకుండా ఈ రెండు అంశాలపై సమగ్రంగా చర్చించాలి. దీనివల్ల ప్రజలకు కూడా అవగాహ కలిగేలా ఉండాలి. రాజకీయపార్టీలు స్వార్థ రాజకీయాలను పక్కన పెట్టి, ఈ అంశాలపై ఓ ఏకాభిప్రాయం వచ్చేలా చూడాలి. ఎందుకంటే మహిళా రిజర్వేషన్ బిల్లు ఎప్పటి నుంచో పెండింగ్‌లో ఉంది. నిజానికి మొన్నటి సార్వత్రిక ఎన్నికలకు ముందే పార్లమెంట్ ముందుకు వచ్చింది. అప్పుడే ఇది చట్టంగా మారివుంటే బాగుండేది. కొత్తగా జనాభా లెక్కల తరవాత దీనిని అమలు చేస్తామని గతంలో బిల్లు ప్రవేశ పెట్టినప్పుడు ప్రభుత్వం చెప్పింది. ఇప్పుడు 2011 జనాభా లెక్కల ప్రకారం అమలు చేస్తే అన్యాయం చేసినట్లు అవుతుంది. 2029లో సార్వత్రిక ఎన్నికలు జరిగితే ప్రజాస్వామ్యం మరింతగా వికసిస్తుందని, బలోపేతం అవుతుందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. విధాన నిర్ణయాల్లో మహిళలు ఎప్పుడైతే క్రియాశీలంగా వ్యవహరిస్తారో అప్పుడు వికసిత్ భారత్ దిశగా ప్రయాణం మరింత బలపడుతుందని అభిప్రాయపడ్డారు. మహిళా రిజర్వేషన్ల చట్టాన్ని 2029 ఎన్నికల నుంచి అమలు చేసేందుకు 16వ తేదీ నుంచి 3 రోజులపాటు జరిగే పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో సవరణలను చేపట్టనున్న నేపథ్యంలో దేశంలోని మహిళలకు ప్రధాని ప్రత్యేకంగా లేఖ రాశారు. నిజానికి ఇప్పటికే మహిళల రిజర్వేషన్లు అమలు జరిగివుండాల్సింది. అనేక రంగాల్లో మహిళలు రాణిస్తున్నందున చట్టసభల్లోనూ వారి భాగస్వామ్యం పెరగాల్సిందే. చట్టసభల్లో వారి వాణి బలంగా వినిపిస్తే ప్రజాసామ్యం మరింత బలోపేతం అవుతుంది. అయితే లోక్‌సభ సీట్లు పెరిగితేనే మహిళల రిజర్వేషన్లు అమలు సులువవుతందని ప్రభుత్వ వాదనగా ఉంది. మహిళలకు చట్టసభల్లో 33శాతం రిజర్వేషన్లు అమలు చేయడానికి వీలుగా ఇప్పుడున్న లోక్‌సభ స్థానాల గరిష్ఠ సంఖ్య 550ని గరిష్ఠంగా 850 వరకూ పెంచాలని కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం 2027 జనాభా లెక్కల నోటిఫికేషన్ జారీ చేసినప్పటికీ అందుకు సంబంధించి లెక్కలు వెలువడటానికి ఆలస్యమవుతుందన్న ఉద్దేశంతోనే ముందస్తు గా ఈ రాజ్యాంగ సవరణ బిల్లులను తీసుకొస్తున్నట్లు కేంద ప్రభుత్వం పేర్కొంది. దాని ప్రకారం వెళ్తే ప్రజాస్వామ్య పక్రియలో మహిళా భాగస్వామ్యం పెంచడంలో జాప్యం జరుగుతుందని అభిప్రాయపడింది. కేంద్ర ప్రభుత్వం ఏ జనాభా లెక్కలను ప్రాతిపదికగా తీసుకోనేదీ ఈ బిల్లులో చెప్పలేదు. అయితే డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటు కోసం ప్రతిపాదించిన బిల్లులో ఆ కమిషన్ ఏర్పాటయ్యే నాటికి అందుబాటు లో ఉన్న తాజా జనాభా లెక్కల ప్రకారం నియోజకవర్గాలను పునర్విభజించనున్నట్లు పేర్కొంది. అంటే దాని ప్రకారం ప్రస్తుతం అందుబాటు లో ఉన్న తాజా జనాభా లెక్కలు 2011వే కాబట్టి వాటి ప్రాతిపదికనే నియోజకవర్గాల పునర్విభజన జరిగే అవకాశముంది. 850 సీట్లను ఏ ప్రాతిపదికన పెంచబోయేదీ ఈ బిల్లులో స్పష్టత ఇవ్వకున్నా పార్లమెంటులో చర్చ సందర్భంగా ప్రభుత్వం చెప్పే అవకాశం ఉంది. అప్పుడు అన్ని రాష్ట్రాల్లో స్థానాలను 50శాతం పెంచుతామని చెబితే ఏయే రాష్ట్రాల్లో అసెంబ్లీ, పార్లమెంటు సీట్లు ఎన్ని పెరుగుతాయన్న దానిపై స్పష్టత వస్తుంది. ఆ రాష్ట్రాలకు వచ్చిన సీట్లను అంతర్గతంగా పునర్విభజించుకోవడానికి 2011 జనాభా లెక్కలు పనికొస్తాయి. అలా కాకుండా దేశం మొత్తాన్ని యూనిట్‌గా తీసుకొని 2011 జనాభా లెక్కల ఆధారంగానే పునర్విభజన చేపట్టాలని నిర్ణయిస్తే డీలిమిటేషన్ కమిషన్ అంతిమంగా నివేదిక ఇచ్చేంత వరకూ ఏ రాష్ట్రం లో ఎన్ని సీట్లు పెరుగుతాయన్న దానిపై స్పష్టత వచ్చే అవకాశం లేదు. నియోజకవర్గాల పునర్విభజన విషయంలో కమిషన్‌కు సహాయ పడటానికి ప్రతి రాష్ట్రం నుంచి 10 మందిని నియమిస్తారు. ఇందులో ఐదుగురు ఎంపీలు, ఐదుగురు ఎమ్మెల్యేలుంటారు. లోక్‌సభ సభ్యులను లోక్‌సభ స్పీకర్, ఎమ్మెల్యేలను అసెంబ్లీ స్పీకర్ నామినేట్ చేస్తారు. నియోజకవర్గాల పునర్విభజన కోసం రిజిస్ట్రార్ జనరల్ అండ్ సెన్సస్ కమిషనర్, సర్వేయర్ జనరల్ ఆఫ్ ఇండియా, వారి నామినీలను, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులను, భౌగోళిక పరిస్థితులపై అవగాహన ఉన్న నిపుణులను, ఇతరత్రా అవసరమైన వారిని పిలిచి మాట్లాడే అధికారం ఈ కమిషన్‌కు ఉంటుంది. కమిషన్ సభ్యుల్లో భిన్నాభిప్రాయాలు ఏర్పడితే మెజారిటీ సభ్యుల అభిప్రాయం చెల్లుబాటవుతుంది. డీలిమిటేషన్ బిల్లులో ఈ కమిషన్ ఏర్పాటు కావడానికి ముందు అందుబాటులో ఉన్న తాజా జనాభా లెక్కల ప్రకారం నియోజక వర్గాల పునర్విభజన జరుగుతుందని చెప్పింది తప్పితే స్పష్టంగా ఫలానా జనాభా లెక్కల ప్రాతిపదికన అని చెప్పలేదు. 2027 జనాభా లెక్కల సేకరణ జరుగుతున్న తరుణంలో 2011 జనాభా లెక్కలను ఎలా ప్రాతిపదికగా తీసుకుంటారని ప్రతిపక్షాలు ప్రశ్నించే వీలుండటంతో ఆ దాడి నుంచి తప్పించుకోవడానికి కేంద్ర ప్రభుత్వం తెలివిగా కమిషన్ ఏర్పాటయ్యే నాటికి ముందున్న జనాభా లెక్కల ప్రకారం ఈ కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పినట్లు కనిపిస్తోంది. అయితే ఇవన్నీ ఓక పజిల్‌లలాగా కనిపిస్తున్నాయి. అందువల్ల పార్లమెంట్ చర్చకు విలువ ఉంటుంది. అఖిలపక్షం కన్నా పార్లమెంటులో చేస చర్చలకే ప్రాధాన్యం ఉంటుంది. విపక్షాలకు ఉన్న అనుమానాలను తీర్చాల్సిన బాధ్యత అధికార పక్షానిది. అనుమానాలను సహేతుకంగా ప్రస్తావించడం ద్వారా విపక్షాలు తమవంతుగా కృషి చేయాలి. అప్పుడే ఈ రెండు బిల్లులపై సమగ్ర చర్చకు అవకాశం ఉంటుంది.

# అమెరికాకు ఇరాన్ భారీ 'బిల్'!

- రూ. 25 లక్షల కోట్ల పరిహారం ఇస్తేనే శాంతి చర్చలు.. తెగేసి చెప్పిన టెహ్రాన్
- యుద్ధ నష్టం పూడ్చాల్సిందేనన్న ఇరాన్.. హోర్ముజ్ జలసంధిపై పన్ను విధింపు యోచన
- అమెరికాకు సహకరించిన ఐదు అరబ్ దేశాలకూ పరిహారం సెగ!
- చమురు, వాణిజ్య రంగాల్లో తీరని లోటు.. అంతర్జాతీయ సాయం కోసం ఇరాన్ విజ్ఞప్తి



**న్యూఢిల్లీ:** మెరికాతో రెండో విడత శాంతి చర్చలకు సిద్ధమవుతున్న తరుణంలో ఇరాన్ ఒక సంచలన డిమాండ్‌ను తెరపైకి తెచ్చింది. ఇటీవల జరిగిన యుద్ధం కారణంగా తమ దేశం సర్వస్వం కోల్పోయిందని, జరిగిన నష్టానికి పరిహారంగా అమెరికా దాదాపు 270 బిలియన్ డాలర్లు (భారత కరెన్సీలో సుమారు రూ. 25 లక్షల కోట్లు) చెల్లించాలని డిమాండ్ చేసింది. ఈ భారీ పరిహారంపై స్పష్టత వస్తేనే చర్చల్లో ముందుకు వెళ్తామని ఇరాన్ అధికారులు స్పష్టం చేశారు. యుద్ధం వల్ల జరిగిన విధ్వంసాన్ని తమ దేశం ఒంటరిగా భరించలేదని, అంతర్జాతీయ సమాజం తమకు అండగా నిలవాల్సిన అవసరం ఉందని ఇరాన్ పేర్కొంది. యుద్ధం కారణంగా ఇరాన్‌లోని మౌలిక సదుపాయాలు, నివాస గృహాలు, రవాణా వ్యవస్థలు పూర్తిగా ఛిన్నాభిన్నమయ్యాయి. ముఖ్యంగా దేశ ఆర్థిక వెన్నెముక అయిన చమురు రంగానికి, వాణిజ్య రంగానికి జరిగిన నష్టం అంచనాలకు అందడం లేదని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నష్టాల గణన ఇంకా కొనసాగుతోందని, పరిహారం మొత్తం మరింత పెరిగే అవకాశం ఉందని టెహ్రాన్ వర్గాలు చెబుతున్నాయి. ఒకవేళ అమెరికా నుంచి ఆశించిన స్పందన రాకపోతే, ప్రత్యామ్నాయంగా కీలకమైన హోర్ముజ్ జలసంధి ద్వారా ప్రయాణించే అంతర్జాతీయ నౌకలపై ప్రత్యేకంగా 'యుద్ధ నష్ట పన్ను' విధించే అంశాన్ని కూడా ఇరాన్ పరిశీలిస్తోంది. ఇది ప్రపంచ చమురు సరఫరాపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. మరోవైపు, యుద్ధ సమయంలో అమెరికా-ఇజ్రాయెల్ దళాలకు తమ భూభాగాలను ఉపయోగించుకోవడానికి అనుమతినిచ్చిన ఐదు అరబ్ దేశాలపై కూడా ఇరాన్ ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. తమ దేశ విధ్వంసానికి పరోక్షంగా సహకరించిన ఆ దేశాలు కూడా పరిహారం చెల్లించాల్సిందేనని ఇరాన్ ఇప్పటికే డిమాండ్ చేసింది. శాంతి చర్చలకు ముందు ఇరాన్ పెట్టిన ఈ కఠిన నిబంధనలు ఇప్పుడు అగ్రరాజ్యం అమెరికాను ఇరకాటంలో పడేశాయి. ఈ పరిహారం చెల్లింపుపై అమెరికా ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో, ఇది శాంతి చర్చల భవిష్యత్తును ఎలా మారుస్తుందో అన్నది ఇప్పుడు అంతర్జాతీయ స్థాయిలో ఆసక్తికరంగా మారింది.

# నేటి నుంచి పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు

- మహిళా బిల్లు, డీలిమిటేషన్‌పై చర్చ
- ప్రభుత్వ తీరుపై విపక్షాల అసహనం
- వాడీవేడీగా సాగనున్న సమావేశాలు




**న్యూఢిల్లీ, ఏప్రిల్ 15:** పార్లమెంట్ మరో చారిత్రక నిర్ణయానికి వేదిక కాబోతున్నది. మహిళా బిల్లు, డీలిమిటేషన్ బిల్లు ఆమోదం కోసం ఉభయ సభలు గురువారం నుంచి మూడ్రోజులు సమావేశం కాబోతున్నా యి. మహిళా బిల్లును ఇప్పటికే ఆమోదంచారు. 2026 జనాభా లెక్కల మేరకు సీట్లు కేటాయిస్తామని ప్రకటించారు. అయితే ఇప్పుడు 2011 జనాభా లెక్కల మేరకే దీనిని మోదించే అవకాశం కనిపిస్తోంది. ఈ క్రమంలో పార్లమెంట్ ఉభయ సభలు వాడీవేడిగా సాగే అవకాశం ఉంది. ప్రస్తుతం ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న బిల్లు స్వరూపాన్ని విపక్షాలు వ్యతిరేకిస్తున్నాయి. అందువల్ల నేటి నుంచి సాగే సమావేశాలపై ఉత్కంఠత కొరసాగుతోంది. ఉభయ సభల్లోనూ బిల్లుల ఆవశ్యకతపై ప్రధాని మోదీ మాట్లాడుతారు. ఇప్పటికే కాంగ్రెస్ తన వ్యూహం ఖరారు చేసుకుంది. తృణమూల్ సహా అనేక పార్టీలు అధికార బిజెపి తీరును తప్పుపడుతున్నాయి. ఇకపోతే దేశంలో అసెంబ్లీ, లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన కోసం ఇప్పటివరకూ నాలుగు డీలిమిటేషన్ కమిషన్లు పని చేశాయి. ఇప్పుడు ఐదోది ఏర్పాటవుతోంది. ఇందులో రాష్ట్రాల నుంచి ఎన్నికయ్యే వారి సంఖ్యను 815గా, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి 35గా పేర్కొంది. ఇందుకోసం రాజ్యాంగంలోని ఆర్టికల్ 81ని సవరించాలని నిర్ణయించింది. దీని ప్రకారం దేశంలో లోక్‌సభ స్థానాలు 54.54శాతం మేర పెరిగే అవకాశముంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 82 అసెంబ్లీ స్థానాల పునర్విభజన, ఆర్టికల్ 170 అసెంబ్లీ స్థానాల గరిష్ఠ సంఖ్య గురించి చెబుతున్నాయి. ఇప్పటివరకూ ఉన్న నిబంధనల ప్రకారం ఆర్టికల్ 82 కింద అసెంబ్లీ స్థానాలను పునర్విభజించాలంటే 2026 తర్వాత ప్రచురించే తొలి జనాభా లెక్కలను పరిగణనలోకి తీసుకోవాలి. ఇప్పుడు ఆ నిబంధనను సవరించి ప్రతి జనాభా లెక్కల తర్వాత అసెంబ్లీ స్థానాలను పునర్విభజించడానికి అవకాశం కల్పించారు. ఆర్టికల్ 334ఏలో ఇదివరకు 106వ రాజ్యాంగ సవరణ చట్టం-2023 (మహిళా రిజర్వేషన్ల చట్టం) ఆమోదం పొందిన తర్వాత చేపట్టే తొలి జనాభా లెక్కల ప్రాతిపదికన నిర్వహించే నియోజకవర్గాల పునర్విభజన తర్వాతే మహిళా రిజర్వేషన్లు అమల్లోకి వస్తాయని పేర్కొన్నారు. ఇప్పుడు దాన్ని సవరించి డీలిమిటేషన్ పక్రియ పూర్తయిన వెంటనే ఇవి అమల్లోకి వస్తాయని స్పష్టత ఇచ్చారు. 84వ రాజ్యాంగ సవరణ చట్టం-2001లో ఆర్టికల్ 55, 81, 82, 170, 330, 332లను సవరించి 1971 జనాభా లెక్కల ప్రకారమే పార్లమెంటు, అసెంబ్లీల సీట్లను కేటాయించాలని పేర్కొన్నారు. 2026 తర్వాత తొలి జనాభా లెక్కలు చేపట్టేంతవరకూ వాటిని పునర్విభజించకూడదని షరతు విధించారు. 2003లో చేసిన 87వ రాజ్యాంగ సవరణ చట్టంలో ఆర్టికల్ 81, 82, 170, 330లను సవరించి అసెంబ్లీ, లోక్‌సభ సీట్లను పెంచకుండా 2001 జనాభా లెక్కల ప్రకారం ఆయా రాష్ట్రాల్లోని స్థానాలను పునర్విభజించు కోవడానికి అవకాశం కల్పించారు. దీని ప్రకారం 2008లో నియోజకవర్గాల పునర్విభజన చేయగా 2009 ఎన్నికల్లో అవి అమల్లోకి వచ్చాయి. మహిళా రిజర్వేషన్లకు అనుగుణంగా దేశ వ్యాప్తంగా లోక్‌సభ, అసెంబ్లీ సీట్ల పునర్విభజన కోసం సుప్రీంకోర్టు ప్రస్తుత/ మాజీ న్యాయమూర్తి ఆధ్వర్యంలో డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటు కానుంది. బిల్లు పార్లమెంటు ఉభయ సభల ఆమోదం పొంది చట్టరూపం దాల్చిన తర్వాత కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిన నాటి నుంచి కమిషన్ అమల్లోకి వస్తుంది. సుప్రీం కోర్టు ప్రస్తుత/మాజీ న్యాయమూర్తిని కేంద్ర ప్రభుత్వం కమిషన్ ఛైర్‌పర్సన్‌గా నియమిస్తుంది. కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్‌గానీ, ఆయన నామినీగానీ ఎక్స్‌అఫీషియో సభ్యుడిగా ఉంటారు. అలాగే రాష్ట్రాల ప్రధాన ఎన్నికల అధికారులు ఎక్స్ అఫీషియో సభ్యులుగా నియమితులవుతారు. ఇది దేశవ్యాప్తంగా ఉన్న పార్లమెంటు, అసెంబ్లీలతోపాటు, పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ ప్రాంతంలోని అసెంబ్లీ స్థానాల పునర్విభజననూ చేపడుతుంది. తాజా జనాభా లెక్కల ఆధారంగా రాష్ట్రాలు/కేంద్ర పాలిత ప్రాంతాల వారీగా ఎన్ని లోక్‌సభ, అసెంబ్లీ స్థానాలు ఉండాలన్నది ఈ కమిషన్ నిర్ణయిస్తుంది. అలాగే రాష్ట్రాలవారీగా లోక్‌సభ, అసెంబ్లీ స్థానాలను విభజిస్తుంది.

# కాల్పుల విరమణ గడవు పొడిగించే ఛాన్స్ లేదు

- శాశ్వతమైన ఒప్పందం వైపే మొగ్గు చూపుతున్నాం
- ట్రంప్ మరోమారు కీలక వ్యాఖ్యలు

**వాషింగ్టన్,ఏప్రిల్15:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌తో కొనసాగుతున్న కాల్పుల విరమణను పొడిగించే ఆలోచన తనకు లేదని.. శాశ్వతమైన ఒప్పందం వైపే తాము మొగ్గు చూపుతున్నామని అన్నారు. టెహ్రాన్‌తో చర్చలు కొనసాగుతున్నప్పటికీ.. కాల్పుల విరమణను పునరుద్ధరించకుండానే అవి ముగిసే అవకాశముందని తెలిపారు. చర్చలు ఏవిధంగా ముగిసినప్పటికీ ఇరాన్‌తో ఒప్పందం కుదిరితేనే అందరికీ మంచిదన్నారు. వాషింగ్టన్-టెహ్రాన్ మధ్య కాల్పుల విరమణ అంగీకారం గడువు ఈనెల 21తో ముగియనుంది. ఈ నేపథ్యంలో చర్చల ద్వారా శాశ్వత శాంతిఒప్పందం కుదుర్చుకోవాలని అమెరికా ఎదురుచూస్తున్నట్లు ట్రంప్ పేర్కొన్నారు. పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్ వేదికగా రాబోయే రెండు రోజుల్లో మరోసారి ఇరాన్ అధికారులతో సమావేశమవనున్నట్లు తెలిపారు. రెండోవిడత చర్చలపై ఆశాభావం వ్యక్తం చేస్తూ..ఆ రెండు రోజులు అద్భుతంగా ఉండబోతున్నాయన్నారు. గతంలో ఇరాన్‌లో ఉన్న అతివాద శక్తులు పోయి.. ప్రస్తుతం కొత్త పాలన నెలకొందన్నారు. కొత్త పాలకుతో కలిసి పని చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు.



# బంగ్లా పౌరుల పడవ మునక

- 250 మంది గల్లంతు.. ముమ్మర గాలింపు



ఢాకా, ఏప్రిల్ 15: అండమాన్ తీర సముద్రంలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. రోహింగ్యా శరణార్థులు, బంగ్లాదేశ్ పౌరులతో వెళ్తోన్న ఓ పడవ మునిగిపోయింది. ఘటనలో దాదాపు 250 మంది గల్లంతయ్యారు. వారి కోసం సముద్రంలో ముమ్మరంగా గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. గల్లంతైన వారిలో చిన్నారులు కూడా ఉన్నారు. ఈ ప్రమాదంపై ఐక్యరాజ్యసమితి శరణార్థుల హైకమిషనర్, ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ మైగ్రేషన్ సంయుక్త ప్రకటన విడుదల చేసింది. ఈ పడవ దక్షిణ బంగ్లాదేశ్ లో టేక్‌నాఫ్ ప్రాంతం నుంచి బయల్దేరినట్లు ఈ ప్రకటనలో ఐరాస అధికారులు పేర్కొన్నారు. మలేసియా వెళ్తుండగా బలమైన ఈదురుగాలులు, కెరటాల ఉధృతి కారణంగా మునిగినట్లు వెల్లడించారు. కాగా.. ఈ పడవలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించారని, అది కూడా ప్రమాదానికి కారణమై ఉండొచ్చని తెలిపారు. ఈ పడవ ఏప్రిల్ 4న బంగ్లాదేశ్ నుంచి బయల్దేరినట్లు తెలుస్తోంది. కాక్స్ బజార్‌లోని శరణార్థుల శిబిరాల్లో ఉన్న వీరు కనీస జీవన సదు-పాయాల కోసం మలేసియాకు వలస వెళ్తుండగా ఈ ఘోర ప్రమాదం చోటుచేసుకున్నట్లు ఐరాస అధికారులు వెల్లడించారు. వాస్తవానికి రోహింగ్యాలు.. మయన్మార్‌కు చెందినవారు. కానీ, 2017లో అక్కడి సైన్యం మారణహోమం నుంచి తప్పించుకునేందుకు లక్షలాది రోహింగ్యాలు బంగ్లాదేశ్‌కు తరలిపోయారు. దీంతో కాక్స్ బజార్‌లో శరణార్థి శిబిరాలు కిక్కిరిసిపోయాయి. అయితే, ఇటీవల ఇక్కడి పరిస్థితులూ క్షీణించడంతో వీరంతా ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయేందుకు వలసబాట పడుతున్నారు. ఈ క్రమంలోనే ప్రమాదకర సముద్ర ప్రయాణాలను ఎంచుకుంటున్నారు.

# రేపాలలో ఆధ్యాత్మిక వైభవం.. బొడ్రాయి ఉత్సవం









**నేటి సాక్షి, మునగాల :** రేపాల గ్రామంలో బొడ్రాయి పుష్కర వసంత ఉత్సవాలు మంగళవారం అట్టహాసంగా నిర్వహించబడ్డాయి. తెల్లవారుజాము నుంచే గ్రామమంతా పండుగ శోభతో కళకళలాడగా, భక్తులు భారీగా తరలి వచ్చి ఉత్సవాల్లో పాల్గొన్నారు. గ్రామ సర్పంచ్ మొగిలిచర్ల సత్యనారాయణ - నాగమణి దంపతులు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమం భక్తి, సంప్రదాయం, సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలిచింది. ఉత్సవాల సందర్భంగా బొడ్రాయికి జలాభిషేకం, కుంకుమాభిషేకం, పుష్పాభిషేకం పాలాభిషేకం, చక్రాభిషేకం వంటి విశేష అభిషేకాలు ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక అర్చనలు జరిపి, దేవతను శాస్త్రోక్తంగా ఆరాధించారు. ఈ అభిషేకాల సమయంలో వేద మంత్రోచ్చారణలు మారుమోగి బొడ్రాయి ప్రాంగణం ఆధ్యాత్మిక కాంతితో నిండిపోయింది. గ్రామ మహిళలు గణనీయ సంఖ్యలో పాల్గొని బొడ్రాయిని పూలతో, అందంగా అలంకరించారు. సంప్రదాయ వస్త్రధారణలో హాజరైన మహిళలు మంగళహారతులు ఇస్తూ భక్తి గీతాలు ఆలపించడంతో ఉత్సవాలకు ప్రత్యేక శోభ చేకూరింది. చిన్నారులు కూడా ఉత్సాహంగా పాల్గొని గ్రామంలో పండుగ సందడిని రెట్టింపు చేశారు. వేద పండితుడు వేదం గురునాథ శర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. హోమాలు, యజ్ఞాలు, ప్రత్యేక అర్చనలు నిర్వహించగా, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించారు. ప్రజలందరూ కలిసి బొడ్రాయి పుష్కర వసంత ఉత్సవం జరపటం గ్రామ ఐక్యతను చాటుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ. బొడ్రాయి పుష్కర వసంత ఉత్సవాల ప్రాముఖ్యతను వివరించారు. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు గ్రామంలో ఐక్యతను పెంపొందించడంతో పాటు సంప్రదాయాలను కాపాడుతాయని పేర్కొన్నారు. యువత కూడా నిర్వహణలో చురుకుగా పాల్గొని సేవా కార్యక్రమాలను విజయవంతం చేయడంలో కీలక పాత్ర పోషించారు. మొత్తంగా రేపాల గ్రామంలో నిర్వహించిన బొడ్రాయి పుష్కర వసంత ఉత్సవాలు భక్తి, ఆనందం, ఐక్యతలకు ప్రతీకగా నిలిచాయి. గ్రామమంతా పండుగ వాతావరణంతో కళకళలాడగా, భక్తుల హర్షధ్వానాలతో ఆ ప్రాంతం మారుమోగింది. ఈ ఉత్సవాలు గ్రామ చరిత్రలో చిరస్మరణీయంగా నిలిచేలా నిర్వహించబడినట్లు గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేశారు.

### భక్తి పరవశంలో మునిగిపోయిన గ్రామం

- సర్పంచ్ మొగిలిచర్ల సత్యనారాయణ - నాగమణి దంపతుల ఆధ్వర్యంలో పుష్కర వసంత ఉత్సవం
- జలాభిషేకాలు, విశేష అర్చనలతో హోరెత్తిన ప్రాంగణం..
- వేద మంత్రోచ్చారణల మధ్య వేడుక
- వెల్లివిరిసిన గ్రామ ఐక్యత











# పట్టణంలో పల్లెటూరు!



## అయ్యప్పగుట్టపై 'ఎన్టీఆర్ నగర్ కాలనీ' వాస్తవ దృశ్యమాలిక

**మున్సిపల్ పరిధిలోని 5వ వార్డులో 'మౌలిక వసతుల లేమి'**

## పట్టణ సరిహద్దుల్లో 'గ్రామీణ కష్టాలు'

**అభివృద్ధి మాటల్లోనే... వాస్తవంలో అన్ని బాధలే.!**

**నేతలెందరు మరినా.. తలరాత మారని కాలనీ కథ ఇది!**

**నేటి సాక్షి, కోరుట్ల (రాధారపు నర్సయ్య) :** "నలభై ఏళ్ల కాలం గడిచింది... నాయకులు మారారు... హామీలు మారాయి... కానీ అయ్యప్పగుట్టపైనున్న 5వ వార్డులోని 'ఎన్టీఆర్ నగర్ కాలనీ' తలరాత మాత్రం మారలేదు. ఓట్ల కోసం అభివృద్ధి మంత్రాలు జపించినవారు అధికారంలోకి వచ్చాక తమ వ్యక్తిగత జీవితాలను మార్చుకున్నారే గానీ, కాలనీ ప్రజల దైనందిన కష్టాలను తీర్చడంలో విఫలమయ్యారు. ప్రతి ఐదేళ్లకోసారి కొత్త కౌన్సిలర్ వచ్చి కొత్త హామీలు ఇస్తూ వెళ్లిపోయినా, కాలనీ రూపురేఖలు మాత్రం యథాతథంగా నిలిచిపోయాయి. పట్టణంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న కోరుట్లలోనే ఒక మూల ఇప్పటికీ పల్లెటూరి బారిన పడటం ఈ ప్రాంత ప్రజల దురదృష్టకర వాస్తవం.మున్సిపల్ పరిధిలో ఉన్నప్పటికీ, తాగునీరు, డ్రైనేజీ, రహదారులు, విద్యుత్ వంటి కనీస మౌలిక వసతులు అందక ప్రజలు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. రహదారులు లేక బొడిగెరాళ్లపై నడిచే జీవనం, ఇళ్ల ముందు మురికి నీరు నిలిచిపోయే దుస్థితి, రాత్రివేళల్లో చీకట్లోనే గడిచే జీవన విధానం అన్నీ..ఇవి పట్టణ జీవనానికి విరుద్ధంగా నిలుస్తున్నాయి. అభివృద్ధి గురించి సమావేశాలు, ప్రణాళికలు జరుగుతున్నా, వాటి ఫలితం మాత్రం ఈ కాలనీ ప్రజలకు అందడంలేదు.'పట్టణంలో పల్లెటూరు' అనే మాటకు ప్రతిరూపంగా నిలిచిన ఈ అయ్యప్పగుట్ట కాలనీ పరిస్థితి పరిపాలనా వ్యవస్థల పనితీరును ప్రశ్నిస్తోంది. ఇంతకాలంగా నిర్లక్ష్యానికి గురైన ఈ ప్రాంతానికి ఇప్పటికైనా సమగ్ర అభివృద్ధి అవసరం అనేది ప్రతి ఒక్కరి అభిప్రాయం. ప్రజలు ఎదురుచూస్తున్నది కేవలం హామీలు కాదు... మార్పు.! ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు బాధ్యతగా ముందుకు వచ్చి ఈ కాలనీకి కనీస సౌకర్యాలు కల్పిస్తేనే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుంది.!"



### 1983లో 'నీడ' పథకం కింద ఎన్టీఆర్ నగర్ కాలనీ.!

1983లో ఎన్టిఆర్ (నందమూరి తారక రామారావు) ముఖ్యమంత్రి అయిన తర్వాత, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో పేదలు, నిరుపేదలు, సంచార జాతులు (నోమాడిక్ ట్రైబ్స్/బుడిగె జంగాలు/కప్పలోల్లు/పిట్టలోల్లు/బంజారా/లంబాడి వంటి సమాజాలు) కోసం పక్కా ఇళ్లు నిర్మించడం ఆయన పాలనలో ఒక ముఖ్యమైన సంక్షేమ చర్య.! అప్పటి ఎన్.టి.ఆర్ ప్రభుత్వం 'నీడ' పథకం ద్వారా దేశంలోనే మొదటిసారిగా పేదలకు పక్కా గృహాలు అందించింది. 1986లో ఒక్కసారిగా 1,70,000 పేద కుటుంబాలకు ఇళ్లు నిర్మించారు (సుమారు రూ.165 కోట్ల ఖర్చుతో). మొత్తం 1983-1989 కాలంలో 6.5 లక్షల ఇళ్లు నిర్మించి, 13 లక్షల కుటుంబాలకు ఇంటి స్థలాలు కేటాయించారు.ఇవి సాధారణంగా 'ఎన్.టి.ఆర్ కాలనీలు' లేదా 'ఎన్.టి.ఆర్ నగర్' పేరుతో పిలువబడేవి. ప్రతి నియోజకవర్గం (అసెంబ్లీ సెగ్మెంట్)లో ఒకటి లేదా అంతకంటే ఎక్కువ కాలనీలు ఏర్పాటు చేశారు. ఇవి చాలా చోట్ల నిరుపేదలు, ఎస్సి/ఎస్టి/బీసీలు, సంచార జాతులు నివసించే ప్రాంతాల్లో నిర్మించబడ్డాయి.!

### 'చెంచాడు' అభివృద్ధికైనా నోచుకోని కాలనీ.!

1983లో ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో పేదలకు ఇళ్లు కల్పించాలనే లక్ష్యంతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అంతటా ఎన్టీఆర్ కాలనీలు ఏర్పాటు చేశారు. నిరుపేదలు, సంచారజాతులకు పక్కా ఇళ్లు కట్టించి వారికి గౌరవప్రదమైన జీవితం అందించాలన్నదే ప్రధాన ఉద్దేశం. ఆ దిశగా కోరుట్ల మున్సిపల్ పరిధిలో అప్పటి 'అల్లమియాగట్ట'పై 500 పక్కా ఇళ్లచే ఎన్టీఆర్ నగర్ కాలనీ ఏర్పడింది. కాలక్రమేణా ఈ కాలనీ 'అయ్యప్పగుట్ట'గా మారి ప్రస్తుతం 5వ వార్డుగా గుర్తింపు పొందింది. అయితే ప్రారంభ దశలో ఉన్న సంకల్పం, ప్రభుత్వ ఆశయాలు ఆచరణలో నిలబడలేదు. కాలనీ నిర్మాణం జరిగినప్పటికీ, దానికి అనుసంధానంగా అవసరమైన మౌలిక వసతులు కల్పించడంలో విఫలమయ్యారు. కాలం గడిచేకొద్దీ సమస్యలు పెరిగాయి..కానీ పరిష్కారాలు మాత్రం కనిపించలేదు. నాటి సంక్షేమ కార్యక్రమం నేటి పరిస్థితుల్లో రూపు మార్చుకుని ప్రజలకు భారంగా మారింది.



### పాలన ఉందిగానీ... పట్టింపే లేదు.!

ఈ కాలనీలో ఇప్పటివరకు 7-8 మంది కౌన్సిలర్లు బాధ్యతలు చేపట్టారు. ప్రతి ఎన్నికల సమయంలో అభివృద్ధి హామీలు ఇస్తూ ప్రజల ముందుకు వచ్చినప్పటికీ, ఆ హామీలు అమలులోకి రాలేదు. పదవులు చేపట్టినవారు కాలనీ అభివృద్ధిపై కన్నా వ్యక్తిగత లాభాలపై ఎక్కువ దృష్టి పెట్టారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రజల సమస్యలను పట్టించుకునే నాయకత్వం లేకపోవడం వల్ల పరిస్థితి మరింత దిగజారింది. అధికారంలో ఉన్నవారు మారినా కాలనీ దుస్థితి మాత్రం అలాగే కొనసాగుతోంది. ప్రజలు ఎన్నిసార్లు సమస్యలు ప్రస్తావించినా, పరిష్కారం కోసం ఎవరూ ముందుకు రాకపోవడం తీవ్ర నిరాశ కలిగిస్తోంది. పాలన యంత్రాంగం ఉన్నట్టే గానీ, ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడంలో విఫలమవుతోంది.!





### ఎడతెగని తాగునీటి తిప్పల కథ.!

తలాపునే సముద్రమున్నా.. తాగునీటి తండ్లాట తప్పని దుస్థితి వారిది. పట్టణానికి మిషన్ భగీరథ పథకం కింద తాగునీరు అందించే పెద్ద 'వాటర్ ట్యాంక్' ఉన్నా కాలనీ వాసులకు తాగునీటి సమస్య అత్యంత తీవ్రంగా ఉంది.అప్పుడెప్పుడో ఏర్పాటు చేసిన చేతిపంపులు ఇప్పుడు పూర్తిగా పనికిరాని స్థితికి చేరాయి. నీటి కోసం ప్రజలు దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. వేసవి కాలంలో పరిస్థితి మరింత దారుణంగా మారుతుంది. ట్యాంకర్ల ద్వారా మూడు రోజులకు ఒకసారి నీరు సరఫరా చేసినా, అది కాలనీ అవసరాలకు సరిపోదు. దీంతో ప్రజలు నీటి కోసం గొడవలకు దిగే పరిస్థితి ఏర్పడుతోంది. కుటుంబ అవసరాలకు సరిపడా నీరు అందక ఇబ్బందులు పడుతున్నారు. చిన్నపిల్లలు, మహిళలు ఎక్కువగా ఈ సమస్యను ఎదుర్కొంటున్నారు. తాగునీటి కోసం పడే కష్టాలు వారి రోజువారీ జీవితాన్ని మరింత కష్టతరం చేస్తున్నాయి.

### డ్రైనేజీ లేక రోడ్లపైనే మురికి ప్రవాహం

కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా లేనట్టే ఉంది. ఇళ్ల నుంచి వెలువడే మురికి నీరు రోడ్లపైనే ప్రవహిస్తోంది. మున్సిపల్ రికార్డుల్లో డ్రైనేజీ ఉన్నట్టు చూపించినా, భౌతికంగా ఎక్కడా కనిపించదు. కాలనీ అంతా మురికితో నిండిపోవడంతో ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయి. దోమలు, వ్యాధులు విస్తరించే ప్రమాదం ఉంది. వర్షాకాలంలో పరిస్థితి మరింత విషమంగా మారుతుంది. రోడ్డు, కాలువ మధ్య తేడా తెలియని స్థితి ఏర్పడుతుంది. ప్రజలు నడవడానికి కూడా ఇబ్బంది పడుతున్నారు. మురికి నీరు నిల్వ ఉండటం వల్ల దుర్వాసనలు వ్యాపిస్తున్నాయి. ఇది కాలనీ జీవన ప్రమాణాలను దెబ్బతీస్తోంది. రోడ్లు లేక నడకే కష్టం కాలనీలో సరైన



రహదారులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సీసీ రోడ్లు ఎక్కడా కనిపించవు. అంతర్గత రహదారులు పూర్తిగా అభివృద్ధి చెందలేదు. బొడిగెరాళ్లతో నిండిన దారులపై నడవాల్సి వస్తోంది. వర్షం పడితే రహదారులు పూర్తిగా బురదమయంగా మారుతున్నాయి. వాహనాలు వెళ్లడం కాదు కదా కనీసం కాలినడకన కూడా కష్టసాధ్యంగా మారుతోంది. అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్ వంటి సేవలు అందడం కష్టమవుతోంది. చిన్నపిల్లలు, వృద్ధులు ఎక్కువగా ఇబ్బంది పడుతున్నారు.మున్సిపల్ కార్యాలయ లెక్కల్లో మురికి కాలువలు ఉన్నా, ఫిజికల్ వెరిఫికేషన్‌కు వస్తే రోడ్డు మీద నడుస్తున్నామో లేదా మురికి కాలువలో నడుస్తున్నామో తేడా గుర్తించడం కష్టం.రహదారుల లేమి కాలనీ అభివృద్ధికి ప్రధాన అడ్డంకిగా మారింది.

### శివారు ప్రాంతమంతా చీకట్లోనే.!

విద్యుత్ సౌకర్యం కాలనీలో చాలా పరిమితంగా ఉంది. వీధి దీపాలు సరిపడా లేవు. రాత్రి వేళల్లో కాలనీ పూర్తిగా చీకట్లో మగ్గిపోతుంది. ఇది భద్రత సమస్యలకు దారితీస్తోంది. కాలనీవారు ఎవరో, దొంగలెవరో గుర్తించలేని పరిస్థితి నెలకొంటోంది. మహిళలు, వృద్ధులు భయాందోళనల మధ్య జీవనం సాగిస్తున్నారు. విద్యుత్ స్తంభాలు అవసరమైన చోట్ల లేవు. సరైన లైటింగ్ లేకపోవడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశముంది. ఇది కాలనీ ప్రజల జీవన నాణ్యతను ప్రభావితం చేస్తోంది.

### ఇప్పటికీ ఇళ్లే లేని వారెందరో.!

గ్రామాల్లో అయినా కనీస మౌలిక వసతులు కొంతవరకు ఉంటాయి. కానీ అయ్యప్పగుట్ట కాలనీలో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ఇళ్లే లేక తాత్కాలిక గుడిసెల్లో జీవనం సాగిస్తున్న కుటుంబాలు ఎన్నో ఉన్నాయి. వర్షం వస్తే గుడిసెల్లో నీరు చేరుతుంది. వేసవిలో నీటి కోసం పోరాటం చేయాల్సి వస్తుంది. ఈ పరిస్థితులు ప్రజల జీవన ప్రమాణాలను దెబ్బతీస్తున్నాయి.కాలనీలో చాలామంది ఇంకా పక్కా ఇళ్లు లేకపోవడం బాధాకరం. తాత్కాలిక తాటిపత్రాలు, ఫ్లెక్సీలతో గుడిసెలు కట్టుకుని జీవనం సాగిస్తున్నారు. వర్షం, గాలి, ఎండల నుంచి రక్షణ లేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఆశ్రయం పూర్తిగా అందలేదని ప్రజలు చెబుతున్నారు. స్థిరమైన నివాసం లేక జీవనం అనిశ్చితంగా మారింది. పిల్లల విద్య, ఆరోగ్యం వంటి అంశాలపై ఇది ప్రభావం చూపుతోంది. కాలనీ ఉద్దేశం ఆశ్రయం కల్పించడమే అయినా, అది పూర్తిగా సాధ్యపడలేదు.

### శ్మశానం లేక మానవతకు మచ్చ.!

కాలనీలో శ్మశానం లేకపోవడం అత్యంత బాధాకరమైన అంశం. ఎవరైనా మరణిస్తే శవాన్ని ఎక్కడ ఉంచాలో తెలియని పరిస్థితి ఉంది. ముఖ్యంగా కిరాయి దారుల పరిస్థితి మరింత దయనీయంగా ఉంటుంది. శవాన్ని ఇంట్లోకి రానివ్వని పరిస్థితులు కూడా ఉన్నాయి. అంత్యక్రియలు నిర్వహించడానికి దూర ప్రాంతాలకు తీసుకెళ్లాల్సి వస్తోంది. ఇది కుటుంబ సభ్యులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది.



ఈ సమస్య మానవతకు మచ్చగా నిలుస్తోంది. ముక్తినిలయం ఏర్పాటు అత్యవసరంగా మారింది.

### అభివృద్ధి కోసం ఎదురు చూపులు

కాలనీ అభివృద్ధి కోసం ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్నారు. సీసీ రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక వసతులు కల్పించాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలి. ప్రజాప్రతినిధులు తమ బాధ్యతను గుర్తించాలి.ఇప్పటికైనా కాలనీకి సమగ్ర అభివృద్ధి అవసరం.





# జాతీయ హాకీ శిబిరానికి తెలంగాణ ప్లేయర్లు

**హైదరాబాద్ :** జాతీయ హాకీ శిబిరానికి రాష్ట్రానికి చెందిన హర్ష్‌కుమార్, వీణ ఎంపికయ్యారు. రాంచీ వేదికగా ఇటీవల ముగిసిన జాతీయ సబ్‌జూనియర్ హాకీ టోర్నీలో మెరుగైన ప్రదర్శన కనబరిచిన హర్ష్‌కుమార్, వీణ భోపాల్ సాయ్ సెంటర్‌లో శిక్షణ పొందనున్నారు. ఈనెల 19 నుంచి మొదలయ్యే క్యాంప్ ద్వారా అండర్-18 జూనియర్ ఆసియా కప్ టోర్నీకి భారత జట్లను ఎంపిక చేయనున్నారు. వచ్చే నెల 29 నుంచి జూన్ 6వ తేదీ వరకు జపాన్ వేదికగా ఆసియా కప్ హాకీ టోర్నీ జరుగనుంది.




# అజింక్య రహానేకు 12 లక్షల జరిమానా

**చెన్నై:** కోల్‌కతా నైట్ రైడర్స్ కెప్టెన్ అజింక్య రహానే కు ఫైన్ పడింది. అతనికి 12 లక్షల జరిమానా విధించారు. ఐపీఎల్‌లో మంగళవారం చెన్నై సూపర్ కింగ్స్ తో జరిగిన మ్యాచ్‌లో స్లో ఓవర్ రేట్ కారణంగా అతనికి ఫైన్ వేశారు. ఈ సీజన్‌లో కోల్‌కతా పర్ఫార్మెన్స్ మరీ దారుణంగా ఉంది. ఇప్పటి వరకు ఆ జట్టు ఒక్క మ్యాచ్ కూడా గెలవలేదు. చెన్నైతో జరిగిన మ్యాచ్‌లో 32 రన్స్ తేడాతో కోల్‌కతా ఓటమి పాలైంది. టాటా ఐపీఎల్‌లో భాగంగా జరిగిన 22వ మ్యాచ్‌లో స్లో ఓవర్ రేట్ కారణంగా రహానేకు ఫైన్ వేసినట్లు ఐపీఎల్ మీడియా అడ్వైజరీ ఓ ప్రకటనలో చెప్పింది. ఈ సీజన్‌లో ఐపీఎల్ ప్రవర్తనా నియమావళిలోని ఆర్టికల్ 2.22 కింద తొలిసారి నేరంగా పరిగణిస్తూ ఆ ఫైన్ వేసినట్లు చెప్పారు. శుక్రవారం గుజరాత్ టైటాన్స్‌తో తన తదుపరి మ్యాచ్ కోల్‌కతా ఆడనున్నది.

# ముంబై ఇండియన్స్‌కు 'హిట్ మ్యాన్' షాక్!

## గాయంతో రెండు మ్యాచ్‌లకు రోహిత్ దూరం



**ముంబై:** ఐపీఎల్ 2026 సీజన్‌లో ఇప్పటికే వరుస ఓటములతో సతమతమవుతున్న ముంబై ఇండియన్స్ జట్టుకు ఊహించని ఎదురుదెబ్బ తగిలింది. ఆ జట్టు సీనియర్ బ్యాటర్, మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ గాయం కారణంగా రాబోయే కనీసం రెండు మ్యాచ్‌లకు అందుబాటులో ఉండటం లేదని సమాచారం. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో జరిగిన ఉత్కంఠభరిత పోరులో రోహిత్ కండరాలు పట్టేయడంతో తీవ్ర ఇబ్బంది పడ్డారు. ఫిజియోలు ప్రాథమిక చికిత్స అందించినప్పటికీ నొప్పి తగ్గకపోవడంతో ఆయన 'రిటైర్డ్ హర్ట్'గా వెనుదిరగాల్సి వచ్చింది. స్కానింగ్ నివేదికల అనంతరం, వైద్యుల సూచన మేరకు మేనేజ్‌మెంట్ ఆయనకు విశ్రాంతిని ప్రకటించింది. ఐపీఎల్ ముగిసిన వెంటనే భారత జట్టు అంతర్జాతీయ సిరీస్‌లు ఆడాల్సి ఉండటంతో, రోహిత్ గాయంపై బీసీసీఐ కూడా దృష్టి సారించింది. రోహిత్ గాయం తీవ్రత పెరగకుండా చూడాలని, త్వరగా కోలుకునేలా జాగ్రత్తలు తీసుకోవాలని ముంబయి ఫిజియోలకు బోర్డు సూచించినట్లు తెలుస్తోంది. బీసీసీఐ వైద్య బృందం నిరంతరం రోహిత్ ఆరోగ్యాన్ని పర్యవేక్షిస్తోంది. మరోవైపు సోషల్ మీడియా వేదికగా రోహిత్ శర్మ త్వరగా కోలుకుని క్రీజులోకి రావాలని క్రికెట్ అభిమానులు ప్రార్థిస్తున్నారు. రోహిత్ లేని లోటును ముంబయి ఇండియన్స్ ఎలా భర్తీ చేస్తుందో తదుపరి మ్యాచ్‌లలో చూడాల్సిందే.

# బెంగళూరు భళా!


## రాయల్ ఛాలెంజర్స్ గెలుపు మోత

**లక్నో సూపర్ జెయింట్స్ పై 5 వికెట్ల తేడాతో ఘన విజయం**

**బంతితో చెలరేగిన రసిఖ్ సలామ్, భువనేశ్వర్ కుమార్**

**బ్యాట్ తో అదరగొట్టిన విరాట్ కోహ్లీ, రజత్ పాటిదార్**

**29 బంతులు మిగిలి ఉండగానే లక్ష్య ఛేదన**



**బెంగళూరు :** ఐపీఎల్ టోర్నీలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు అదరగొట్టింది. తమ సొంత గడ్డ చిన్నస్వామి స్టేడియం వేదికగా బుధవారం జరిగిన మ్యాచ్ లో లక్నో సూపర్ జెయింట్స్ పై 5 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. బౌలింగ్, బ్యాటింగ్ విభాగాల్లో సమష్టిగా రాణించి ప్రత్యర్థిని చిత్తు చేసింది. పక్కా వ్యూహంతో బరిలోకి దిగిన బెంగళూరు బౌలర్లు ముందుగా లక్నోను సాధారణ స్కోరుకే పరిమితం చేయగా.. ఆ తర్వాత బ్యాటర్లు ఆ లక్ష్యాన్ని సునాయాసంగా ఛేదించారు. రన్ రేట్ మెరుగుపరుచుకోవాలన్న కసితో ఆడిన బెంగళూరు జట్టు మరో 29 బంతులు మిగిలి ఉండగానే ఆటను ముగించడం విశేషం.



### రాణించిన రసిఖ్, భువీ

ఈ మ్యాచ్ లో టాస్ గెలిచిన బెంగళూరు జట్టు బౌలింగ్ ఎంచుకుంది. దీంతో మొదట బ్యాటింగ్ కు దిగిన లక్నో జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 146 పరుగులు మాత్రమే చేయగలిగింది. లక్నో బ్యాటర్లలో మిచెల్ మార్ష్ 32 బంతుల్లో 40 పరుగులు, ముకుల్ చౌదరి 28 బంతుల్లో 39 పరుగులు, ఆయుష్ బదోని 24 బంతుల్లో 38 పరుగులతో ఫర్వాలేదనిపించారు. వీరు క్రీజులో కుదురుకున్నట్లే కనిపించినా భారీ స్కోర్లుగా మలచలేకపోయారు. బెంగళూరు బౌలర్లు కచ్చితమైన లైన్ లెంగ్త్ తో బంతులు విసరడంతో లక్నో బ్యాటర్లు భారీ షాట్లకు ఇబ్బంది పడ్డారు. ముఖ్యంగా యువ బౌలర్ రసిఖ్ సలామ్ కేవలం 24 పరుగులిచ్చి 4 కీలక వికెట్లు తీసి లక్నో పతనాన్ని శాసించాడు. అతనికి తోడుగా సీనియర్ బౌలర్ భువనేశ్వర్ కుమార్ 3 వికెట్లతో చెలరేగాడు. కృనాల్ పాండ్యా 2 వికెట్లు పడగొట్టి లక్నోను కట్టడి చేశారు.

### విరాట్ కోహ్లీ మెరుపులు.. పాటిదార్ సుడిగాలి

అనంతరం 147 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన బెంగళూరు జట్టు కేవలం 15.1 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 149 పరుగులు చేసి లక్ష్యాన్ని ముద్దాడింది. ఓపెనర్ విరాట్ కోహ్లీ 34 బంతుల్లో 49 పరుగులు చేసి తృటిలో హాఫ్ సెంచరీ చేజార్చుకున్నాడు. అతడి బాధ్యతాయుతమైన ఇన్నింగ్స్ జట్టు విజయానికి గట్టి పునాది వేసింది. మిడిలార్డర్ లో రజత్ పాటిదార్ కేవలం 13 బంతుల్లో 27 పరుగులు చేసి స్కోరు బోర్డును ఉరుకులు పెట్టించాడు. చివర్లో జితేష్ శర్మ 9 బంతుల్లో 23 పరుగులతో విరుచుకుపడి జట్టుకు అద్భుత విజయాన్ని అందించాడు. లక్నో బౌలర్లలో ప్రిన్స్ యాదవ్ 3 వికెట్లు తీసినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. అవేష్ ఖాన్ 2 వికెట్లు పడగొట్టాడు. పిచ్ పరిస్థితులను ముందే అంచనా వేసిన బెంగళూరు సారథి బౌలింగ్ ఎంచుకుని సగం విజయాన్ని అక్కడే ఖాయం చేసుకున్నాడు. పవర్ ప్లేలో పరుగులు కట్టడి చేయడంతో పాటు లక్నో బ్యాటర్లను ఒత్తిడిలోకి నెట్టడంలో బెంగళూరు బౌలర్లు పూర్తి స్థాయిలో సఫలమయ్యారు. ఛేదనలో కోహ్లీ అనుభవం జట్టుకు ఎంతో అక్కరకొచ్చింది. ఎక్కడా తడబడకుండా లక్ష్యం వైపు దూసుకుపోవడంతో లక్నో బౌలర్లకు ఏమాత్రం అవకాశం దక్కలేదు.









# అంతర్జాతీయ అరంగేట్రం

## ఆ స్టార్ ఆటగాళ్ల టీ20 స్థానం ప్రమాదంలో?

**ఢిల్లీ:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ మరోసారి యువ ప్రతిభకు వేదికగా నిలుస్తోంది. ఇటీవల ప్రఫుల్ హింగే, సకిబ్ హుస్సేన్ వంటి కొత్త ఆటగాళ్లు రాణించిన నేపథ్యంలో ఇప్పుడు అందరి దృష్టి యువ సంచలనం వైభవ్ సూర్యవంశీపై పడింది. వరుసగా రెండు ఐపీఎల్ సీజన్లలో అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకున్న వైభవ్ సూర్యవంశీ అంతర్జాతీయ అరంగేట్రానికి దగ్గరయ్యాడు. కేవలం 12 మ్యాచ్‌ల ఐపీఎల్ కెరీర్ లోనే సూర్యవంశీ 452 పరుగులు సాధించాడు. ఇందులో ఒక సెంచరీ, మూడు హాఫ్ సెంచరీలు ఉన్నాయి. స్ట్రైక్ రేట్ 228.28 చూస్తే వైభవ్ బౌలర్లపై ఎలా విరుచకపడుతాడో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఈ దూకుడుతో సెలెక్టర్ల దృష్టిని ఆకర్షించిన వైభవ్, ఐర్లాండ్ పర్యటనకు ఎంపికయ్యే అవకాశాలు బాగా కనిపిస్తున్నాయి. ఇదే నిజమైతే.. కేవలం 15 ఏళ్ల వయసులోనే సూర్యవంశీ టీమ్ ఇండియాలోకి వస్తే, క్రికెట్ గాడ్ సచిన్ టెండూల్కర్ రికార్డును బద్దలు కొట్టి, భారత జట్టుకు ఆడిన అతి పిన్న వయస్కుడిగా రికార్డ్ ను దక్కించుకుంటాడు. టెండూల్కర్ 16 ఏళ్ల వయసులో అరంగేట్రం చేసిన విషయం తెలిసిందే. అయితే, అతని ఎంపికలో ప్రధాన సమస్య టాప్ ఆర్డర్ లో చోటు కల్పించడం. ప్రస్తుతం టీమిండియాకు అభిషేక్ శర్మ, సంజు శాంసన్, ఇషాన్ కిషన్ డ్యాషింగ్ ఓపెనర్లు ఉండనే ఉన్నారు. టీ20 వరల్డ్ కప్ 2026 విజయానంతరం వీరు జట్టుకు మరింత కీలకంగా మారారు. అయితే సాధారణంగా ఐర్లాండ్ పర్యటనలో సీనియర్ ఆటగాళ్లకు విశ్రాంతి ఇచ్చి, కొత్త ఆటగాళ్లను పరీక్షించే అవకాశం బీసీసీఐ తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో సీనియర్లకు రెస్ట్ ఇస్తే సూర్యవంశీ ఓపెనర్ గా ఆడే అవకాశం దక్కించుకునే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. దీన్ని బట్టి చూస్తే అతి త్వరలో అభిషేక్ శర్మ, సంజు శాంసన్, ఇషాన్ కిషన్ కెరియర్ లో భారీ మార్పులు రానున్నాయి. చుడాలిమరి సెలెక్టర్లు ఎటువంటి నిర్ణయాలు తీసుకుంటారో..





# ఫ్రాన్స్ యానిమేషన్ ఫెస్టివల్‌లో యానిమేషన్ బాహుబలి

**భారతీయ చిత్ర పరిశ్రమకు దక్కిన గుర్తింపు అన్న రాజమౌళి**

రాజమౌళి సృష్టించిన 'బాహుబలి' మరో ఘనతను సొంతం చేసుకుంది. ఆయన రూపొందించిన 'బాహుబలి' ఫ్రాంచైజీ నుంచి వస్తున్న సరికొత్త యానిమేషన్ చిత్రం 'బాహుబలి: ద ఎటర్నల్ వార్' . 2027లో ఇది ప్రేక్షకుల ముందుకురానుంది. తాజాగా ఈ చిత్రం ఒక అరుదైన మైలురాయిని చేరుకుంది. ఫ్రాన్స్‌లో జరగనున్న ప్రతిష్టాత్మక ఎన్నెసి యానిమేషన్ ఫెస్టివల్ 2026 లోని 'వర్క్ ఇన్ ప్రోగ్రెస్' విభాగంలో ప్రదర్శనకు అధికారికంగా ఎంపికైంది. దీనిపై రాజమౌళి ఆనందం వ్యక్తంచేశారు. యానిమేషన్ అనేది హద్దులు లేని అద్భుతమైన ప్రపంచమనే విషయాన్ని నేను ఎప్పుడూ నమ్ముతానని ఈ సందర్భంగా అన్నారు. ఇది మన భారతీయ సినిమాకి దక్కిన ఒక అరుదైన గౌరవంగా భావిస్తున్నా. ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన యానిమేషన్ వేదికపై ఈ సినిమాను ప్రదర్శించే అవకాశం రావడం మాకెంతో ఆనందంగా ఉంది. దీనికోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నాం అని రాజమౌళి పోస్ట్ పెట్టారు. యానిమేషన్ రంగంలో ఈ ఫెస్టివల్‌ను 'యానిమేషన్ ప్రపంచపు కేన్స్ ఫెస్టివల్'గా పరిగణిస్తారు. భారతీయ యానిమేషన్ సత్తాను ప్రపంచ వేదికపై చాటిచెప్పేందుకు ఇదొక గొప్ప అవకాశంగా సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. అమరేంద్ర బాహుబలి మరణం తర్వాత జరిగే పరిణామాల నేపథ్యంలో దీన్ని రూపొందిస్తున్నారు. దాదాపు రూ.120 కోట్ల భారీ బడ్జెట్‌తో 'ఆర్కా మీడియా వర్క్స్' ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది.




# సర్ మరో అవకాశం ఇవ్వండి

**బుచ్చిబాబు పోస్ట్.. వైరల్**



ప్రస్తుతం అగ్ర కథానాయకుడు రామ్ చరణ్ పెద్దితో బిజీగా ఉన్నారు. బుచ్చిబాబు దర్శకత్వంలో రానున్న ఈ సినిమా ఏప్రిల్ 30న విడుదల కానుంది. వీరిద్దరి మధ్య ఉన్న సాన్నిహిత్యం ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. తాజాగా రామ్‌చరణ్ 'ఎస్క్వైర్ ఇండియా'కు ఇంటర్వ్యూ ఇచ్చిన విషయం తెలిసిందే. దీనికి సంబంధించిన వీడియోను ఆయన ఇన్‌స్టాలో పోస్ట్ చేశారు. ఈ ఫోటోల్లో చరణ్ స్టైలిష్ లుక్‌కు అభిమానులు ఫిదా అవుతున్నారు. దీనికి దర్శకుడు బుచ్చిబాబు చేసిన కామెంట్ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. 'సర్.. మరో అవకాశం ఇవ్వండి' అని సరదాగా కామెంట్ చేశారు. ఈ చిన్న కామెంట్ ఇప్పుడు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది. దీంతో 'పెద్ది' తర్వాత వీరిద్దరి కాంబినేషన్‌లో మరో సినిమా రానుందని వార్తలు మొదలయ్యాయి. గ్యాంగ్‌స్టర్ సినిమా తీయమంటూ అభిమానులు కూడా రిప్లైలు పెడుతున్నారు. ప్రస్తుతం ఈ ఇద్దరూ పెద్దిపై పూర్తి ఫోకస్ పెట్టారు. ఇప్పటివరకూ విడుదలైన ఈ సినిమాలోని పాటలు ఆదరణను సొంతం చేసుకోవడంతో దీనిపై అంచనాలు నెలకొన్నాయి.

# అర్ధరాత్రి ఫోన్ చేసి..

**కయాదు లోహర్**

తన అందం, నటనతో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న కాయాదు లోహర్ తాజాగా ఓ ప్రైవేట్ ఆల్బమ్‌తో మరోసారి వార్తల్లో నిలిచింది. వరుస సినిమాలతో బిజీగా ఉన్న ఆమె 'పళవ మల్లి' అనే పాటలో నృత్యంతో ఆకట్టుకుంది. 'డ్యూడ్' చిత్రంతో సంగీత దర్శకుడిగా గుర్తింపు పొందిన సాయి అభ్యంకర్ ఈ పాటకు స్వరాలు అందించారు. తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ పాటలో అవకాశం ఎలా వచ్చిందో కాయాదు లోహర్ వివరించింది. ఒక రోజు అర్ధరాత్రి సమయంలో సాయి అభ్యంకర్ ఫోన్ చేసి పాట గురించి వివరించారని తెలిపింది. ఆ సమయంలో కాల్ రావడంతో ఆశ్చర్యపోయానని, అనంతరం ఆయన పాట వినిపించగా బాగా నచ్చడంతో వెంటనే అంగీకరించినట్లు చెప్పింది. పాటకు ఒప్పుకోవడం సులభంగా అనిపించినప్పటికీ, దాని కోసం చాలా శ్రమించాల్సి వచ్చిందని వెల్లడించింది. ఒకవైపు రిహార్సల్స్ నిర్వహిస్తూ, మరోవైపు సినిమా షూటింగ్‌లను సమన్వయం చేయాల్సి వచ్చిందని తెలిపింది. కొన్ని సందర్భాల్లో రాత్రి 2 గంటల వరకు చిత్రీకరణ జరిగినట్లు పేర్కొంది. ఈ పాట అద్భుతంగా రావడానికి మొత్తం బృందం కష్టపడిందని, ఆ కృషికి ఫలితంగా ఇప్పుడు ఈ పాటకు మిలియన్లలో వ్యూస్ లభిస్తున్నాయని కాయాదు లోహర్ వివరించింది.



# నన్ను నమ్మి.. నడిపించిన నా దేవత

**భార్య రహస్య గోరఖ్‌పై కిరణ్ ప్రశంసలు**



యువ హీరో కిరణ్ అబ్బవరం ఇప్పుడు నిర్మాతగా కొత్త అవతారంలో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. కేఏ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై ఆయన సమర్పణలో రూపొందిన 'తిమ్మరాజుపల్లి టీవీ' చిత్రం ఏప్రిల్ 17న ప్రపంచవ్యాప్తంగా విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సినిమా ద్వారా కొత్త టాలెంట్‌ను ప్రోత్సహించాలనే లక్ష్యంతో సుమారు 25 మందికి పైగా కొత్త నటీనటులను, దర్శకుడు వి. మునిరాజ్‌ని పరిశ్రమకు పరిచయం చేస్తున్నారు. విభిన్నమైన కథాంశంతో రూపొందిన ఈ చిత్రం ఇప్పటికే ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఇటీవల జరిగిన ప్రీ-రిలీజ్ ఈవెంట్ ఎంతో భావోద్వేగభరితంగా సాగింది. ఈ సందర్భంగా కిరణ్ అబ్బవరం చేసిన ప్రసంగం అందరినీ కదిలించింది. 'ఈ సినిమా కేవలం ఒక ప్రాజెక్ట్ కాదు.. పల్లెల నుంచి పెద్ద కలలతో వచ్చిన సుమారు 50 మంది టెక్నీషియన్లు, నటీనటుల జీవిత స్వప్నం' అని ఆయన తెలిపారు. తన కెరీర్‌లో ఇప్పటివరకు ఎవరినీ సహాయం కోరలేదని చెప్పిన కిరణ్, ఈసారి మాత్రం కొత్తవారి కష్టానికి గుర్తింపు రావాలనే ఉద్దేశంతో పరిశ్రమ పెద్దలు, విమర్శకులు ఈ సినిమాను ఆదరించాలని కోరారు. ఈ వేడుకలో ఆయన తన భార్య, నటి రహస్య గోరఖ్ గురించి చేసిన వ్యాఖ్యలు ప్రత్యేకంగా నిలిచాయి. తాను హీరో కాకముందు ఎదుర్కొన్న కష్టాలను గుర్తు చేసుకుంటూ, ఆ సమయంలో రహస్య తనకు అండగా నిలిచిందని చెప్పారు. అవకాశాల కోసం తిరిగిన రోజుల్లో కూడా ఆమె నన్ను నమ్మింది. తినడానికి కూడా కష్టమైన సమయంలో ఇంటి నుండి భోజనం తీసుకువచ్చి నన్ను ఆదుకుంది. నేను హీరో అవుతానని విశ్వసించి నా చేయి పట్టుకుంది అంటూ భావోద్వేగానికి లోనయ్యారు. చిన్న సినిమా అయినప్పటికీ టెక్నికల్ పరంగా ఎక్కడా రాజీ పడలేదని ఆయన స్పష్టం చేశారు. ఈ చిత్ర బృందం కష్టానికి గుర్తింపుగా, వారి కుటుంబ సభ్యుల కోసం భారతదేశంలోనే అతిపెద్ద స్క్రీన్‌పై స్పెషల్ ప్రీమియర్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించడం విశేషం.

# విష్ణుప్రియకు కలిసి వచ్చిన నెగెటివ్ ఫీడ్‌బ్యాక్

సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ విష్ణుప్రియ చుట్టూ ఇటీవల ఏర్పడిన వివాదాలు, కేసులు ఆమెకు ఆర్థికంగా లాభం చేకూర్చినట్లు కనిపిస్తున్నాయి. సాధారణంగా వివాదాలు కెరీర్‌పై ప్రభావం చూపుతాయని భావిస్తారు. అయితే విష్ణుప్రియ విషయంలో మాత్రం పరిస్థితి భిన్నంగా మారినట్లు చర్చ జరుగుతోంది. వివాదాలకు ముందు ఆమెకు సుమారు 1,892 మంది పెయిడ్ సబ్‌స్క్రైబర్లు ఉండగా, ఒక్కో సబ్‌స్క్రిప్షన్ ధర రూ.380గా లెక్కిస్తే నెలకు దాదాపు రూ.7 లక్షల వరకు ఆదాయం వచ్చినట్లు తెలుస్తోంది. అప్పట్లో ఆమె ఫాలోయింగ్ పరిమితంగానే ఉండేది. అయితే కేసులు నమోదైన తర్వాత సోషల్ మీడియాలో ఆమెపై విస్తృత చర్చ జరగడంతో, ఆమె కంటెంట్ చూడాలనే ఆసక్తి నెటిజన్లలో పెరిగింది. దీంతో పెయిడ్ సబ్‌స్క్రైబర్ల సంఖ్య 1,892 నుంచి 4,832కు పెరిగినట్లు సమాచారం. సబ్‌స్క్రైబర్ల సంఖ్య పెరగడంతో ఆదాయం కూడా గణనీయంగా పెరిగినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆమె నెలకు రూ.18 లక్షలకుపైగా సంపాదిస్తున్నట్లు అంచనా వేస్తున్నారు. నెగెటివ్ ప్రచారం కూడా కొన్నిసార్లు ఆర్థిక లాభాలకు దోహదపడుతుందని నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు.



Printed, Published and Owned by **SHAIK FAREED,** and Printed at Sunday Printing Press, 3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006. and Published from 6-1-303, SIDDIPET, TELANGANA - 505528, Telangana State. Editor: **SHAIK FAREED.** RNI NO : **TGTEL/25/A1737** Email: netisakshinews@gmail.com. Phone No: 9119949944, 9666052221

## కూలీలకు ఆసరా ఉపాధి హామీ..

**గునుకుల కొండాపూర్‌లో పనులు ప్రారంభం**



**నేటి సాక్షి గన్నేరువరం(బుర్ర అంజయ్య గౌడ్):** గన్నేరువరం మండలంలోని గునుకుల కొండాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను గన్నేరువరం ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి స్థానిక సర్పంచ్ సొల్లు అజయ్ వర్మ తో కలిసి పటేల్ చెరువులోకి వచ్చే పీటర్ ఛానల్ కాల్వ పనులు ప్రారంభోత్సవం చేశారు గౌరవ సర్పంచ్ మాట్లాడుతూ నిరుపేదలకు ఉపాధి హామీ పథకం ఎంతగానో ఉపయోగపడుతుందని జాబ్ కార్డు కలిగిన ప్రతి కుటుంబం ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు ఈ లీడర్ కాలువకు పనికి 7 లక్షల రూపాయలు మంజూరు ఇప్పించడం జరిగిందని ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి తెలిపారు ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ సంపత్ ఫీల్డ్ అసిస్టెంట్ అనుమాండ్ల యాదగిరి పాలక మండల సభ్యులు యాదగిరి నాగవ హనుమండ్ల పద్మ బోట్ల శ్రీలత చుక్కల సంగీత చుక్కల లక్ష్మయ్య మేట్స్ ఉపాధి కూలీలు పాల్గొన్నారు

## నాణ్యమైన విత్తనాలే లక్ష్యం

**సీడ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్ రెడ్డి**



**గన్నేరువరం (నేటి సాక్షి - బుర్ర అంజయ్య గౌడ్):** మండలంలోని గుండ్లపల్లి రైతు వేదికలో తెలంగాణ సీడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో 2026 వానకాలం విత్తనాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సీడ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్ రెడ్డి మాట్లాడుతూ.. రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. తెలంగాణ సంస్థ ద్వారా మేలైన సన్న, దొడ్డు రకం విత్తనాలను వానకాలం సీజన్ కోసం సిద్ధం చేసినట్లు వివరించారు. అనంతరం డాక్టర్ రాజకుమార్ మాట్లాడుతూ.. మానవ ప్రాణాలకు అత్యంత ప్రమాదకరమైన 'పారా క్యాట్' గడ్డి మందును ప్రభుత్వం నిషేధించిందని, దీనికి విరుగుడు లేనందున డీలర్లు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏడిఏ శ్రీధర్, మండల వ్యవసాయ అధికారి కిరణ్మయి, ఏఈఓలు అనూష, సాయికుమార్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు పద్మ కొమురయ్య, చింతల ఉమ, కవిత, ప్రకాష్ జంగిటి, కటకం తిరుపతి, గోపాల్ రెడ్డి మరియు పెద్ద సంఖ్యలో రైతులు, డీలర్లు పాల్గొన్నారు.

## నిరసన కార్యక్రమం

**విజయవంతం చేయండి**



**నేటి సాక్షి,కరీంనగర్:** రాష్ట్ర TJAC పిలుపుమేరకు తేదీ 17.4.2026న ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం భోజన విరామ సమయంలో జిల్లా కలెక్టర్ భవన సముదాయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం నిర్వహించబడుతుంది. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, గెజిటెడ్ అధికారులు అందరూ పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయగలరు. ముఖ్యంగా పెన్షనర్లు పెద్ద ఎత్తున పాల్గొని మార్చి 2024 నుండి పదవి విరమైన పొందిన వారికి ఎలాంటి బకాయలు చెల్లించనందున ఈ నిరసన రాష్ట్ర ప్రభుత్వానికి చురక అంటించేలా ఉండాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం కరీంనగర్ జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మహమ్మద్ ఉస్మాన్ పాషా, జాలి మహేందర్ రెడ్డిలు ఒక ప్రకటనలో కోరారు

## నేడు రైతు వేదికలో 'ప్రజా పాలన'

**ప్రగతి ప్రణాళిక సమావేశం**

**నేటి సాక్షి,గన్నేరువరం(బుర్ర అంజయ్య గౌడ్):** గన్నేరువరం మండల కేంద్రంలోని రైతు వేదికలో గురువారం ఉదయం 11 గంటలకు 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' 99 రోజుల యాక్షన్ ప్లాన్ పై మండల స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ సమావేశంలో మండలంలోని గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం మరియు ప్రభుత్వం నిర్దేశించిన 99 రోజుల ప్రణాళిక అమలుపై సుదీర్ఘంగా చర్చించనున్నారు. ఈ కార్యక్రమానికి మండలంలోని సర్పంచులు, అన్ని శాఖల మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు మరియు ప్రజాప్రతినిధులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన కోరారు. నిర్ణీత సమయానికి హాజరై ఈ ప్రగతి ప్రణాళిక సమావేశాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో విజ్ఞప్తి చేశారు.

# కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ



**నేటి సాక్షి కొమరంభీం ఆసిఫాబాద్(ఎండి ముబీన్ ):**నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీమతి కోవ లక్ష్మి గారు నియోజకవర్గ పరిధిలో విస్తృతంగా పర్యటిస్తూ లబ్ధిదారులకు సంక్షేమ పథకాల ప్రయోజనాలను అందజేశారు. ఈ సందర్భంగా కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద అర్హులైన వారికి చెక్కులను పంపిణీ చేశారు. ఆసిఫాబాద్ మండలం ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మొత్తం 132 మంది లబ్ధిదారులకు, అలాగే రెబ్బన మండలం తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో 99 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే గారు స్వయంగా చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోవ లక్ష్మి గారు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేద కుటుంబాలకు ఆర్థిక భరోసాను కల్పిస్తూ, వారి జీవితాల్లో సంతోషాన్ని తీసుకువస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ మరియు రెబ్బన మండలాలకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు మరియు స్థానికులు పాల్గొన్నారు.

# దళిత రత్న అవార్డు గ్రహీతకు సన్మానం

**నేటిసాక్షి, నల్లబెల్లి:** మండల కేంద్రంలోని స్థానిక శాఖ గ్రంథాలయం ఆవరణలో తెలంగాణ దళిత విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో దళిత రత్న అవార్డు గ్రహీత పరికి రత్నంను దళిత ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డిటిఎఫ్ మండల అధ్యక్షులు కందుల గోవర్ధన్ మాట్లాడుతూ... భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర మహనీయుల ఉత్సవ కమిటీ వైస్ చైర్మన్ కనకరాజు ఇటుక రాజ్ కుమార్ చేతుల మీదుగా పరికి రత్నం దళిత రత్న అవార్డును స్వీకరించారని తెలిపారు. ఈ సందర్భంగా నల్లబెల్లిలో ఘనంగా సన్మానించడం ఆనందకరమని పేర్కొన్నారు. ఇక పరికి రత్నం గారి సేవలను కొనియాడుతూ, గత 30 సంవత్సరాలుగా బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం సామాజిక ఉద్యమాలలో చురుకుగా పాల్గొంటూ అనేక మందికి చేయూతనిస్తున్నారని అన్నారు. సమాజ సేవ పట్ల అచంచల సంకల్పంతో పేదవారికి సహాయం చేస్తూ, సామాజిక చైతన్యాన్ని పెంపొందించడంలో కీలక



పాత్ర పోషిస్తున్నారని ప్రశంసించారు. ఇలాంటి సేవలను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం దళిత రత్న అవార్డును ప్రదానం చేయడం అభినందనీయమని, భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో మరిన్ని అవార్డులు అందుకుని మండలానికి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఉన్నత విద్యలు అభ్యసించిన సామాజిక సేవకులు సమాజానికి మరింత సేవ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ దళిత విద్యావంతుల వేదిక జిల్లా కార్యదర్శి బట్టు సాంబయ్య, వీహెచ్పీఎస్ మండల అధ్యక్షులు పులి రమేష్ గౌడ్, ముచ్చింపుల ఉపసర్పంచ్ బొట్ల దయాకర్, మాదిగ రాజశేఖర్, నల్లబెల్లి జిపిఓ సిహెచ్ ఆరోగ్యం తదితరులు పాల్గొన్నారు.

# మొక్కజొన్న కొనుగోళ్లు నిలిపివేతపై రైతుల రాస్తారోకో



**నేటిసాక్షి,నల్లబెల్లి:** మొక్కజొన్న కొనుగోళ్లు అకస్మాత్తుగా నిలిపివేయడంతో నల్లబెల్లి మండలంలోని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ నల్లబెల్లి-శనిగరం క్రాస్ వద్ద జాతీయ రహదారి పై పెద్ద ఎత్తున బుధవారం రాస్తారోకో నిర్వహించారు. కొనుగోళ్లు వెంటనే పునఃప్రారంభించి వేగవంతం చేయాలని రైతులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రం ప్రారంభంలో రైతులకు ఆశలు కలిగించినా ప్రస్తుతం ఆ ఆశలు ఆవేదనగా మారాయని రైతులు తెలిపారు. ప్రభుత్వం కనీస మద్దతు ధరను రూ.2400గా ప్రకటించినప్పటికీ, ఆ ధరకు పంటను అమ్ముకునే పరిస్థితి లేకపోవడం తీవ్ర ఆందోళన కలిగిస్తోందన్నారు. కేంద్రం ప్రారంభమై పదిహేను రోజులు గడిచినా కేవలం రెండు లారీల పంట మాత్రమే కొనుగోలు చేయగా, మరికొన్ని లారీల మొక్కజొన్న కేంద్రం వద్దే పేరుకుపోయిందని రైతులు పేర్కొన్నారు. అధికారులు సమయానికి రాకపోవడంతో ఎండలో గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. త్రాగునీరు, నీడ వంటి కనీస సౌకర్యాలు కూడా లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, ఎండ తీవ్రతతో పాటు అకాల వర్షాల ముప్పు పంట నాణ్యతపై ప్రభావం చూపే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రారంభంలో ఇచ్చిన హామీలు అమలు కాలేదని, ప్రభుత్వంపై నమ్మకం ఉంచి ఇబ్బందులు పడుతున్నామని రైతులు వాపోయారు. రోజురోజుకు సమస్య తీవ్రత పెరుగుతోందని తెలిపారు. రాస్తారోకో కారణంగా హైవేపై వాహనాలు భారీగా నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని రైతులతో చర్చలు జరిపి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో రైతులు నిరసన విరమించారు.

# గజ్వేల్‌లో రైతులకు అవగాహన శిబిరం





**నేటి సాక్షి గజ్వేల్:** రైతుల ఆర్థికాభివృద్ధి, వ్యవసాయంలో అధిక దిగుబడి సాధన లక్ష్యంగా గజ్వేల్ పట్టణంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో షణ్ముఖ అగ్రిటెక్ సంస్థ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో షణ్ముఖ అగ్రిటెక్ లిమిటెడ్ ప్రతినిధులు, వ్యవసాయ రంగ నిపుణులు పాల్గొని శాస్త్రీయ మట్టి పరీక్షలు, ఎరువుల సరైన వినియోగం, ఆధునిక సాగు పద్ధతులు, తెగుళ్ల నివారణ, ప్రభుత్వ పథకాలపై రైతులకు సమగ్ర అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నిపుణులు మాట్లాడుతూ, పంటలు సాగు చేయకముందే తప్పనిసరిగా నేల పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. భూమిలోని పోషకాల స్థాయిని తెలుసుకుని అవసరమైన మేరకే ఎరువులు వినియోగిస్తే ఖర్చులు తగ్గి దిగుబడి పెరుగుతుందని తెలిపారు. అధికంగా యూరియా వాడటం వల్ల నేల సారత తగ్గే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అలాగే రైతులు నాణ్యమైన విత్తనాలు ఎంపిక చేసుకుని, విత్తే

- **మట్టి పరీక్షలు, ఆర్థిక అభివృద్ధి, ప్రభుత్వ పథకాలపై షణ్ముఖ అగ్రిటెక్ ప్రతినిధుల మార్గదర్శనం**
- **పెద్ద సంఖ్యలో హాజరైన వివిధ గ్రామాల రైతులు**

ముందు విత్తన శుద్ధి (సీడ్ ట్రీట్మెంట్) చేయాలని సూచించారు. తెగుళ్ల నివారణలో రసాయన మందుల వినియోగాన్ని తగ్గించి సమగ్ర సస్యరక్షణ పద్ధతులు (ఐపీఎం) పాటించడం ద్వారా పంట నష్టం తగ్గుతుందని వివరించారు. నీటి సమస్య దృష్ట్యా రైతులు డ్రిప్, స్ప్రింక్లర్ వంటి నీటి పొదుపు పద్ధతులు వినియోగించాలని, పంట మార్పిడి విధానం పాటిస్తే భూమి సారత పెరుగుతుందని తెలిపారు. ఈ శిబిరంలో ప్రభుత్వం అమలు చేస్తున్న పంట బీమా, సబ్సిడీ పథకాలు, వ్యవసాయ యంత్రాలపై రాయితీలు, రుణ సదుపాయాలు తదితర పథకాల వివరాలను నిపుణులు వివరించారు. పథకాల కోసం అవసరమైన పత్రాలు, దరఖాస్తు విధానం, అర్హతలపై రైతులకు స్పష్టమైన మార్గదర్శనం అందించారు.

లాభదాయక వ్యవసాయ పద్ధతులను అనుసరించి శాస్త్రీయ సాగు చేపడితే రైతులు ఆర్థికంగా ఎదగవచ్చని నిపుణులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో సీనియర్ వైస్ ప్రెసిడెంట్ బాబురావు, వైస్ ప్రెసిడెంట్ జెల్లాడి. బిక్షమయ్య, ఏజీఎం టి.రాజశేఖర్, మార్కెటింగ్ మేనేజర్ శశిధర్, రీజినల్ మేనేజర్ ఎండి.సలీం, ఏరియా సేల్స్ మేనేజర్ అశోక్, విజయకృష్ణ, ప్రశాంత్ హరి, శివసాగర్, శివ తేజ రెడ్డి, రామకృష్ణ, నర్సింలు, చంద్రమౌళి లతోపాటు వివిధ గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు. ఈ శిబిరం రైతులకు ఎంతో ఉపయోగకరంగా నిలిచిందని పాల్గొన్న రైతులు హర్షం వ్యక్తం చేశారు.

# ఎంపీడీవో కార్యాలయంలో 'రహస్య' సమావేశం





**నేటి సాక్షి,నారాయణపేట (ఇమామ్ సాబ్):** నారాయణపేట జిల్లా మరికల్ మండల పరిధిలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మండల స్థాయి సమావేశం వివాదాస్పదంగా మారింది. ఇన్చార్జి ఎంపీడీవో ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంపై గోప్యత పాటించడంపై స్థానిక విలేకరులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలు గురించి చర్చించేందుకు ఏర్పాటు చేసిన ఈ సమావేశం గురించి పత్రికా విలేకరులకు ఎలాంటి సమాచారం ఇవ్వకపోవడం గమనార్హం. కేవలం ముక్కుబడిగా కార్యక్రమాలు నిర్వహించి చేతులు దులుపుకుంటున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి.

సర్పంచుల భర్తల హల్చల్..

ఈ సమావేశంలో నిబంధనలకు విరుద్ధంగా మహిళా సర్పంచుల ప్రతినిధులుగా వారి భర్తలు హాజరుకావడం చర్చనీయాంశమైంది. గ్రామాల్లో పాలన సాగించాల్సిన సర్పంచుల బదులు, వారి భర్తలు అధికారిక సమావేశాల్లో పాల్గొనడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రజలకు ప్రభుత్వ పథకాల సమాచారం చేరవేయాల్సిన బాధ్యత ఉన్న అధికారులు, సమాచారాన్ని గోప్యంగా ఉంచితే సంక్షేమం ఎలా అందుతుందని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

రెగ్యులర్ ఎంపీడీవోను నియమించాలి..

ఇన్చార్జి ఎంపీడీవో వైఖరిపై మండల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పనిభారం నెపంతో సమాచారం ఇవ్వలేకపోతున్నానని ఇన్చార్జి ఎంపీడీవో సమర్థించుకోవడంపై విస్మయం వ్యక్తం అవుతోంది. ఇకనైనా ప్రభుత్వం స్పందించి మరికల్ మండలానికి రెగ్యులర్ ఎంపీడీవోను నియమించి, పారదర్శక పాలన అందించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో పలు గ్రామాల కార్యదర్శులు, ఉపసర్పంచ్లు పాల్గొన్నారు.

# నేడు నా నీడనే మరచిపోయూరా

## పూర్వ విద్యార్థులకు పాత పాఠశాల ఆవేదన

- ఆరు దశాబ్దాల అక్షరాల బాట.. నేడు శిథిలావస్థలో కన్నీటి మూట
- కొత్త భవనం వెలుగులో.. చీకటిలో మిగిలిపోయిన సరస్వతీ నిలయం
- జాతరకు వచ్చే బిడ్డలారా.. ఒక్కసారి నన్ను చూడరా అంటూ విన్నపం
- నరసింహుల గూడెం హైస్కూల్ పునర్నిర్మాణానికి కదిలి రావాలని మొర



**నేటి సాక్షి,మునగాల(పాముల రాఘవేందర్):** మునగాల పరగణంలోని నరసింహుల గూడెం గ్రామ సమీపంలో గల హైస్కూల్ సుమారు ఆరు దశాబ్దాల కాలం నుంచి వేలాది మందికి విద్యాబుద్ధులు నేర్పింది. కానీ నేడు ఆ పాఠశాల కన్నీటి పర్యంతమవుతూ తన పూర్వ విద్యార్థులను వేడుకుంటోంది. "నా బిడ్డల్లారా.. మీకు చదువుతో పాటు నీడనిచ్చాను, ఆకలి వేస్తే సీతాఫలాలను ఇచ్చాను, ఆడుకోవడానికి నా హృదయాన్ని ఇచ్చాను.. కానీ నేడు నేను కష్టాల్లో ఉంటే ఎటు వెళ్ళిపోయారు?" అంటూ ఆ పాఠశాల గోడలు మూగగా రోదిస్తున్నాయి. కొత్త భవనం రావడంతో పాత పాఠశాలను పట్టించుకునే నాథుడే కరువయ్యారని, శిథిలమవుతున్న తన ఉనికిని కాపాడాలని వేడుకుంటోంది. రేపాల, నరసింహుల గూడెం, సీతానాగారం, తండా, విజయరాఘవపురం, కేశాపురం, జగన్నాథపురం, కరివీరాల, కలుకోవ, మాధవరం వంటి పది గ్రామాల విద్యార్థులు ఇక్కడ చదువుకుని నేడు ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారు. వారంతా ప్రతి ఏటా శ్రీ లక్ష్మీనరసింహ స్వామి జాతరకు వస్తున్నా, పక్కనే ఉన్న తమ పాఠశాల దుస్థితిని గమనించకపోవడం బాధాకరమని కథనం ఆవేదన వ్యక్తం చేస్తోంది. పైకప్పు లేక, గోడలు కుళ్లిపోతూ శిథిలావస్థకు చేరిన ఈ విద్యా మందిరాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత పూర్వ విద్యార్థులపైనే ఉందని గుర్తు చేస్తోంది. "మీరు ఎదిగారు.. కానీ నన్ను ఒంటరిని చేశారు. నా గోడలు పూర్తిగా కూలిపోయేలోపే రండి.. చెయ్యి చెయ్యి కలిపి నాకు పునర్జన్మ ప్రసాదించండి" అంటూ ఆ పాఠశాల చేస్తున్న ఈ ఆర్తనాదం ప్రతి పూర్వ విద్యార్థి మనసును కదిలించాల్సిన అవసరం ఉంది. మరి ఇప్పటికైనా పాత విద్యార్థులు స్పందించి, తమకు ఓనమాలు నేర్పిన ఈ సరస్వతీ నిలయానికి పూర్వ వైభవం తీసుకువస్తారో లేదో వేచి చూడాలి.



# కమ్మెట గ్రామంలో డంపింగ్ యార్డ్ వద్దు



- కలెక్టరేట్ ముందు గ్రామస్తుల భారీ ధర్నా!
- ప్రజావాణిలో కలెక్టర్ నారాయణ రెడ్డికి వినతి పత్రం అందజేసిన 200 మంది గ్రామస్తులు
- జీవో 111 పరిధిలో చెత్త వేస్తే గండిపేట చెరువు కలుషితం అవుతుందని ఆందోళన
- ప్రధాన రోడ్డు పక్కనే యార్డ్ ఏర్పాటుతో పల్లె ప్రకృతి వనం, క్రీడా ప్రాంగణం దెబ్బతింటుందని ఆగ్రహం
- నిర్ణయం రద్దు చేయకుంటే నిరాహార దీక్షకు సిద్ధమని సర్పంచ్ ముంద్రిక పద్మమ్మ హెచ్చరిక

**నేటి సాక్షి,చేవెళ్ల:** చేవెళ్ల మండలం కమ్మెట గ్రామ పరిధిలో డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు సమరశంఖం పూరించారు. సోమవారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో సర్పంచ్ ముంద్రిక పద్మమ్మ కృష్ణ గౌడ్ ఆధ్వర్యంలో సుమారు 200 మంది గ్రామస్తులు కలెక్టర్ నారాయణ రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. మున్సిపాలిటీకి సంబంధం లేని తమ గ్రామంలో చెత్తను డంపింగ్ చేయడం అన్యాయమని, ఇది ప్రజారోగ్యంతో ఆడుకోవడమేనని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కమ్మెట గ్రామం జీవో 111 పరిధిలోకి వస్తుందని, ఇక్కడ డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయడం వల్ల భూగర్భ జలాలతో పాటు గాలి కలుషితం అవుతుందని గ్రామస్తులు పేర్కొన్నారు. చెత్త నుంచి వచ్చే మురుగు నీరు మూసీ కాలువ ద్వారా గండిపేట చెరువులోకి చేరితే, తాగునీరు విషతుల్యమవుతుందని హెచ్చరించారు. అంతేకాకుండా, ప్రతిపాదిత స్థలం ప్రధాన రోడ్డు పక్కనే ఉండడం వల్ల ప్రయాణికులకు దుర్వాసన తప్పదని, ఇప్పటికే అభివృద్ధి చేసిన పల్లె ప్రకృతి వనం, క్రీడా ప్రాంగణాలు ఈ చెత్త కుప్పల వల్ల నాశనమవుతాయని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ పోరాటంలో అన్ని పార్టీల నాయకులు, గ్రామ పెద్దలు విభేదాలు పక్కన పెట్టి ఏకతాటిపైకి వచ్చారు. ఎమ్మెల్యే గాలే యాదయ్య, ఆర్డీవో, తాసిల్దార్లకు కూడా ఇప్పటికే విన్నవించామని, అధికారులు స్పందించకుంటే ఊరుకునే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు. సర్పంచ్ పద్మమ్మ మాట్లాడుతూ.. గ్రామస్తుల అభిప్రాయాలను తీసుకోకుండా మొండిగా ముందుకెళ్తే నిరాహార దీక్షలకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ విష్ణు గౌడ్, మాజీ సర్పంచులు పెంటయ్య, హనుమంత్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ జంగయ్య, గ్రామ పెద్దలు బుడ్డా అంతయ్య, సురేందర్ గౌడ్, బండ పెంటయ్య, బుచ్చిరెడ్డి, వార్డు సభ్యులు మరియు యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




# స్టేట్ ర్యాంకులతో గజ్వేల్ గురుకుల విద్యార్థినుల రికార్డు



**నేటి సాక్షి,గజ్వేల్ :** ఇంటర్మీడియట్ ఫలితాల్లో గజ్వేల్ మైనార్టీ గురుకుల బాలికల కళాశాల విద్యార్థినులు అద్భుత ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయిలో ర్యాంకులను కైవసం చేసుకున్నారు. ద్వితీయ సంవత్సరంలో కె. కావ్య 991/1000 మార్కులతో రాష్ట్రస్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించి రికార్డు సృష్టించింది. అలాగే రుహీన (989), హదియా బేగం (983), అఫ్రీన్ బేగం (983), తస్లీమ (980) వంటి విద్యార్థినులు టాప్ మార్కులతో మెరిశారు. మొత్తం 18 మంది విద్యార్థినులు 900 పైగా మార్కులు సాధించడం విశేషం. ఇంటర్ ప్రథమ సంవత్సర ఫలితాల్లో శిరీన్ 436/440 మార్కులతో రాష్ట్ర స్థాయిలో మూడవ ర్యాంకును సొంతం చేసుకుంది. అస్మా (430), బుశ్రా బేగం (427) కూడా ఉత్తమ మార్కులు సాధించారు. ఈ సందర్భంగా అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినులను ప్రిన్సిపల్ సుధారాణి, మహమ్మద్ జాఫర్ ఖాన్ మరియు అధ్యాపక బృందం శాలువాలు, మెమెంటోలతో ఘనంగా సన్మానించారు. విద్యార్థినుల కృషితో కళాశాల ప్రతిష్ట రాష్ట్ర స్థాయిలో పెరిగిందని ఈ సందర్భంగా ప్రిన్సిపల్ హర్షం వ్యక్తం చేశారు.

# రోడ్డు భద్రతపై మానవహారం

## మరిగల్ సీఐ భగవంత్ రెడ్డి....



**నేటి సాక్షి నారాయణపేట,(ఇమామ్ సాబ్ ):** నారాయణపేట జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఆదేశాల మేరకు మరికల్ మండల కేంద్రంలో మరికల్ సిఐ భగవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో బుధవారం రోడ్డు భద్రతపై విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో కలిసి రోడ్డు భద్రతపై మానవహారం ఏర్పాటు చేసి ప్రజల్లో అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులు తమ తల్లిదండ్రులు రోడ్డు భద్రతా నియమాలు పాటించాల్సిన అవసరాన్ని వివరించారు. ఈ సందర్భంగా సిఐ భగవంత్ రెడ్డి, మరికల్ ఎస్సై 2 మహేశ్వరి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణలో ప్రజల అవగాహన ఎంతో కీలకమని, ముఖ్యంగా యువత మరియు విద్యార్థులు ముందుకు వచ్చి సమాజంలో మార్పు తీసుకురావాలని తెలిపారు. ట్రాఫిక్ నియమాలు పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, హెల్మెట్ ధరించడం, సీట్ బెల్ట్ వినియోగం, మితిమీరిన వేగం వద్దు, మద్యం తాగి వాహనం నడపకూడదని స్పష్టం చేశారు. విద్యార్థులు తమ కుటుంబ సభ్యులకు, పరిసరాల వారికి రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తే ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని చెప్పారు. రక్తపు చారలు లేని రోడ్లే మన లక్ష్యం – రోడ్డు భద్రత మనందరి బాధ్యత అని తెలిపారు. చిన్న నిర్లక్ష్యం కూడా ప్రాణాంతక ప్రమాదాలకు దారితీస్తుందని, కాబట్టి ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, ప్రజలు పోలీసులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ కేంద్రంలో సీమంతం



**నేటి సాక్షి, చిలుకూరు:** హుజూర్నగర్ ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని చిలుకూరు సెక్టార్ అంగన్వాడి కేంద్రం 4 నందు పోషణ పక్షంలో భాగంగా సామూహిక సీమంత కార్యక్రమము ను నిర్వహించారు ఈ కార్యక్రమమునకు ముఖ్యఅతిథిగా చిలుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ సుభాష్ పాల్గొని గర్భిణీ స్త్రీలకు ఐదు సంవత్సరముల లోపు బాల బాలికలకు పోషక ఆహార అలవాట్లపై అవగాహన కల్పించారు. తల్లిపాల ప్రాముఖ్యతను తెలియజేశారు. బిడ్డ యొక్క వెయ్యి రోజుల బ్రెయిన్ డెవలప్మెంట్ దశలవారీ విషయాలను విశదీకరించారు. అనంతరము సీమంత కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి సూపర్వైజర్ సునీత. టీచర్ సిరికొండ కవిత. వార్డు మెంబర్లు మహిళలు తల్లులు పాల్గొన్నారు

# నేడు మండల స్థాయి గ్రామసభ




**నేటి సాక్షి :** సూర్యాపేట జిల్లా చిలుకూరు మండల కేంద్రంలో గురువారం మండల స్థాయి గ్రామసభను నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ముక్కపాటి నరసింహారావు తెలిపారు. 99 రోజుల ప్రజా ప్రణాళికలో భాగంగా ఏర్పాటు చేస్తున్న ఈ సమావేశానికి సంబంధించిన వివరాలను బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన వెల్లడించారు. ఈ గ్రామసభలో మండలంలోని పలు అభివృద్ధి పనులు, స్థానిక సమస్యలపై సమగ్రంగా చర్చించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. మండల స్థాయి అధికారులు, సర్పంచ్లు, పంచాయతీ కార్యదర్శులు అందరూ సకాలంలో హాజరై ఈ సమావేశాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో కోరారు. ప్రజల సమస్యల పరిష్కారం, ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి లక్ష్యంగా ఈ సభ సాగుతుందని ఆయన వివరించారు.

# ఉచిత కంటి వైద్య శిబిరం



**నేటి సాక్షి, చిలుకూరు:** సూర్యాపేట జిల్లా చిలుకూరు మండల కేంద్రంలో స్వర్ణ భారతి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ ఐ కంటి వైద్యశాల సూర్యాపేట వారి సహకారంతో బుధవారం చిలుకూరు బాపూజీ గ్రంథాలయంలో ఉచిత నేత్ర చికిత్స శిబిరం ఏర్పాటు చేశారు ఈ వైద్య శిబిరం ను సర్పంచ్ కొలు పులమ్మ నాగయ్య ప్రారంభించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాలు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించి వైద్య పరీక్షలు నిర్వహించి అద్దాలు పంపిణీ చేయడం అర్హనీయం అన్నారు వైద్య పరీక్షల్లో ఆపరేషన్ అవసరం ఉన్నవారికి ఉచిత ఆపరేషన్లు చేయనున్నట్లుగా నిర్వాహకులు తెలిపారు ఈ కార్యక్రమంలో స్వర్ణ భారతి ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చారుగండ్ల ప్రవీణ్ రాజశేఖర్ నిర్వాహకులు ఓరుగంటి కిట్టు డాక్టర్లు వైద్య సిబ్బంది గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# నిధులు దుర్వినియోగం చేస్తే చర్యలు తప్పవు



**నేటి సాక్షి,చిలుకూరు :** సూర్యాపేట జిల్లా చిలుకూరు మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి (డీఎల్‌పీఓ) లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం నుంచి మంజూరైన అభివృద్ధి నిధులను నిబంధనల ప్రకారమే ఖర్చు చేయాలని స్పష్టం చేశారు. సర్పంచ్‌లు ప్రతి పనికి తప్పనిసరిగా గ్రామ పంచాయతీ తీర్మానం ఉండాలని, తీర్మానం లేకుండా ఎలాంటి పనులు చేపట్టవద్దని సూచించారు. ప్రతి అభివృద్ధి పనిని సంబంధిత పోర్టల్‌లో నమోదు చేయాలని, పారదర్శకత పాటించాలని ఆయన ఆదేశించారు. నిబంధనలు అతిక్రమించి నిధుల దుర్వినియోగానికి పాల్పడే సర్పంచ్‌లు, అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ప్రభుత్వ నిధులు ప్రజల సంక్షేమం కోసం వినియోగపడాలని, ఇందులో ఎలాంటి నిర్లక్ష్యం వహించకూడదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ముక్కపాటి నరసింహారావు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# ఐఐటి ఒలంపియాడ్‌లో విశ్వశాంతి విద్యానికేతన్ విద్యార్థుల విజయం



**నేటి సాక్షి,గజ్వేల్ :** రాష్ట్రస్థాయి గ్లోబల్ ఒలంపియాడ్ ఐఐటి పరీక్షలో అహ్మదీపూర్‌కు చెందిన విశ్వశాంతి విద్యానికేతన్ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి నాలుగు బహుమతులను కైవసం చేసుకున్నారు. హైదరాబాద్‌లోని భారతీయ విద్యాభవన్‌లో నిర్వహించిన బహుమతి ప్రదానోత్సవంలో విద్యార్థులు కె. రామ్ చరణ్, వై. ఆధ్యశ్రీ ప్రథమ బహుమతులు అందుకోగా, ఎస్. తేజస్వి, ఎస్. శ్రీరాజ్ ద్వితీయ బహుమతులు సాధించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన మాజీ సీఎస్ ఐ.వై.ఆర్. కృష్ణారావు, మాజీ డీజీపీ కె. అరవింద రావు, కిమ్స్ సన్ షైన్ హాస్పిటల్స్ ఎండీ డాక్టర్ ఏ.వి. గురువారెడ్డి తదితర ప్రముఖులు విద్యార్థులకు బహుమతులు అందజేసి అభినందించారు. రాష్ట్రస్థాయిలో తమ విద్యార్థులు సత్తా చాటడం పాఠశాలకు గర్వకారణమని కరస్పాండెంట్ కె. విశ్వనాథ్ పేర్కొన్నారు. ఉపాధ్యాయుల కృషి, తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే విద్యార్థులు ఈ స్థాయికి ఎదిగారని ఆయన కొనియాడారు. భవిష్యత్తులో విద్యార్థులు మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ విజయంతో పాఠశాల సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

# మోడల్ స్కూల్ ప్రవేశాలకు పరీక్ష

**నేటి సాక్షి, తిమ్మాపూర్:** తిమ్మాపూర్ మోడల్ స్కూల్ లో 6వ తరగతికి వంద (100) సీట్లు, 7వ తరగతి నుంచి 10వ తరగతిలో సీట్ల భర్తీకి ఆదివారం రోజున తిమ్మాపూర్ మోడల్ స్కూల్ లో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వనజ ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతికిగానూ ఉదయం 10-00 నుంచి మధ్యాహ్నం 12-00 గంటల వరకు, 7 నుంచి 10వ తరగతి వారికి మధ్యాహ్నం 2-00 నుంచి 4-00 వరకు నిర్వహించనున్నట్లు చెప్పారు. పరీక్షకు హాజరయ్యేవారు https...telanganams.cgg.gov.in. వెబ్సైట్ నుంచి హాల్ టికెట్ డౌన్లోడ్ చేసుకోవాలని సూచించారు. తిమ్మాపూర్ మోడల్ స్కూల్ లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఎగ్జామ్ ప్యాడ్, బ్లూ లేదా బ్లాక్ పెన్ తో మాత్రమే పరీక్ష రాయాలని ఆమె వివరించారు.

# మొక్కజొన్న కొనుగోళ్లలో జాప్యంతో రైతులకు నష్టం



- కథలాపూర్ కేంద్రాన్ని పరిశీలించిన బీజేపీ కిసాన్ మోర్చా నేతలు
- ఎంఎస్పీ ధరకు కొనుగోళ్లు జరగక రైతులకు భారీ నష్టం
- వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని డిమాండ్

**నేటి సాక్షి, కథలాపూర్ (రాధారపు నర్సయ్య):** మొక్కజొన్న కొనుగోళ్లలో రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని బీజేపీ కిసాన్ మోర్చా నాయకులు ఆరోపించారు. కథలాపూర్ మండల కేంద్రంలోని కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన వారు, ఆలస్యమైన కొనుగోళ్లు రైతులను దళారుల దయపైకి నెట్టేశాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ఎంఎస్పీ ధర అందక రైతులు తక్కువ ధరలకు పంటను విక్రయించాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు.

కేంద్రం ఏర్పాటు చేసినా కొనుగోళ్లు లేవు

బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఈరోజు కథలాపూర్ మండల కేంద్రంలోని మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. రైతులు ఎన్నో రోజులుగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి వేగవంతంగా కొనుగోళ్లు చేపట్టాలని కోరుతున్నప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం అరకొరగా కేంద్రాలను ఏర్పాటు చేసి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఇప్పటివరకు మండల కేంద్రంలో కేవలం రెండు లారీల మొక్కజొన్నలు మాత్రమే కొనుగోలు చేయడం పరిస్థితి తీవ్రతను సూచిస్తోందని తెలిపారు.

ఎంఎస్పీ లేక రైతుకు దెబ్బ

రైతులు అనేక కష్టాలతో మొక్కజొన్న పంటను పండిస్తే, ప్రభుత్వం సమయానికి కొనుగోళ్లు చేపట్టకపోవడం వల్ల వారు తీవ్ర నష్టాలు చవిచూస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన ఎంఎస్పీ ధర రూ.2400 ఉండగా, రైతులు దాదాపు రూ.1800కే పంటను విక్రయించాల్సి వచ్చింది. దీని వల్ల ఎకరానికి రూ.15,000 నుంచి రూ.20,000 వరకు నష్టం వాటిల్లిందని నాయకులు పేర్కొన్నారు. మార్క్ఫెడ్ ద్వారా మార్చి నెలలో కొనుగోళ్లు జరగాల్సి ఉండగా ఆలస్యం కావడంతో రైతులు దళారులకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు.

వెంటనే చర్యలు తీసుకోవాలి

ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం చైతన్యంతో వ్యవహరించి, వానాకాలంలో నవంబర్ నుంచి డిసెంబర్ వరకు, వేసవిలో మార్చి నుంచి మే వరకు మొక్కజొన్న కొనుగోళ్లు మార్క్ఫెడ్ ద్వారా సమయానికి చేపట్టాలని బీజేపీ కిసాన్ మోర్చా జగిత్యాల జిల్లా అధ్యక్షుడు కోడిపల్లి గోపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. రాబోయే రోజుల్లో వరి కొనుగోలు కేంద్రాలను కూడా వెంటనే ఏర్పాటు చేసి, ఎలాంటి కటింగులు లేకుండా కొనుగోళ్లు జరపాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఉద్యమానికి సిద్ధం

రాష్ట్ర ప్రభుత్వం రైతుల సమస్యలను పట్టించుకోకపోతే, రైతులతో కలిసి భారీ ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కథలాపూర్ మండల బీజేపీ అధ్యక్షుడు మల్యాల మారుతి, రాజన్న సిరిసిల్ల జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు రాచమడుగు వెంకటేశ్వరరావు, నాయకులు గాంధారి శ్రీనివాస్, ప్రసాద్, కాసోజు ప్రతాప్, మహేష్, తెడ్డుమహేష్, జీవన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సమతుల్య ఆహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



- పోషణ పక్వాడ కార్యక్రమంలో అవగాహన కార్యక్రమం
- గర్భిణీలు, బాలింతలు, కిశోర బాలికలకు సూచనలు
- అంగన్వాడి కేంద్రంలో ఆరోగ్య పర్యవేక్షణపై దృష్టి

**నేటి సాక్షి, కోరుట్ల (రాధారపు నర్సయ్య):** సమతుల్య ఆహారం తీసుకోవడం ద్వారా మాత్రమే ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని కోరుట్ల మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్, 26వ వార్డ్ కౌన్సిలర్ అన్నం లావణ్య అనిల్ పేర్కొన్నారు. మహిళలు, గర్భిణీలు, కిశోర బాలికలు, చిన్నారులు పోషకాహారంపై అవగాహన పెంపొందించుకోవడం అత్యంత అవసరమని ఆమె స్పష్టం చేశారు. 'పోషణ పక్వాడ' కార్యక్రమంలో భాగంగా బుధవారం కోరుట్ల పట్టణంలోని 26వ వార్డు వినోబా రోడ్ అంగన్వాడి కేంద్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నం లావణ్య అనిల్ మాట్లాడుతూ, సమతుల్య ఆహారం తీసుకోవడం ద్వారా భవిష్యత్తులో అనేక రకాల వ్యాధులను నివారించవచ్చని తెలిపారు. ముఖ్యంగా గర్భిణీలు, బాలింతలు మరియు కిశోర బాలికలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. సమాజంలో పోషకాహారం పట్ల అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని ఆమె వివరించారు. అంగన్వాడి కేంద్రాల్లో చిన్నారుల బరువును ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ రికార్డుల్లో నమోదు చేస్తున్నామని తెలిపారు. కిశోర బాలికలకు రక్తహీనత (అనీమియా) పరీక్షలు నిర్వహించి, తగిన జాగ్రత్తలు సూచిస్తున్నామని చెప్పారు. పిల్లల శారీరక, మానసిక అభివృద్ధికి పోషకాహారం కీలకమని, తల్లిదండ్రులు ఈ విషయాన్ని గుర్తుంచుకోవాలని సూచించారు. గర్భిణీలు, బాలింతలు మరియు కౌమార దశలోని బాలికలు ప్రభుత్వం అందించే పోషకాహార సప్లిమెంట్లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అంగన్వాడి కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలను పూర్తిగా వినియోగించుకుంటే ఆరోగ్య సమస్యలు దూరమవుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు వాణి, శారదలతో పాటు వార్డు మహిళలు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# చౌడేపల్లిలో కలెక్టర్ అకస్మిక పర్యటన







**నేటి సాక్షి, చౌడేపల్లి:** మండలంలో జిల్లా కలెక్టర్ అకస్మిక పర్యటన చేశారు. మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయం లో అధికారులతో సమీక్షా సమావేశం ఏర్పాటు చేసి, తమ శాఖల పనితీరుని అడిగి తెలుసుకున్నారు. అలాగే రెవిన్యూ శాఖలో ఎక్కువగా సమస్యలు ఉన్నాయని, వాటిని క్షేత్రస్థాయిలో సందర్శించి తగిన పరిష్కారం చూపాలని, తాహశిల్దార్ ను హెచ్చరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నిశాంత్ కుమార్ మాట్లాడుతూ జలధార ప్రాజెక్ట్ ప్లానింగ్ విషయమై క్షేత్రస్తాయిలో పరిశీలన చేశారు. జిల్లాలోనే చౌడేపల్లి మండలంలో ఎక్కువగా చెరువులు ఉన్నాయని, వాటికి ఫీడర్ చానళ్ళు సక్రమంగా ఉన్నాయా లేదా అని పరిశీలన చేశారు. ఫీడర్ చానల్ ను పరాశీలించి కాలువ గట్ల పై గల పిచ్చిమొక్కలను తొలగించాలని, వర్షాలు మొదలతే

- క్షేత్రస్థాయిలో చెరువులను సందర్శన

ఈ మొక్కలు, మట్టి తిరిగి కాలువలో చేరి వర్షపు నీరు ప్రవహించడం ఇబ్బందిగా ఉంటుందని అన్నారు. ప్రతి వర్షపు బొట్టును వడిసి పట్టుకొని, నీటి భద్రత కల్పించడమే ప్రధాన లక్ష్యం అని ఆయన అన్నారు. అలాగే మండలం లో గల ప్రధాన భూ సమస్యల పై వస్తున్న పిజిఆర్ఎస్ పిర్యాదులను ఏవిధంగా పరిశీలన చేసి, పరిష్కారం చూపుతున్నాని విచారణ చేశారు. రెండు మూడు సచివాలయాలలో సరిగా విచారణ చేయలేదని నిర్ధారణ అయ్యిందని అన్నారు. తర్వాత క్షేత్రస్తాయిలో దిగువపల్లి గ్రామపంచాయతీ లోగల శెట్టికుంటను సందర్శించారు. సదరు చెరువుకు గల సప్లై చానల్ ను సందర్శించారు. అనంతరం కాగతి గ్రామపంచాయతీ కాగతి చెరువును సందర్శించారు. భూసమస్యలను క్షేత్రస్థాయిలో పర్యటిఃచి పరిష్కారం చూపాలని, భూ సమస్య పై సుదర్శన్ రెడ్డి అనే రైతు దారి విషయమై కలెక్టర్ కు విన్నవించగా క్షేత్రస్థాయిలో పర్యటించి పరిష్కారం చూపుతామని తెలియజేశారు. ఈ కార్యక్రమఃలో మండల పరిషత్ అభివృద్ధి అధికారిణి లిలామాధవి, తాహాశిల్దార్ పార్వతి, ఇరిగెషన్ ఏఈ నాగరాజు, డిఈ ఆర్డబ్ల్యూఎస్ సురేష్, ఏఈ ఆర్డబ్ల్యూఎస్ చందన, డిప్యూటీ ఎంపిడిఓ గఫూర్, డిప్యూటీ తాహాశిల్దార్ దొరస్వామి, దిగువపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి పవన్ కుమార్, కాగతి విఆర్ఓ కాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

# కోరుట్ల మైనారిటీ గురుకులంలో అడ్మిషన్ల జోరు




- నాణ్యమైన విద్యకు కేరాఫ్ అడ్రస్‌గా గుర్తింపు!
- 100% ఉత్తీర్ణత, మెరుగైన వసతులతో విద్యార్థుల తల్లిదండ్రుల నమ్మకం
- పరిమిత సీట్లకు పెరిగిన పోటీ.. ఐదో తరగతి ప్రవేశాల కోసం క్యూ కడుతున్న జనం
- విద్యార్థుల్లో కమ్యూనికేషన్ స్కిల్స్, క్రీడలపై ప్రిన్సిపాల్ జె. రాములు ప్రత్యేక శ్రద్ధ
- ప్రభుత్వ ఉచిత సదుపాయాలతో మైనారిటీ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు భరోసా

**నేటి సాక్షి,కోరుట్ల(రాధారపు నర్సయ్య):** ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన కోరుట్ల మైనారిటీ గురుకుల పాఠశాల విద్యా ప్రమాణాల్లో దూసుకుపోతోంది. నాణ్యమైన బోధన, వంద శాతం ఫలితాలు మరియు సమగ్ర సదుపాయాలతో ఈ విద్యాసంస్థ మైనారిటీ విద్యార్థుల భవిష్యత్తుకు భరోసాగా నిలుస్తోంది. 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి ఐదవ తరగతి అడ్మిషన్ల కోసం ప్రస్తుతం భారీ స్థాయిలో క్రేజ్ పెరిగింది. పరిమితంగా ఉన్న సీట్ల కోసం మైనారిటీ విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద ఎత్తున దరఖాస్తు చేసుకుంటూ అడ్మిషన్ల కోసం పోటీ పడుతున్నారు. ఈ గురుకులంలో అందిస్తున్న వినూత్న బోధనా విధానం విద్యార్థులను మేటిగా తీర్చిదిద్దుతోంది. ఇటీవల బాధ్యతలు చేపట్టిన ప్రిన్సిపాల్ జె. రాములు అనుభవం, అంకితభావం పాఠశాల అభివృద్ధికి కొత్త దిశనిచ్చింది. ముఖ్యంగా విద్యార్థుల్లో వినడం, చదవడం, రాయడం మరియు మాట్లాడడం (LSRW) వంటి నైపుణ్యాలపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ప్రాథమిక గణిత సామర్థ్యాలను బలోపేతం చేయడంతో పాటు, విద్యార్థులు ఇంగ్లీషులో అనర్గళంగా మాట్లాడేలా శిక్షణ ఇస్తున్నారు. నాణ్యమైన ఉచిత విద్యతో పాటు పౌష్టికాహారం, హాస్టల్ వసతి, యూనిఫాం, షూస్ వంటి అన్ని సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తోంది. కేవలం చదువుకే పరిమితం కాకుండా, నిష్ణాతుడైన పీఈటీ ఆధ్వర్యంలో క్రీడలు నిర్వహిస్తూ విద్యార్థుల శారీరక, మానసిక వికాసానికి దోహదపడుతున్నారు. తమ పిల్లలు కమ్యూనికేషన్ స్కిల్స్‌లో రాణించడం చూసి తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మైనారిటీ వర్గాల విద్యార్థుల జీవితాల్లో ఈ గురుకులం నిజమైన మార్పు తీసుకువస్తోందని, అందుకే ప్రతి ఏటా ఇక్కడ అడ్మిషన్ల కోసం డిమాండ్ పెరుగుతోందని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.

# కోరుట్లలో రౌడీషీటర్ విత్తనాల నాగరాజు అరెస్ట్

- వ్యాపారవేత్తలకు ఊరటనిచ్చిన పోలీసులు
- బెదిరింపులు, బలవంతపు వసూళ్లకు చెక్
- పరారీలో ఉన్న మరో నిందితుడి కోసం గాలింపు







**నేటి సాక్షి,కోరుట్ల (రాధారపు నర్సయ్య):** కోరుట్ల పట్టణంలో వ్యాపారవేత్తలను చంపుతానని బెదిరిస్తూ బలవంతపు వసూళ్లకు పాల్పడుతున్న రౌడీషీటర్ విత్తనాల నాగరాజును పోలీసులు అరెస్ట్ చేయడంతో పట్టణ ప్రజల్లో ఊరట లభించినట్లైంది. జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు మెట్ పల్లి డీఎస్పీ ఏ. రాములు ఆధ్వర్యంలో ఈ కఠిన చర్యలు చేపట్టినట్లు కోరుట్ల సిఐ సురేష్ బాబు, ఎస్ఐ చిరంజీవిలు తెలిపారు. గత కొంతకాలంగా కోరుట్ల పట్టణంలోని వ్యాపారవేత్తలను లక్ష్యంగా చేసుకుని చంపుతానని బెదిరిస్తూ బలవంతపు వసూళ్లకు పాల్పడుతున్న విత్తనాల నాగరాజును మంగళవారం పోలీసులు పట్టణంలోనే అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ ఆపరేషన్ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ప్రత్యేకంగా నిర్వహించబడగా, వ్యాపార వర్గాల్లో నెలకొన్న భయాందోళనలు తగ్గుముఖం పట్టాయి. ప్రజల భద్రత కోసం పోలీసులు ఎప్పటికప్పుడు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు ఈ ఘటన స్పష్టం చేసింది. విత్తనాల నాగరాజుపై గతంలో రెండు హత్య కేసులు, బలవంతపు వసూళ్ల కేసులు నమోదు కాగా, పీడీ యాక్ట్ కింద జైలుకు కూడా పంపినట్లు పోలీసులు వెల్లడించారు. తాజాగా అరెస్టు చేసిన ఈ కేసులో అతడితో పాటు మరో నిందితుడు ఉన్నట్లు దర్యాప్తులో తేలగా, ప్రస్తుతం అతను పరారీలో ఉన్నాడు. అతడిని త్వరలోనే పట్టుకుని అరెస్ట్ చేస్తామని పోలీసులు తెలిపారు. ఈ కేసులో ఇంకా ఎవరైనా ప్రమేయం ఉన్నట్లు తేలితే వారందరిపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రౌడీషీటర్ నాగరాజుతోపాటు..అతని సహచరులతో సంబంధాలు కలిగి ఉన్న వారిపై కూడా ప్రత్యేక నిఘా పెట్టినట్లు సిఐ సురేష్ బాబు తెలిపారు. నేరాలకు సహకరించే వారిని కూడా వదిలిపెట్టబోమని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ, ఎవరైనా బెదిరింపులకు గురైతే నిర్భయంగా పోలీసులకు సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. శాంతి భద్రతల పరిరక్షణలో ఎలాంటి రాజీ ఉండదని ఎస్ఐ చిరంజీవి మరోసారి హెచ్చరించారు.





# 'అరైవ్-అలైవ్' విద్యార్థులకు విస్తృత అవగాహన





- ట్రాఫిక్ నియమాలపై ప్రతి విద్యార్థికి అవగాహన అవసరం
- హెల్మెట్ ధరించాలని తల్లిదండ్రులకు విద్యార్థుల లేఖలు

**నేటి సాక్షి,కోరుట్ల(రాధారపు నర్సయ్య):** చిన్న వయస్సులోనే ట్రాఫిక్ నిబంధనలు పాటించే అలవాటు పెంపొందితేనే భవిష్యత్తులో బాధ్యతాయుత పౌరులు రూపుదిద్దుకుంటారని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అభిప్రాయపడ్డారు. 'అరైవ్-అలైవ్' కార్యక్రమంలో భాగంగా జిల్లాలో మూడవ రోజు అన్ని పోలీస్ స్టేషన్ పరిధుల్లో పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు రోడ్డు భద్రతపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ తల్లిదండ్రుల్లో హెల్మెట్ వినియోగంపై చైతన్యం తెచ్చేలా "డియర్ పేరెంట్స్, ప్లీజ్ బై ఏ హెల్మెట్ ఫర్ మీ అండ్ మామ్" అనే సందేశంతో లేఖలు రాసి తమ విజ్ఞప్తిని తెలియజేశారు. విద్యార్థులకు రోడ్డు దాటేటప్పుడు జీబ్రా క్రాసింగ్ వినియోగం, ట్రాఫిక్ సిగ్నల్స్ పాటించడం, స్కూల్ బస్సుల్లో భద్రతా నియమాలపై పోలీసు అధికారులు అవగాహన కల్పించారు. పెద్దలు నియమాలను పాటిస్తేనే పిల్లలు వాటిని అలవాటు చేసుకుంటారని, ఉపాధ్యాయులు మరియు తల్లిదండ్రులు ఈ విషయంలో కీలక పాత్ర పోషించాలని సూచించారు. అనంతరం రోడ్డు భద్రతపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు, ఉపాధ్యాయులు మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# పోచమ్మ గుడికి మార్గం

భూ యజమానికి రూ.18 లక్షల చెక్కు అందజేత



**నేటి సాక్షి, ఎండపల్లి:** మండల పరిధిలోని పాతగూడూరు గ్రామ ప్రజల చిరకాల కోరిక నెరవేరింది. గ్రామంలోని పోచమ్మ గుడికి వెళ్లే దారి ఏర్పాటుకు పీఎస్ఆర్‌గా ప్రసిద్ధి చెందిన పొనుగోటి శ్రీనివాసరావు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు. ఈ మేరకు దారి నిర్మాణానికి అవసరమైన భూమి విషయంలో భాగంగా రూ.18 లక్షల చెక్కును బుధవారం భూమి యజమాని సుంకిశాల శ్రీనివాస్ రావుకు హైదరాబాద్ లో అందజేశారు. దీంతో గుడికి దారి ఏర్పాటుకు మార్గం సుగమమైంది. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తూ, తమ సమస్యను పరిష్కరించిన పీఎస్ఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు. పోచమ్మ గుడికి సరైన దారి లేక ఎన్నో ఇబ్బందులు పడుతున్నామని, ఈ చర్యతో తమకు ఎంతో ఉపశమనం కలుగుతుందని గ్రామస్తులు పేర్కొన్నారు. గ్రామాభివృద్ధికి కట్టుబడి ఇచ్చిన హామీలను అమలు చేస్తున్న పీఎస్ఆర్ చర్యలను ప్రజలు ప్రశంసించారు. కాగా త్వరలోనే దారి నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొంగల జగదీశ్వర్ రెడ్డి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# గుల్లకోట ప్రధానోపాధ్యాయుడికి విద్యాశాఖ ఘన సత్కారం



**నేటి సాక్షి,ఎండపల్లి :** జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం గుల్లకోట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చందూరి రాజిరెడ్డి తన అద్భుత ప్రతిభతో రాష్ట్ర స్థాయి గుర్తింపు పొందారు. పాఠశాల విద్యాసంచాలకులు నవీన్ నికోలస్ బుధవారం రాష్ట్ర కార్యాలయంలో ఆయనను శాలువా, ప్రశంసాపత్రంతో ఘనంగా సన్మానించారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం ద్వారా పాఠశాలలో విద్యార్థుల నమోదును 182కు పెంచడంతో పాటు, మధ్యాహ్న భోజన పథకాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తున్నందుకు ఈ పురస్కారం లభించింది. ప్రభుత్వ పాఠశాలలో కార్పొరేట్ స్థాయి వసతులు కల్పిస్తూ, ఆటపాటలతో కూడిన బోధనను అందిస్తూ రాజిరెడ్డి అందరి దృష్టిని ఆకర్షించారు. సమాజ సహకారంతో నిధులు సేకరించి సుమారు రూ. 2 లక్షలతో పాఠశాలకు రంగులు వేయించడమే కాకుండా, టీవీ ద్వారా డిజిటల్ విద్యను, అదనపు తరగతి గది ఏర్పాటు ద్వారా కంప్యూటర్ విద్యను అందుబాటులోకి తెచ్చారు. విద్యార్థులను విజ్ఞాన యాత్రలకు తీసుకెళ్లడం, పాఠశాల కమిటీల ద్వారా వారిలో నాయకత్వ లక్షణాలను పెంపొందించడం వంటి సేవా కార్యక్రమాలను అధికారులు కొనియాడారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు రాజిరెడ్డిని అభినందించారు.

# శంకర్‌పల్లిలో చలివేంద్రం ప్రారంభం

సీఐ ముదస్సర్ అలీ



**నేటి సాక్షి,శంకర్‌పల్లి:** శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని రైల్వే స్టేషన్ రోడ్డు, పోలీస్ స్టేషన్ సమీపంలో గల సాన్స్ స్కిన్ అండ్ హెయిర్ ట్రాన్స్ ప్లాంటేషన్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బుధవారం సీఐ మీర్ ముదస్సర్ అలీ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. భానుడి భగభగలతో అల్లాడుతున్న ప్రజల దాహార్తిని తీర్చడానికి ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని కొనియాడారు. ఎస్సై మంజుల మాట్లాడుతూ.. బాటసారులు, స్థానిక ప్రజలు ఈ చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. హాస్పిటల్ నిర్వాహకురాలు డాక్టర్ సాయి సింధు మాట్లాడుతూ.. ఎండల తీవ్రత దృష్ట్యా పట్టణానికి వచ్చే గ్రామీణ ప్రజల ఇబ్బందులను గమనించి ఈ ఏర్పాటు చేశామని తెలిపారు. చలివేంద్రాన్ని ఏర్పాటు చేసిన డాక్టర్ సాయి సింధును సీఐ, ఎస్సైలు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, పాషా, తేజ తదితరులు పాల్గొన్నారు.

# మైనర్ డ్రైవింగ్ వద్దు

**ప్రాణాలకు ముప్పు, తొగుట సీఐ ఎస్.కె. లతీఫ్**



**నేటి సాక్షి,తొగుట(వడ్డే నర్సింలు):** 'అరైవ్ అలైవ్' (Arrive Alive) నాలుగవ దశ కార్యక్రమంలో భాగంగా తొగుట మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులకు రోడ్డు భద్రతపై విస్తృత అవగాహన కల్పించారు. తొగుట సీఐ ఎస్.కె. లతీఫ్, ఎస్సై వి. రవికాంత్ రావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు రోడ్డు భద్రతా నియమాలపై లేఖ రచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. మైనర్లు వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని, మితిమీరిన వేగం, ట్రిపుల్ రైడింగ్ ప్రాణాంతకమని హెచ్చరించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, పాదచారులు రోడ్డు దాటేటప్పుడు జీబ్రా క్రాసింగ్‌ను మాత్రమే ఉపయోగించాలని సూచించారు. అనంతరం తొగుట ఎక్స్ రోడ్డు వద్ద విద్యార్థులు, పోలీస్ సిబ్బందితో కలిసి భారీ మానవహారం ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో నిబంధనలు పాటిస్తూ హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించి వాహనాలు నడుపుతున్న వారికి విద్యార్థులు గులాబీ పూలు ఇచ్చి అభినందించడం అందరినీ ఆకట్టుకుంది. నిబంధనలు పాటించడం ద్వారానే ప్రమాద రహిత సమాజాన్ని నిర్మించగలమని పోలీసులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, పోలీస్ సిబ్బంది మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# 'పోషణ పక్వాడా' కార్యక్రమం



**నేటి సాక్షి,ఎండపల్లి :** మండలంలోని గుల్లకోట గ్రామ అంగన్వాడీ కేంద్రం-1లో గురువారం 'పోషణ పక్వాడా' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గ్రామ సర్పంచ్ గొల్లపెల్లి మల్లేష్ గౌడ్ మాట్లాడుతూ.. గర్భిణీలు, బాలింతలు సమతుల్య ఆహారం తీసుకోవడం ద్వారానే ఆరోగ్యవంతమైన సమాజం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పాలు, గుడ్లు మరియు పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ముఖ్యంగా గర్భిణీలు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని, ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవాలు జరుపుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఒక చిన్నారికి అన్నప్రాసన నిర్వహించారు. గర్భిణీలకు మొదటి 1000 రోజుల ప్రాముఖ్యతను వివరిస్తూ ఆరోగ్యకరమైన జీవనశైలిపై ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం అంగన్వాడీ సిబ్బంది సర్పంచ్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ హెచ్ఎం మునిందర్, అంగన్వాడీ టీచర్లు సువర్ణ, భూలక్ష్మి, పుష్పలత, గంగా జమున, ఎంఎల్‌హెచ్‌పి రక్షిత, ఏఎన్ఎం సునీత, ఆశా వర్కర్లు లక్ష్మి, సుజాత, స్వప్నతో పాటు గర్భిణీలు, తల్లులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

# వికారాబాద్‌లో రైతుల గర్జన

**ఆర్డీఓ కార్యాలయం ముట్టడి**



**నేటి సాక్షి,వికారాబాద్ :** తమ భూములను ప్రభుత్వం బలవంతంగా లాక్కోవడాన్ని నిరసిస్తూ పరిగి నియోజకవర్గం రాపోల్, కాలాపూర్ గ్రామాల రైతులు బుధవారం వికారాబాద్ జిల్లా కేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ ధర్నా కార్యక్రమానికి ధర్మ సమాజ్ పార్టీ అధినేత విశారదన్ మహరాజ్, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు ఎమ్మెల్సీ కవిత హాజరై రైతులకు సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి పేరుతో పేద రైతుల భూములను లాక్కోవడం దుర్మార్గమని విమర్శించారు. రైతుల జోలికి వస్తే సహించేది లేదని, వారి భూములను కాపాడే వరకు పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. ముఖ్యమంత్రి సొంత జిల్లాలో రైతులు రోడ్డెక్కి ప్రాధేయపడుతున్నా ప్రభుత్వం కనికరించకపోవడం దారుణమని విశారదన్ మహరాజ్ ఆవేదన వ్యక్తం చేశారు. రైతులను ఇబ్బందులకు గురిచేయడం మానుకోవాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాపోల్, కాలాపూర్ గ్రామాల రైతులు, ధర్మ సమాజ్ పార్టీ నాయకులు, తెలంగాణ జాగృతి కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# ఘనంగా వీడ్కోలు సమావేశం







**నేటి సాక్షి, చౌడేపల్లి:** చిన్నతనంలో చిలిపి చేష్టలతో అటు ఉపాధ్యాయులతో, ఇటు స్నేహితులతో మమేకమై పాఠశాల విద్య అంటే మొదటి సారి రుచిచూసిన ప్రాథమిక పాఠశాలలో జ్ఞాపకాలు పంచుకుంటే ఎలా ఉంటుందో తెలియని వయస్సులో చేసిన మధుర జ్ఞాపకాలు పంచుకుంటుంటాము. అలాంటి అద్భుత సన్నివేశమే బుధవారం చౌడేపల్లి మండలంలోని చారాల గ్రామపంచాయతీ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఐదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి మండల విద్యాశాఖ అధికారులు కేశవ రెడ్డి, తిరుమలమ్మ ముఖ్యఅథితులుగా హాజరైనారు.ఐదవ తరగతిలో ఇరవై మంది విద్యార్థులకు వీడ్కోలు సమావేశం వారి జవన గమ్యంలో గుర్తుండిపోయే విధముగా చేశారు. భారీ కేక్ కట్ చేసి, విద్యార్థులు నృత్యప్రదర్శన అందరినీ ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ పాఠశాల చరిత్ర ను వివరించారు. విద్యార్థులు మొబైల్ ఫోన్లకు దూరంగా ఉండాలని, ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకాలు వివరించారు. పూజాకార్యక్రమం అనంతరం అందరూ బాగా చదువుకొని, మన పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచిపేరు తేవాలని వారు ఆశిర్వదించారు.విద్యార్థులకు సర్టిఫికెట్స్ ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు లక్ష్మినారాయణ ప్రసాద్, గణేష్, సుబ్రమణ్యం, వసంత, స్రవంతి, ఎస్ఎంసి కమిటీ చైర్మన్ శ్రీనివాసులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాల రహిత సమాజమే లక్ష్యం



**"నివారణ్" కార్యక్రమ ప్రారంభం**

నేటి సాక్షి,వికారాబాద్ : కౌమారదశలో ఉన్న విద్యార్థులు మాదకద్రవ్యాల బారిన పడకుండా కాపాడేందుకు వికారాబాద్ జిల్లా యంత్రాంగం నడుం బిగించింది. జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ, ఎస్పీ స్నేహ మెహ్రా ఆదేశాల మేరకు పోలీస్ శాఖ, విద్యాశాఖ, ఎడిస్టిస్ ఫౌండేషన్ మరియు క్రియేట్ ఎడ్యుటెక్ సంయుక్త ఆధ్వర్యంలో "నివారణ్" (చీ×వాూ=ూచీ) - జిల్లా స్థాయి డ్రగ్-ఫ్రీ వెల్నెస్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. పీర్ ప్రెజర్, అవగాహన లోపం వల్ల విద్యార్థులు దారి తప్పకుండా, వారికి అవసరమైన జీవన నైపుణ్యాలను అందించడం ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశ్యం. శ్రీ సాయి డెంటల్ కాలేజీ వేదికగా జరిగిన ఈ సదస్సులో మొదటి దశలో ఎంపిక చేసిన 33 పాఠశాలల్లో ఆన్‌లైన్ కోర్సు ద్వారా అవగాహన కల్పించనున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారిణి జి. రేణుకా దేవి మాట్లాడుతూ.. బాధ్యతాయుతమైన యువతను తీర్చిదిద్దడంలో పాఠశాలల పాత్ర కీలకమని పేర్కొన్నారు. డీటీసీ డీఎస్పీ శ్రీనివాసులు మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టడంలో ముందస్తు అవగాహన ప్రాముఖ్యతను వివరించారు. క్రియేట్ ఎడ్యుటెక్ వ్యవస్థాపకురాలు సంస్కృతి కొండూరు, ఎడిస్టిస్ ఫౌండేషన్ ప్రతినిధి శ్రీహర్షిత చడ సాంకేతికత ద్వారా విద్యార్థుల్లో మార్పు తెచ్చే విధానాలను వివరించారు. పైలట్ దశ పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో సాయి డెంటల్ కాలేజ్ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సంపత్ కుమార్ రెడ్డి, 33 మంది టీచర్ కోఆర్డినేటర్లు మరియు 400 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు.

# గజ్వేల్ జిల్లా ఆసుపత్రిలో అరుదైన శస్త్ర చికిత్స



- **139 కిలోల ఊబకాయ గర్భిణీకి సురక్షిత ప్రసవం**
- **తల్లి, బిడ్డ ఇద్దరూ క్షేమం : సూపరింటెండెంట్ డాక్టర్ అన్నపూర్ణ**

**నేటి సాక్షి గజ్వేల్ :** సిద్దిపేట జిల్లా గజ్వేల్ డిస్ట్రిక్ట్ హాస్పిటల్ వైద్యులు బుధవారం ఒక అరుదైన, అత్యంత క్లిష్టమైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించి తమ ప్రతిభను చాటుకున్నారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా యాప్రాల్ గ్రామానికి చెందిన సాయిరాం పూజ (29) అనే గర్భిణీకి వైద్యులు సురక్షితంగా ప్రసవం నిర్వహించారు. పేషెంట్ సాయిరాం పూజ 139 కిలోల ఊబకాయం (Obesity)తో పాటు థైరాయిడ్ సమస్యతో బాధపడుతున్నారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో సంప్రదించగా సుమారు రెండు లక్షల వరకు ఖర్చు అవుతుందని చెప్పడంతో ఆర్థిక స్తోమత లేక తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఈ క్రమంలో ఒక మిత్రుని ద్వారా గజ్వేల్ జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అన్నపూర్ణను సంప్రదించారు. డాక్టర్ అన్నపూర్ణ ప్రత్యేక చొరవ తీసుకుని వైద్య బృందాన్ని ఏర్పాటు చేశారు. వైద్యుల సమన్వయంతో సురక్షితంగా శస్త్రచికిత్స నిర్వహించి పూజకు 3.75 కిలోల బరువైన ఆడ శిశువు జన్మనిచ్చింది. ప్రస్తుతం తల్లి, బిడ్డ ఇద్దరూ క్షేమంగా ఉన్నారని డాక్టర్ అన్నపూర్ణ తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ అన్నపూర్ణ మాట్లాడుతూ ఊబకాయం అనేది నిర్లక్ష్యం చేయరాని పెద్ద సమస్య అని పేర్కొన్నారు. ఊబకాయం వల్ల భవిష్యత్తులో బీపీ, షుగర్, గుండె సమస్యలు, క్యాన్సర్ వంటి అనేక ముప్పులు ఏర్పడే అవకాశముందని హెచ్చరించారు. అలాగే థైరాయిడ్ సమస్య ఉన్నవారిలో అధిక బరువు, నీరసం, అలసట, చలిని తట్టుకోలేకపోవడం, వణుకు, నిద్రలేమి, జుట్టు రాలడం, చర్మం పొడిబారడం, మలబద్ధకం, గుండె వేగంలో మార్పులు, డిప్రెషన్ వంటి లక్షణాలు కనిపిస్తాయని తెలిపారు. ఇలాంటి లక్షణాలు ఉన్న మహిళలు తక్షణమే ఆసుపత్రిని సంప్రదించాలని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉన్న ఆధునిక వైద్య సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. ఈ క్లిష్టమైన శస్త్రచికిత్సను టీమ్ వర్క్‌తో విజయవంతంగా పూర్తి చేసిన వైద్యులు, సిబ్బందిని డాక్టర్ అన్నపూర్ణ అభినందించారు. ఈ బృందంలో డాక్టర్ అన్నపూర్ణతో పాటు డాక్టర్ మంజుల, డాక్టర్ త్రివేణి, డాక్టర్ సుశీల, డాక్టర్ సతీష్, అనస్థీషియా డాక్టర్ మైపాల్, నర్సింగ్ సూపరింటెండెంట్ సువర్ణ, ఆంజనేయులు, శ్రీలత, ఓటీ టెక్నీషియన్ రవీందర్, వార్డు బాయ్ బాబి, ఆయమ్మ కవిత, సద్దాం, షబానా తదితరులు పాల్గొన్నారు. గజ్వేల్ నియోజకవర్గ ప్రజలు ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లి ఆర్థిక ఇబ్బందులు పడకుండా జిల్లా ఆసుపత్రిలో నాణ్యమైన చికిత్స పొందాలని డాక్టర్ అన్నపూర్ణ పిలుపునిచ్చారు. పేషెంట్ బంధువులు డాక్టర్ అన్నపూర్ణకు, ఆసుపత్రి వైద్యులు, సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లే ఆర్థిక పరిస్థితి లేక మానసికంగా కృంగిపోయిన సమయంలో ప్రభుత్వ ఆసుపత్రిలో ఇంత మంచి వైద్యం అందటం ఆనందంగా ఉందని వారు పేర్కొన్నారు.

# రోడ్డు మీద బాధ్యతాయుత ప్రయాణం అవసరం




- ధర్మపురి సీఐ ఎ.రాం నరసింహారెడ్డి సూచన
- అక్షర హై స్కూల్లో 'అరైవ్-అలైవ్' కార్యక్రమం
- విద్యార్థులకు భద్రత నియమాలపై అవగాహన




**నేటి సాక్షి, ఎండపల్లి:** జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం రాజారంపల్లి అక్షర హై స్కూల్‌లో 'అరైవ్–అలైవ్' రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఐపీఎస్ ఆదేశాల మేరకు, డీఎస్పీ రఘుచందర్ సూచనలతో 99 రోజుల ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా బుధవారం ఈ సదస్సు చేపట్టారు. ధర్మపురి సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎ. రాంనర్సింహరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్లపై ప్రయాణించే ప్రతి వాహనదారుడు బాధ్యతాయుతంగా ప్రవర్తించాలని సూచించారు. తప్పనిసరిగా హెల్మెట్ ధరించడం, కారులో ప్రయాణించే వారు సీట్‌బెల్ట్ పెట్టుకోవడం అలవాటు చేసుకోవాలని తెలిపారు. మద్యం సేవించి వాహనం నడపరాదని, ట్రిపుల్ రైడింగ్ చేయరాదని హెచ్చరించారు. మైనర్ పిల్లలు వాహనాలు నడపకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని, వారికి వాహనాలు ఇవ్వడం చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతను పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని ఆయన తెలిపారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో హెల్మెట్ వినియోగంపై తమ తల్లిదండ్రులకు ఉత్తరాలు రాయించే పోటీ నిర్వహించారు. ఈ పోటీలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో వెల్గటూర్ ఎస్సై పి. ఉదయ్ కుమార్, ఏఎంవీఐ రియాజ్, పాఠశాల యాజమాన్యం ఎల్లాల ఆశిరెడ్డి, అనంతరెడ్డి, ఉప సర్పంచ్ మెరుగు జానీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమం ద్వారా గ్రామ ప్రజల్లో రోడ్డు భద్రతపై చైతన్యం పెంపొందించడమే లక్ష్యమని అధికారులు తెలిపారు.

# "జై భీమ్ నినాదాలతో మార్మోగిన మిర్యాలగూడ"






- ఘనంగా అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు
- రాజీవ్ చౌక్ నుండి రైతు బజార్ వరకు భారీ ర్యాలీ
- అంబేద్కర్ సిద్ధాంతాలే మనకు మార్గదర్శకాలు : ఎమ్మెల్యే బిఎల్ఆర్




పాల్గొన్న ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే వేముల వీరేశం, ఎమ్మెల్యే బిఎల్ఆర్, డీసీసీ అధ్యక్షులు పున్నా కైలాష్ నేత, రాష్ట్ర నాయకులు స్కైలాబ్, ప్రాజా, కుల సంఘాల, దళిత, వివిధ రాజకీయ పార్టీల నేతలు

**నేటిసాక్షి, మిర్యాలగూడ** భారత రాజ్యాంగ నిర్మాత భారతరత్న డా.బీఆర్ అంబేద్కర్ గ135వ జయంతి వేడుకలను స్థానిక శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం అధికారికంగా, దళిత సంఘాలు, ప్రజాసంఘాలు, అన్ని కుల సంఘాలు, రాజకీయ పార్టీలతో కలిసి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా, ప్రభుత్వ విప్ నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, నల్లగొండ డీసీసీ అధ్యక్షులు పున్నా కైలాష్ నేత లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి రాజీవ్ భవన్ లో అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి, ఘన నివాళులర్పించారు. అనంతరం అన్ని కుల సంఘాల, రాజకీయ పార్టీల నాయకులతో కలిసి రాజీవ్ చౌక్ నుండి బస్టాండ్ నందు గల అంబేద్కర్ విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించి, అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం నాయకులు, సంఘాల నాయకులతో కలిసి అంబేద్కర్ విగ్రహం ప్రాంగణంలో న్యాయ భోజ్–సహా పంక్తి భోజనాల నిర్వహించారు. అనంతరం బీఎల్ఆర్ బ్రదర్స్ ఆధ్వర్యంలో ఉచిత బ్లెడ్ బ్యాంక్ ప్రారంభించి, రక్త దాతలు రక్త దానం చేశారు. అనంతరం బీఆర్ఎల్ బ్రదర్స్ ఆధ్వర్యంలో ఉచిత పెరుగన్నం పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమం వేసవి కాలం వరకు కొనసాగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బిఎల్ఆర్ మాట్లాడుతూ, ప్రపంచ మేధావి, భారత రాజ్యాంగ నిర్మాత, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా ఆ మహనీయునికి మీ అందరితో కలిసి, ఇలా ఘనంగా నివాళులర్పించడం చాలా గర్వంగా ఉందని అన్నారు. బాబాసాహెబ్ అందించిన రాజ్యాంగం వల్లే నేడు మనమందరం సమాన హక్కులతో జీవిస్తున్నాం అని, కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ రాజ్యాంగ విలువలను కాపాడటంలో ముందుంటుందని, దళితులు, గిరిజనులు మరియు వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం అంబేద్కర్ చేసిన పోరాటం మరువలేనిదన్నారు. ఆయన బాటలోనే నడుస్తూ, ప్రజా ప్రభుత్వం పరిపాలన కొనసాగిస్తుందని అన్నారు. "చదువుకో, వ్యవస్థీకృతం అవ్వు, పోరాడు" అన్న బాబాసాహెబ్ పిలుపును మన యువత ఆదర్శంగా తీసుకోవాలని, పేదపిల్లలకు నాణ్యమైన విద్యను అందించడమే ఆయనకు మనం ఇచ్చే నిజమైన నివాళి అని, అందులో భాగంగా ప్రజా ప్రభుత్వం రాష్టంలో విద్యకు పెద్ద పీట వేస్తుందని అన్నారు. ప్రజా పాలనలో భాగంగా అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా ఇందిరమ్మ ఇళ్లు మరియు, సన్నబియ్యం, ఇతర సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి పేదవాడికి చేరేలా మా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోంది అన్నారు..చివరగా, దేశంలో ప్రజాస్వామ్యం పరిరక్షించబడాలన్నా, సామాజిక అసమానతలు తొలగిపోవాలన్నా అంబేద్కర్ సిద్ధాంతాలే మనకు మార్గదర్శకాలన్నారు. ఆయన ఆశయ సాధనలో మనమందరం భాగస్వాములం అవుదామని పిలుపునిచ్చారు. ఇలాగే మన మిర్యాలగూడ నియోజకవర్గ అభివృద్ధిలో కూడా కుల, రాజకీయ పార్టీలకి అతీతంగా అందరం ఐకమత్యం తో భాగస్వాములు అవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, పోలీసులు ఉన్నతాధికారులు, మిర్యాలగూడ నియోజకవర్గ అన్ని కుల సంఘాల నాయకులు, ఉద్యోగ సంఘాల నాయకులు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు, దళిత సంఘాల నాయకులు, అంబేద్కర్ అభిమానులు, కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు , కార్యకర్తలు, మరియు బిఎల్ఆర్ బ్రదర్స్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మార్పీఎస్‌లో అంబేద్కర్ జయంతి



**నేటి సాక్షి :** పెద్దకడబూరు భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ గారి 135వ జయంతి వేడుకలను పెద్దకడబూరు మండలం కేంద్రంలోని గ్రామ సచివాలయం–2 వద్ద ఎమ్మార్పీఎస్ (వీ=గూ) ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మండల అధ్యక్షుడు ఎంపీ యువరాజ్ మాదిగ, ఉపాధ్యక్షుడు జె. సతీష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా టీడీపీ కోసిగి మార్కెట్ వైస్ చైర్మన్ బొగ్గుల తిక్కన్న, వైఎస్సార్సీపీ కోసిగి మార్కెట్ యార్డ్ మాజీ వైస్ చైర్మన్ బొగ్గుల అర్లప్ప హాజరయ్యారు. వారు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎంపీ యువరాజ్ మాదిగ, బాలవికాస్ పాఠశాల ఉపాధ్యాయుడు మంచోడి బొజ్జప్ప మాట్లాడుతూ, అంబేద్కర్ ప్రపంచానికి ఆదర్శవంతమైన నాయకుడని కొనియాడారు. ఆయన రచించిన రాజ్యాంగం భారతదేశానికి దిశానిర్దేశం చేస్తోందని పేర్కొన్నారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి తన జీవితాన్ని అంకితం చేసిన మహోన్నత వ్యక్తిగా అంబేద్కర్ నిలిచారని తెలిపారు. అలాగే, అంబేద్కర్ ఆశయాలను ప్రతి గ్రామానికి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని, బహుజనులు ఐక్యమత్యంతో ఆయన ఆలోచనలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. సమాన సమాజ నిర్మాణం ఆయన కలగా మిగిలిపోకుండా దానిని సాకారం చేయడానికి అందరూ కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు బొగ్గుల జాన్, మంచోడి నరసప్ప, జగతప్ప, ఏసేపు తదితరులు పాల్గొన్నారు.

## వేసవి తాపానికి చల్లని ఊరట

**చలివేంద్రం ప్రారంభోత్సవం**



**నేటిసాక్షి,తిరుమలాయపాలెం (రుద్రరాజు):** ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం హస్నాబాద్ గ్రామంలో సర్పంచ్ కొవ్వూరి పద్మ ఆధ్వర్యంలో బొడ్రాయి సెంటర్లో చలివేంద్రాన్ని ప్రారంభించారు. ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా తిరుమలాయపాలెం మండలం ఎస్సై కూచిపూడి జగదీష్ హాజరై రిబ్బన్ కట్ చేసి చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్సై జగదీష్ మాట్లాడుతూ మానవసేవే మాధవసేవ ఆశయంతో హస్నాబాద్ గ్రామంలో చలివేంద్రం ప్రారంభించినందుకు కొవ్వూరి పద్మాను అభినందించారు, వేసవికాలంలో హస్నాబాద్ ఊరు మీదుగా వెళ్లే ప్రయాణికులకు రైతన్నలకు కూలీలు విద్యార్థులు ఎండవేడికి అలసిపోకుండా చల్లని మంచినీరు అందించడమే ముఖ్య ఉద్దేశం అని అన్నారు. పెద్దలు చెప్పినట్టు దప్పిక గొన్నోనికి చల్లని నీళ్లు ఇచ్చినోళ్ళు దేవుడితో సమానం ఆ పుణ్యకార్యంలో హస్నాబాద్ గ్రామం భాగం కావడం మనందరికీ గర్వకారణమని అన్నారు. జిల్లాలో ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఉదయం 6 గంటల నుంచి 10 గంటల మధ్య పనులు పూర్తి చేసుకోవాలని బయటకు వస్తే టోపీ, తలపాగా, గొడుగు వంటివి తప్పనిసరిగా ధరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల నాయకులు కొవ్వూరి సత్తిరెడ్డి, కీసర సంకీర్తన రెడ్డి, కొవ్వూరి సందీప్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ గ్రామ కార్యదర్శి పల్లి వినోద్, మోటపోతుల శ్రీనివాస్, మోటపోతుల చిన్న శ్రీనివాస్, మాగి వెంకన్న, కొత్తపల్లి వెంకటరెడ్డి, నరసింహారెడ్డి కొవ్వూరి వెంకటరెడ్డి, తండా అంజయ్య, పసలాది రవి ,మాగి లక్ష్మణ్, పల్లి భాస్కర్, పల్లి అశోక్ ,పల్లి నవీన్, సన్నాయిల యాదగిరి ,బిక్షం రెడ్డి ,మాగి నరేష్ ,గుండా వీరన్న సంక భాస్కర్, పల్లి వెంకన్న ,పురం మల్లయ్య, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## చర్లపల్లిలో అంబేద్కర్ జయంతి



**నేటి సాక్షి, ఎండపల్లి:** మండలంలోని చర్లపల్లి గ్రామంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలోనూ, మాదిగ కుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలోనూ జరిగిన కార్యక్రమాల్లో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అలాగే గ్రామ యువత నిర్వహించిన బైక్ ర్యాలీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ, అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగం సమానత్వానికి ప్రతీకగా నిలిచిందని పేర్కొన్నారు. సామాజిక న్యాయం, హక్కుల పరిరక్షణ కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ప్రతి ఒక్కరూ ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా గ్రామంలో 'వార్డు బాట' కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రజలు ఎదుర్కొంటున్న డ్రైనేజ్, తాగునీటి సమస్యలు, ఇతర మౌలిక సదుపాయాల లోపాలపై 8వ వార్డు సభ్యురాలు చుంచు పద్మజ–సత్యం, సర్పంచ్ పడిదం లావణ్య–మొగిలికి వినతిపత్రం అందజేశారు. అనంతరం సర్పంచ్ సహా పంచాయతీ పాలకవర్గం క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలను పరిశీలించింది. గ్రామ అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని సర్పంచ్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కో–ఆప్షన్ సభ్యుడు మహ్మద్ రియాజ్, ఉప సర్పంచ్ అల్గం తిరుపతి, కార్యదర్శి తిరుపతి రెడ్డి, సంఘం అధ్యక్షుడు రామగిరి ఆది బాబు, నాయకులు పడిదం నారాయణ, ఉద్యమకారుడు పడిదం వెంకటేష్, సిగిరి ఆనంద్, రామగిరి మల్లేష్, జంజుపెల్లి నరేష్, వార్డు సభ్యులు జెల్ల శ్రీనివాస్, లత, సంఘం సభ్యులు తడగొండ కార్తీక్, చుంచు అనిల్, ఉప్పులేటి నాగేష్, రామగిరి జితేందర్, లచ్చయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ జంజుపెల్లి సురేష్, గ్రామ పెద్దలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

TGTEL/25/A1737 | NETI SAKSHI

# ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక సమావేశం




**నేటిసాక్షి, తిరుమలాయపాలెం (రుద్రరాజు):** తిరుమలాయపాలెం మండల కేంద్రం లో గురువారం నాడు జరిగే 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా రేపు మండల స్థాయి సమావేశం ఏర్పాట్లు పూర్తి తిరుమలాయపాలెం ఎంపీడీవో షేక్ సిలార్ సాహెబ్ తెలిపారు ప్రజా పాలన ప్రణాళికలో భాగంగా ఈ సమావేశంలో 99 రోజుల ప్రణాళిక అమలు విధానం, గ్రామపంచాయతీల్లో గత రెండు నెలలుగా కొనసాగుతున్న పనితీరు, అభివృద్ధి కార్యక్రమాలపై సమగ్రంగా చర్చించనున్నారు. అలాగే ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈ సమావేశం నిర్వహించబడుతోంది. మండలంలోని అన్ని గ్రామపంచాయతీల సర్పంచులు, ఉపసర్పంచులు,

- 40 గ్రామపంచాయతీ ల సర్పంచ్ ఉపసర్పంచ్ ల కు వార్డు మెంబర్లకు స్వచ్ఛంద యువజన సంఘాలకు ఆహ్వానం
- ఎంపీడీవో షేక్ సిలార్ సాహెబ్

వార్డు సభ్యులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు రాజకీయ నాయకులు తప్పనిసరిగా హాజరుకావాలని షేక్ సిలార్ సాహెబ్ విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశం ద్వారా గ్రామస్థాయిలో ప్రజా పాలనను మరింత బలోపేతం చేసి, అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# టాంకామ్ ద్వారా విదేశాల్లో ఉద్యోగావకాశాలు


## మంత్రి వివేక్ వెంకటస్వామి

**నేటి సాక్షి,మంచిర్యాల(శ్రీధర్ దమ్ము):** తెలంగాణ యువతకు విదేశాల్లో గొప్ప ఉద్యోగావకాశాలు కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని కార్మిక మరియు గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు. మంచిర్యాలలోని తన నివాసంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ముఖ్యంగా జర్మనీ వంటి దేశాల్లో ఏటా లక్షలాది ఉద్యోగాల అవసరం ఉందని, ఆ దేశం ఏటా 90 వేల వీసాలు జారీ చేసేందుకు సిద్ధంగా ఉందన్నారు. మన యువత ప్రైవేటు ఏజెన్సీల చేతిలో మోసపోకుండా 'టాంకామ్' ద్వారా జర్మన్ భాషలో శిక్షణ పొంది, నెలకు 2 లక్షలకు పైగా వేతనం లభించే అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని ఏటీసీల ద్వారా 25 వేల మంది యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇచ్చేందుకు ప్రభుత్వం 4,000 కోట్లు ఖర్చు చేస్తోందని మంత్రి వివరించారు. ఇప్పటికే లక్షకు పైగా ఉద్యోగాలు కల్పించిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికే దక్కుతుందని, ఎన్నికల హామీ మేరకు రెండు లక్షల ఉద్యోగాల భర్తీని పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. అలాగే అసంఘటిత కార్మికుల కోసం తెచ్చిన 'తెలంగాణ గిగ్ వర్కర్స్ యాక్ట్' దేశానికే ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. విదేశాల్లో భారతీయ కార్మికులకు ఉన్న మంచి పేరును నిలబెడుతూ, బాధ్యతాయుతంగా పనిచేసి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని నిరుద్యోగ యువతకు ఆయన సూచించారు.



# అనారోగ్యాన్ని జయించి ఇంటర్‌లో అద్భుత ప్రతిభ చాటిన హరిత

**నేటి సాక్షి:** పెద్దకడుబూరు గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీలు బొగ్గుల పరమేష్, జ్యోతి దంపతుల కుమార్తె బొగ్గుల హరిత ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షల్లో అద్భుత ప్రతిభ కనబరిచి గ్రామానికి గర్వకారణంగా నిలిచింది. విజయవాడలోని చైతన్య కళాశాలలో చదువుతున్న హరిత గత ఆరు నెలలుగా తీవ్రమైన అనారోగ్యంతో బాధపడింది. అయితే ధైర్యాన్ని కోల్పోకుండా, కుటుంబ సభ్యుల ప్రోత్సాహం మరియు వైద్యుల చికిత్సతో కోలుకుని పరీక్షలకు హాజరైంది. ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటూనే చదువుపై దృష్టి సారించి కష్టపడి సిద్ధమై 1000 మార్కులకు 956 మార్కులు సాధించడం విశేషంగా నిలిచింది. హరిత సాధించిన ఈ విజయంపై ఉపాధ్యాయులు, బంధువులు, స్నేహితులు, గ్రామ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తూ ఆమెను అభినందించారు. కష్టసాధ్య పరిస్థితుల్లో కూడా పట్టుదలతో ముందుకు సాగితే విజయం సాధ్యమేనని ఆమె నిరూపించిందని పలువురు పేర్కొన్నారు. తమ కుమార్తె విజయం పట్ల తల్లిదండ్రులు పరమేష్, జ్యోతి ఆనందం వ్యక్తం చేస్తూ,




ఆమె ఉన్నత చదువులు అభ్యసించి భవిష్యత్తులో మరింత ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కాలనీవాసులు కూడా హరితకు శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆమెకు ప్రోత్సాహం అందించారు. ఈ సందర్భంగా వీఆర్వా పెద్దకడబూరు మండల అధ్యక్షులు ఎం.పీ. యువరాజ్ మాదిగ హరితను ప్రత్యేకంగా అభినందిస్తూ, ఆమె భవిష్యత్తు మరింత ఉజ్వలంగా ఉండాలని ఆకాంక్షించారు.

# పెద్దకడుబూరు కార్యాలయంలో అంబేద్కర్ జయంతి నిర్వహణ



**నేటి సాక్షి:** పెద్దకడబూరు భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గారి జయంతి వేడుకలు పెద్దకడబూరు మండల పరిషత్ కార్యాలయంలో అత్యంత ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) ప్రభావతి దేవి, మండల పరిషత్ అధ్యక్షురాలు (ఎంపీపీ) శ్రీవిద్య, వైఎస్సార్సీపీ మండల కన్వీనర్ రామ్మోహన్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి, దీపం వెలిగించి ఘన నివాళులు అర్పించారు. అనంతరం నిర్వహించిన సభలో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ భారతదేశానికి అందించిన రాజ్యాంగం ప్రపంచంలోనే అత్యుత్తమమైనదిగా నిలిచిందని పేర్కొన్నారు. సమానత్వం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం వంటి విలువలను ప్రజల్లో నాటిన మహనీయుడు అంబేద్కర్ అని కొనియాడారు. ఎంపీడీవో ప్రభావతి దేవి మాట్లాడుతూ, అంబేద్కర్ చూపించిన మార్గంలో నడుస్తూ సమాజంలోని ప్రతి వర్గం అభివృద్ధి చెందేందుకు కృషి చేయాలని సూచించారు. ఎంపీపీ శ్రీవిద్య మాట్లాడుతూ, గ్రామీణ స్థాయిలోనూ అంబేద్కర్ ఆశయాలను ప్రజలకు చేరవేయడం అత్యవసరమని, ముఖ్యంగా యువత ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని పేర్కొన్నారు. వైఎస్సార్సీపీ మండల కన్వీనర్ రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి అంబేద్కర్ చేసిన సేవలు అపారమని, ఆయన ఆలోచనలను కార్యరూపంలో పెట్టడం ద్వారానే నిజమైన నివాళి అర్పించినట్టవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో లక్ష్మన్న, ఏఎస్ఐ వెంకటేశ్వర్లు తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమం సందర్భంగా అంబేద్కర్ ఆశయాలను కాపాడుతూ సమాన సమాజ నిర్మాణానికి అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# విద్యుత్ ఆర్టిజన్ల సమ్మె

## సీఐటీయూ భారీ మద్దతు

**నేటి సాక్షి, మంచిర్యాల(శ్రీధర్ దమ్ము):** రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ ఆర్టిజన్ కార్మికులు చేపట్టిన సమ్మెకు మద్దతుగా బుధవారం మంచిర్యాలలో సీఐటీయూ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ మరియు ధర్నా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ వరకు ర్యాలీగా వెళ్లిన నాయకులు, కార్యకర్తలు ప్లే కార్డులు ప్రదర్శిస్తూ ప్రభుత్వం మరియు విద్యుత్ యాజమాన్యం తీరుకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ మాట్లాడుతూ.. గత 7 రోజులుగా 20 వేల మందికి పైగా ఆర్టిజన్, అన్‌మెన్ కార్మికులు తమ న్యాయమైన సమస్యల కోసం సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని




విమర్శించారు. ఎన్నికల వేళ ఇచ్చిన హామీలనే కార్మికులు అమలు చేయాలని కోరుతున్నారని, అవి గొంతెమ్మ కోరికలు కావని స్పష్టం చేశారు. సమ్మెను చర్చల ద్వారా పరిష్కరించాల్సింది పోయి, కార్మికులను టర్మినేషన్ చేస్తామని బెదిరించడం, రాయితీల్లో కోతలు విధించడం వంటి చర్యలు ప్రభుత్వ నిరంకుశత్వానికి నిదర్శనమని ఆయన మండిపడ్డారు. ఇటువంటి అణచివేత చర్యలు కార్మికులను మరింత రెచ్చగొడతాయే తప్ప సమ్మెను నివారించలేవని హెచ్చరించారు. ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని ఆర్టిజన్ల సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు సంకె రవి, నాయకులు గోమాస ప్రకాష్, చిన్నయ్య, వెంకటేష్, అంజి, కిష్టయ్య, అరుణ్ కుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# దేవదాయ శాఖ మంత్రిని కలిసిన నరవ దంపతులు



**నేటి సాక్షి :** పెద్దకడబూరు మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డిని రాష్ట్ర రైతు అధికార ప్రతినిధి రమాకాంత్ రెడ్డి దంపతులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గ్రామ చావిడి సమీపంలో ఉన్న శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయం వద్ద అక్రమంగా పట్టాలను పొంది రథశాల నిర్మాణానికి కొందరు అంతరాయం కలిగిస్తున్నారని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అలాగే మండలంలో దేవాలయ భూములు అన్యాక్రాంతం అవుతున్న విషయాన్ని వివరించి, వాటి పరిరక్షణకు తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. మంత్రిని కలిసిన అనంతరం వారు మాట్లాడుతూ, తమ వినతిపై మంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

# కోసిగిలో రూ.5 అన్న క్యాంటీన్



**నేటి సాక్షి :** కోసిగి పట్టణంలో బుధవారం తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి ఎన్. రాఘవేంద్ర రెడ్డి ఆధ్వర్యంలో రూ.5కే భోజనం అందించే అన్న క్యాంటీన్‌ను ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా క్యాంటీన్‌ను ప్రారంభించి పేద ప్రజలకు భోజనం వడ్డించారు. ఈ కార్యక్రమంలో జిల్లా టీడీపీ అధ్యక్షురాలు గుడిసె కృష్ణమ్మ, మంత్రాలయం సొసైటీ చైర్మన్ ఎన్. రామకృష్ణ రెడ్డి, జనసేన ఇన్చార్జి లక్ష్మన్న, బీజేపీ ఇన్చార్జి విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్. రాఘవేంద్ర రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో అన్న క్యాంటీన్ల సేవలను గ్రామాల వరకు విస్తరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పేదలకు తక్కువ ధరలో నాణ్యమైన భోజనం అందించడమే లక్ష్యమని చెప్పారు. స్థానికులు ఈ కార్యక్రమాన్ని అభినందించారు.

# పెద్దకడబూరు కేజీబీవీ బాలికల ప్రతిభ



**నేటి సాక్షి:** పెద్దకడబూరు స్థానిక కేజీబీవీ (కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం) విద్యార్థినులు ఇంటర్మీడియట్ పరీక్షల్లో విశేష ప్రతిభ కనబరిచి మరోసారి తమ ప్రతిభను చాటుకున్నారు. సెకండ్ ఇంటర్ ఎంపీసీ గ్రూపులో మొత్తం 37 మంది బాలికలు పరీక్షలు రాయగా, అందులో 33 మంది ఉత్తీర్ణులై సుమారు 73 శాతం ఉత్తీర్ణత నమోదు చేశారు. ఇందులో నాగలక్ష్మి 958 మార్కులు, ఇందు 916 మార్కులు సాధించి టాపర్లుగా నిలిచారు. అలాగే ఫస్ట్ ఇంటర్ పరీక్షల్లో 18 మంది విద్యార్థినులు హాజరై, అందులో 13 మంది ఉత్తీర్ణత సాధించి సుమారు 90 శాతం ఉత్తీర్ణతను నమోదు చేశారు. ఈ విభాగంలో సమీరా 447 మార్కులు, సవిత 437 మార్కులు సాధించి అగ్రస్థానాల్లో నిలిచారు. ఈ ఫలితాలు విద్యార్థినుల కృషి, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వానికి నిదర్శనంగా నిలుస్తున్నాయి. పాఠశాల సిబ్బంది, తల్లిదండ్రులు ఈ విజయంపై ఆనందం వ్యక్తం చేస్తూ విద్యార్థినులను అభినందించారు.